

బొల్లోజు బాబా కవిత్వం







నోట్.....

నేను ఇంతవరకూ మూడు కవిత్వ సంపుటులను వెలువరించాను. అవి ఆకుపచ్చని తడిగీతం (2008), వెలుతురు తెర (2016), మూడో కన్నీ చుక్క (2019).

ప్రస్తుతం నాలుగవ కవిత్వ సంపుటిని వెలువరించే పనిలో ఉన్నా .

ఈ సందర్భంగా ఇది వరలో తెచి న మూడు సంపుటులను ఒక ఫైలుగా చేసి అందిస్తున్నాను. ఆసక్తి కలిగినవారికొరకు .....

భవదీయుడు

బొల్లోజు బాబా

11-6-2026

బొల్లోజు బాబా

మూడో కన్నీటి చుక్క



poetry

మూడో కన్నీటి చుక్క

బొల్లోజు బాబా

మూడో కన్నీటి చుక్క

బొల్లోజు బాబా

డిశంబరు 2019

వెల - `100/-

కాపీల కొరకు
బొల్లోజు బాబా
30-7-31
సూర్యనారాయణ పురం
కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా
ఫోన్: 0884/2368189
9849320443
bollojubaba@gmail.com

కవర్ డిజైన్: అక్బర్
గెటప్: చిన్నారి

ముద్రణ: రాంషా ప్రెస్, సామర్లకోట

A Few Tearful Pages from a Social Scientist

వొక సంపుటి వెలువడిన తరవాత కవి ముందు మహాద్వారమేదో తెరుచుకుంటుంది.

ఆ ద్వారాన్ని దాటుకొని అతను యెటు వైపు అడుగేస్తాడా అని లోకం కనీసం పది కళ్ళతో యెదురుచూస్తుంది. అందులో కొన్ని కళ్ళు పచ్చగా అసూయతో– కొన్ని కనిపించీ, యింకొన్ని కనిపించని– చూస్తూ వుంటాయి. చాలా కష్టం! చాలా అయిష్టంగా కూడా వుంటుంది. అట్లా అని తెరుచుకున్న తలుపుని మూసేసి వెనక్కి వెళ్లలేడు కవి. ముందుకే వెళ్ళాలి. ముఖ్యంగా చాలా కవిత్వ పుస్తకాలు వెలువడుతున్న కాలంలో తనదే అయిన దారీ, చూపూ వుంటే తప్ప అట్లా ముందుకు వెళ్ళడం సాధ్యం కాదు. అవేమీ లేకుండానే కొంతమంది ముందుకు వెళ్తున్నామన్న భ్రమలో బతికేస్తూ వుంటారు. ఆ భ్రమని పాఠకులు బ్రేక్ చేసి, వాస్తవంలోకి ఈడ్చి కొడ్తారు, నిశ్శబ్దమైన నిరాకరణతో–

నన్ను నేను కూడదీసుకునే ప్రయత్నంలో ఇద్దరు కవుల్ని ఈ మధ్య మార్చి మార్చి చదువుతున్నాను. మార్చి మార్చి చదవడం అంటే కాసేపు ఈ కవి పేజీలు కొన్ని, ఇంకాసేపు ఆ కవి పేజీలు కొన్ని– ఇద్దరినీ వొకేసారి చదువుతున్నా. ఆ ఇద్దరు: వొకరు మన కవి బాబాజీ. మరొకరు: వాల్ట్ విట్మన్.

1

బాబా రెండో కవిత్వ పుస్తకం నాకు అంది, చాలా కాలమే అయింది. ఈ లోపు నా జీవితంలో వూహించని విషాదం ఎదురైంది. అమ్మ పోయింది. కవిత్వం చదివే మనసూ లేదు. ఇక నాలుగు మాటలు రాసే చేతులేవో పడిపోయినట్టుగా అనిపించింది. కానీ, బాబా కవిత్వం మధ్యలో చదువుతూనే వున్నాను. చదువుతూ చదువుతూ ఆగిపోతున్నాను. ఆగిపోయిన చోట యేదో వెతుక్కుంటూ వున్నా. అట్లా వెతుక్కుంటున్నప్పుడు మరీ ముఖ్యంగా వొక కవిత దగ్గిర కాస్త యెక్కువ సేపు నిలిచి వున్నాను.

ఆ కవిత శీర్షిక: ఒక కవిని కలిశాను
రేపతను తన ఇంటిలో ఉండకపోవచ్చు
రేపతను తన దేహంలో ఉండకపోవచ్చు
రేపతను తన ఆత్మలో ఉండకపోవచ్చు
కానీ తన పేరులో సజీవంగా ఉంటాడు
ఇన్ని సంవత్సరాల జీవితాన్నీ
తన పేరులో దాచుకొన్నాడు
అక్షరాలుగా, వాక్యాలుగా, కవిత్వంగా....

మరణాలూ, జననాలూ, ఉత్సవాలూ, నిరుత్సాహాలూ మామూలు మనిషికీ వుంటాయి. వాటిని గుర్తు పెట్టుకోడానికో, మరచిపోడానికో అతనూ యేదో చేస్తాడు. బహుశా, వొక స్నేహితుడి దగ్గిరకెళ్లి భోరున ఏడుస్తాడు లేదంటే కడుపారా నవ్వుకుంటాడు. గుంభనగా వుండే మనిషి అయితే లోలోపలే వుండిపోయి, బయటికి రాలేక తనలో తాను పోరాడుతూ వుండిపోతాడు. కానీ, కవి మామూలు మనిషి కాదు. కవి దగ్గిర కొన్ని పదాలుంటాయి. వాటిని వాక్యాలుగా అల్లే శక్తి వుంటుంది. ఆ శక్తి కొన్ని సార్లు కవిని ఆదుకుంటుంది లేదా కవి మనసుతో ఆడుకుంటుంది. ఆ పదాలతో కవి నిజంగానే తన ఏడుపూ, సంతోషమూ చెప్పచ్చు. లేదంటే, పదాలకు రంగులద్ది మోసం చేయచ్చు. Replacement జరగాలి. అది యెట్లా అయినా జరగచ్చు. అది యెట్లాంటి Replacement?

బాబా అంటున్నాడు:
రేపతను తన ఇంటిలో ఉండకపోవచ్చు
రేపతను తన దేహంలో ఉండకపోవచ్చు
రేపతను తన ఆత్మలో ఉండకపోవచ్చు

మూడు రకాల Replacements – ఇల్లు, దేహం, ఆత్మ! అది తేలిక కాదు. కవికే కాదు, మామూలు మనిషికి కూడా తేలిక కాదు.

2

కొంత దూరం నడిచాక కవికి భాష విధించే ఖైదు భారమైపోతుంది.

అంటే, తను వాడుతున్న భాష కటకటాలయం అవుతుంది. ఆ కొద్ది దూరం తరవాత కవి వెతుకులాట అంతా భాష గురించే. భాషని శుభ్రం చేసుకోవాలన్న పట్టుదల పెరుగుతుంది. అప్పుడు ఆ కవి యే భాష వైపు కదులుతాడన్నది అతని

దృక్పథాన్ని బట్టి వుంటుంది. నా మటుకు నేను colloquial అంటే రోజువారీ జీవితం వైపు మళ్లే కవిత్వం మీద వొక రకమైన పక్షపాతం. ఎందుకంటే, సాహిత్య భాషకి ఎదురుగా సాధారణ భాషని నిలబెట్టడం పెద్ద యుద్ధం కాబట్టి!

బాబా మొదట బుద్ధిజీవి. అతనికి స్థానిక చరిత్రలూ, సంస్కృతుల మీద వున్న ఆసక్తీ, పరిశోధనా అనుభవం చాలా మటుకు తన కవిత్వ వ్యక్తిత్వాన్ని కూడా ప్రభావితం చేస్తూ వుంటాయి. అట్లాగే, కవిత్వ విమర్శ మీద గత కొంతకాలంగా నిక్కచ్చిగా గొంతు విప్పి, పరిభాష వెతుక్కుంటున్న poet-critic బాబా. యిక్కడ ఆ రెండు కాళ్లే అనేక పడవల మీదకి వెళ్ళి, నదిని దాటుకొని రావాలని ప్రయత్నించడం మనం ఈ కొంతకాలంగా చూస్తున్నాం. స్థానిక చరిత్రల మీద పనిచేస్తున్న శోధకుడికి వెంటనే నచ్చే మరో సాహిత్య శిల్ప ధోరణి: narration.

Narrative poetry మనకేమీ కొత్త కాదు. అయితే, అత్యాధునిక సందర్భంలో ఈ విధమైన నిర్మాణం వెంట ముఖ్యంగా రెండు ప్రయోజనాలున్నాయి. వొకటి: సంప్రదాయ కవిత్వ శైలిని నిరాకరించడం, రెండు– కవిత్వంలో వొదగని సాంస్కృతిక లక్షణాలను స్వీకరించడం. ఈ రెండు పనులూ చక్కగా చక్కదిద్దుతున్నాడు బాబా.

ముఖ్యంగా– ఈ కొత్త కవిత్వ సంపుటిలో బాబా Narrative poetry కి సంబంధించిన అనేక కోణాలని మనకి పరిచయం చేస్తున్నాడు. బహుశా, ఈ సంపుటి ప్రధానంగా తలపెట్టిన task అదే! పైన చెప్పిన కవితలో ఇతర అంశాలు అనేకం వున్నా, అందులోని narration మనల్ని కట్టిపడేస్తుంది.

కనీసం మూడు రకాల narrative పద్ధతుల్ని బాబా వాడుతున్నాడు. నేరుగా కథనం చేయడం ఇందులో ఎక్కువగా కనిపిస్తున్న పద్ధతి.

ఉదాహరణకు:

జీవించటమే.......అనే కవిత చూడండి:

ఓ రోజు హఠాత్తుగా ఒకదారి తన గమ్యాన్ని మరచిపోయింది. చాలా బెంగ పట్టుకొంది దానికి, గమ్యం లేని జీవితమేమిటని. తన గమ్యాన్ని వెతుక్కొంటూ ప్రయాణం కట్టిందా దారి. కనిపించిన ప్రతి ఒక్కరిని అడుగుతోంది.

యిలా మొదలై ఈ కథ చాలా దూరం వెళ్తుంది. చివరికొచ్చేసరికి బాబా అసలు కథ చెప్తాడు. ఇది నేరుగా కథ చెప్పినట్టే వుండి, కొన్ని జీవన దృశ్యాలను ఆవిష్కరించే ప్రతీకల మీదుగా తుది మజిలీ చేరుకుంటుంది.

ఫ్రాగ్మెంట్స్ అనే శీర్షిక కింద రాసిన శకలాల్లో కూడా కథనాత్మకతే కనిపిస్తుంది. అయితే, ఈ కథనాత్మకత యింకొంచెం గాఢంగా రూపం దిద్దుకుంటుంది.

అందమైన సీతాకోకలు
గాల్లో తేలిగ్గా అలా ఎగిరే దృశ్యం
హాయిగా అనిపించేది
ఒకరోజు
రైల్వే ట్రాక్ పై చెత్త ఏరుకొంటున్న
మురికిబట్టల సీతాకోకను
చూసే వరకూ.....

ఈ కవిత నిజానికి శకలం కాదు. కొద్ది వాక్యాల్లోనే వొక దీర్ఘ కథకి కావలసిన సామగ్రి నింపుకున్న నిర్మాణ చాతుర్యం ఇందులో వుంది. ప్రతి కవీ కొన్ని పాత్రల చుట్టూ తన కథే చెప్తాడు. అయితే, బాబా కవితల్లో పాత్రలకు ఆ ఆత్మకథాత్మకతని మించిన లక్షణాలు కనిపిస్తాయి. ఈ విధంగా సమకాలీన కవిత్వంలో కవులు చేస్తున్న ప్రయోగాలకు భిన్నమైన ధోరణిలో వెళ్తున్నాడు బాబా.

3

ఆశ్చర్యం యేమిటంటే, క్రమంగా తెలుగు కవిత్వంలో కవిత్వాన్ని మాత్రమే విశ్లేషించే సాధనాలు లేవు. ఎంతోమంది కవిత్వ విమర్శకులు ఆధునిక కవిత్వ ప్రారంభ దశ నుంచీ వస్తున్నప్పటికీ ఇప్పటికీ కవిత్వ విమర్శ సాధనాలను సృష్టించుకోలేకపోయాం. చేకూరి రామారావు లాంటి వారు భాషాశాస్త్రం కోణం నుంచి చేసిన ప్రయత్నాలు ఆ తరవాత అంతగా అనుసరించిన వాళ్ళు కూడా లేరు. ఆ రకంగా చూస్తే, కవిత్వ విమర్శ పరిభాష మనకింకా ఏర్పడలేదు. అదొకటి ఏర్పడాల్సి వుందన్న ఆలోచన కూడా నెమ్మదిగా పోతోంది.

బాబాలో కవీ, విమర్శకుడూ ఇద్దరూ పుష్కలంగా వున్నారు. వాళ్ళ ప్రపంచాలు అంత భిన్నమైనవేమీ కాదు. అయితే, వాళ్ళిద్దరి మధ్యా సరిగా వంతెన కట్టే విశ్లేషణ ఏదో జరగాల్సిన సందర్భం దగ్గిర పడిందని ఈ కొత్త కవిత్వ సంపుటి చదువుతున్నప్పుడు అర్థమైంది. కవిగా తన దారి ఏమిటో వెతుక్కోడానికి బాబా కవిత్వ విమర్శలోకి వచ్చాడనీ నాకు గట్టిగానే అనిపిస్తుంది.

సృజన అనే కవితలో బాబా అంటాడు:
అంతకు ముందు ఏవి లేవో
వాటిని కొందరు
గొప్ప కాంక్షతో, దయతో
అన్వేషించి
అక్షరాల్లో మరోప్రపంచాల్ని
శిలల్లో భంగిమల్ని
రంగుల్లో ప్రవహించే దృశ్యాల్ని
ఆవిష్కరిస్తూంటారు

ఇది కవిత్వంలో పొదిగిన తన ఆత్మకథ. ఇది బాబా కవిత్వ విమర్శకి కూడా వర్తించే అంశమే. బాబా ఒక గొప్ప కాంక్షతో కవిత్వంలోకీ, కవిత్వ విమర్శలోకీ బయలుదేరాడు. ఒక సామాజిక శాస్త్రజ్ఞుడిగా అతనికి అన్వేషణా, ఆవిష్కరణ అనే రెండు concepts కూడా తోడవుతున్నాయి. అంతమంది ఒక చోట కలిసే బహుళత్వం తెలుగు కవిత్వానికి గొప్ప బహుమతి.

నవంబర్ 27, 2019

– అఫ్సర్

కృతజ్ఞతలు

ప్రేమతో నా కవిత్వాన్ని నాలుగు వాక్యాలతో తడిపిన అఫ్సర్ గారికి

వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నన్ను ముందుకు నడుపుతూన్న నా సాహితీగురువు శ్రీ శిఖామణి గారికి

ప్రేరణగా నిలిచి, స్ఫూర్తి నిచ్చే శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి, శ్రీమతి వాడ్రేవు వీరలక్ష్మీదేవి గారికి , శ్రీ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి గారికి,

నన్నెంతో ప్రోత్సహించే శ్రీ గనారా గారికి

అందమైన ముఖచిత్రాన్ని ఇచ్చిన అక్బర్‌కు, వెనుక పేజి రూపొందించిన బాల్యమిత్రుడు చిన్నారికి

ఈ పుస్తకం ఇలా రూపుదిద్దుకొనే ప్రక్రియలో ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చిన శ్రీ సుంకర గోపాల్ కు

ప్రూఫ్‌రీడింగ్ చేసిన సోదరి శ్రీమతి లక్ష్మినాగమణికి

నా భార్య శ్రీమతి సూర్యపద్మ, సోదరులు శ్రీవెంకటేశ్వర ప్రసాద్, దుర్గాప్రసాద్, సోదరిలు పద్మప్రియ, భారతి, మా అమ్మాయి అపరాజిత, అబ్బాయి బసవశ్రీథర్ లకు

ఇంకా –

శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, శ్రీ రెంటాల శ్రీవెంకటేశ్వర రావు, శ్రీ యాకూబ్, డా.రాధేయ, శ్రీ జి. లక్ష్మినరసయ్య, శ్రీ సీతారాం, శ్రీ ఆకెళ్ల రవిప్రకాష్, శ్రీ అఫ్సర్, డా.శైలజ కాళ్ళకూరి, శ్రీ పి.ఆర్.ఎల్. స్వామి, శ్రీ మాకినీడి సూర్యభాస్కర్. శ్రీ అద్దేపల్లి ప్రభు, శ్రీ పుప్పాల శ్రీరాం, శ్రీ మార్ని జానకిరామ్ చౌదరి, శ్రీ జోశ్యుల కృష్ణబాబు, శ్రీవత్స రామకృష్ణ, శ్రీ అవధానుల మణిబాబు, శ్రీ చెల్లి రాం, శ్రీ మధునాపంతుల, శ్రీ అనిల్ డాని, డా. హరి రామ్ ప్రసాద్, ఫణి, సారథి, ప్రభాకరరావు, శ్రీ అశోక్ కుమార్, శ్రీ కలిదిండి వర్మ, ... అంతర్జాలంలో నా రచనలను చదివి ప్రోత్సహించే పెద్దలకూ, మిత్రులందరకూ....

భవదీయుడు
బొల్లోజు బాబా

అనుక్రమణిక

ఒక దుఃఖానికి కొంచెం ముందు...

అప్పటికింకా అతను
చెట్టుకొమ్మకు పిడికెడు మట్టై
వేలాడలేదు
చేనుగట్టుపై కూర్చొని
ఎండిన పంటను
ఓదారుస్తున్నాడు, ఇసుక
నిండిన హృదయంతో.
..
అప్పటికింకా అతని భార్యలో
సగభాగం ఖననం
చేయబడలేదు
కళాయిపోయిన అద్దంలో
చూసుకొంటూ నుదుటిపై
సూర్యబింబమంత కుంకుమ దిద్దుకొంటోంది.
..
అప్పటికింకా ఆ చీర
ఉరితాడుగా మారలేదు
ఒక్క ఉతుకు వానకే
రంగువెలసిన ఆకాశంలా
దండంపై వట్టిపోయి వేలాడుతోంది
..

అప్పటికింకా ఆ చెట్టుకొమ్మ
ఉరికంబం పాత్రను
ధరించలేదు
పక్షిగూడు దిశగా పాకుతున్న
పామును
శ్రద్ధగా చూస్తోంది.
..
అప్పటికింకా ఈ ప్రపంచానికి
తెలీదు
రేపు ఉదయం ఒకడు దాని
నాగరికత అంతా ఒక కుట్ర అని
ప్రకటించబోతున్నాడని.
ఏ దోషం చేయనిదానిలా
ప్రశాంతంగా నిద్రిస్తూంది.

3 June 2017

కలలు

జీవితం అనే పదునైన కత్తి
కాలాన్ని
ఆఫీసు, అనుబంధాలు, స్వప్నాలుగా
ముక్కలు ముక్కలు చేసి వడ్డిస్తుంది.

దినాంతాన
స్వప్నాలు మాత్రమే
మన జేబులో మిగిలే
చివరి చిల్లర నాణేలు

29 August 2016

ఒక కవిని కలిసాను

పరవళ్ళు తొక్కుతూ నినదించి నినదించి
ప్రవహించినంత మేరా పచ్చదనాన్ని పోటెత్తించి
ప్రశాంతంగా కాల సముద్రంలో కలిసే
నది లాంటి ఒక కవిని కలిసాను

ఎముకల్ని కప్పుతూ వెలుతురు పొరలాంటి
ముడుతలు పడిన మెత్తని చర్మం.
ఆ దుర్బల దేహంలో ఇంకా మిగిలే ఉన్న
కొన్ని రక్తపు చుక్కల వెలుగు అది.

అతని చేతిని నా చేతుల్లోకి తీసుకొన్నాను
పావురం కన్నా మెత్తగా
నీరెండ కన్నా వెచ్చగా
కవిగా బ్రతికిన క్షణాల వాసన వేస్తూ
అతని చేయి.

ఒకనాటి ప్రయాణాలు, కొన్ని మార్గాలు
మరికొన్ని సంధ్యలు
సన్నని సెలయేరై ప్రవహించాయి మా చేతుల మధ్య
ఏదో అదృశ్య వాగ్దానం గలగలమంది.

రేపతను తన ఇంటిలో ఉండకపోవచ్చు
రేపతను తన దేహంలో ఉండకపోవచ్చు
రేపతను తన ఆత్మలో ఉండకపోవచ్చు
కానీ తన పేరులో సజీవంగా ఉంటాడు

ఇన్ని సంవత్సరాల జీవితాన్నీ
తన పేరులో దాచుకొన్నాడు
అక్షరాలుగా, వాక్యాలుగా, కవిత్వంగా.....

పసుపుపచ్చని ఎండుటాకులాంటి
అతని చేయి నా చేతుల్లోంచి
మెత్తగా జారిపోయింది
గడియారంలోని ఇసక ధారలా

చిన్నపిల్లలు వేసిన ముద్దుముద్దు రంగుల చిత్రమై
నవ్వుతూ వీడ్కోలు చెప్పిన
పువ్వులాంటి ఒక కవిని కలిసాను నేను.

24 August 2016

వేడుక

పాపం పసివాడు
లోకం
ఎదురుపడ్డప్పుడల్లా
శోకంతో
కన్నీరు మున్నీరయ్యేవాడు

వాడి బాధ చూడలేక
ఓ దేవత వాడి నేత్రాలపై
బీజాక్షరాలను లిఖించి
కన్నీటి బిందువులను కవిత్వంగా మార్చే
వరమిచ్చింది

విషయాన్ని పసికట్టినలోకం
మరిన్ని దృశ్యాలను
అతని కళ్ళలోకి వంపి
కవిత్వాన్ని పిండుకొంటోంది
వేడుకగా

17 April 2017

పిట్టగోడపై వాలిన పిచ్చుక

నువ్వింకా బతికే ఉన్నావా?
చక్రాన్ని కనిపెట్టిన ఆదిమానవుని కుతూహలం
నీకెంత కష్టం తెచ్చిపెట్టిందీ!

ఎలక్ట్రాన్‌లకు
దేహాల్ని ఆత్మల్నీ అప్పగించిన
కాలంనిండా ఇనపవాసన
ఎవరెవరి లాభాలకోసమో
రక్తం కక్కుకొంటోన్న కాలం
ఎక్కడున్నామో తెలీదు
ఎక్కడకు కొట్టుకుపోతున్నామో
అంతకన్నా తెలీదు
తోకకు దారం కట్టిన తూనీగ
రెక్కల తపతపల శబ్దం అంతటా

పిచ్చుకా!
నిన్నటిదాకా నీవు ప్రయాణించిన మార్గాన్నీ
పడిలేచిన నీ ఆత్మనీ చూడాలనిపిస్తోంది
కొత్త రహస్యాలేమైనా బోధపడతాయేమో!

ఇద్దరమూ ఒకే నాగరికతా వేటుకు
తెగిపడ్డ దేహాలం కదా!

(చాన్నాళ్ల తరువాత కనిపించి ఆశ్చర్యపరచిన ఒంటరి పిచ్చుకను చూసాకా)

6 July 2016

నాలుగు స్తంభాలు

మొన్నో నలుగురు వ్యక్తులు
కొండపై రాత్రివిందుచేసుకొన్నాకా
ఉదయానికల్లా కొండ మాయమైందట

ఆ నలుగురే
నదీవిహార యాత్రజరిపిన మర్నాటికల్లా
నదీ, నదీ గర్భపు ఇసుకా అదృశ్యమయ్యాయని
ఆశ్చర్యంగా చెప్పుకొన్నారు

వాళ్ళే
చెట్టపట్టాలేస్కొని పంటచేలల్లో
తిరుగాడిన సాయింత్రానికల్లా
పచ్చని చేలన్నీ కనిపించకుండా పోయాయట

ఈరోజు వాళ్లకో కొత్త ఊహ పుట్టిందట
అందరూ గుసగుసలుగా చెప్పుకొంటున్నారు.
వివరాలింకా బయటపడలేదు

ఇంతలో
'అలా జరగటానికి వీల్లేదు" అంటూ
రోడ్డుపై ఒకడు గొణుక్కుంటూ
గాల్లో ఏవో రాతలు వ్రాసుకొంటూ

అడ్డొచ్చిన నన్ను తోసుకొని సాగిపోయాడు
ఎలా జరగటానికి వీల్లేదటా? అని ఆలోచించాను

వెంటనే స్ఫురించింది
అవునవును
నాకూ అన్పిస్తోంది
ఖచ్చితంగా అలా జరగటానికి వీల్లేదు

5 April 2017

భూసేకరణ

భూమంటే విద్యుత్ కాంతుల్లో
బెల్లీడాన్స్ చేసే ఆటకత్తె – వాడికి

భూమంటే నొసటన దిద్దుకొనే
ఆకుపచ్చని వీభూతిపండు – వీడికి

యుద్ధానంతరం
భూమికి మాత్రం వీరిద్దరూ
ఓ ఆరడుగుల బాధ్యత ....

6 August 2016

మేకింగ్ చార్జీలు లేవు

ఈ రోజు మార్కెట్ సెంటర్ లో
మహాకవి కనిపించాడు.
గాల్లో ఏదో వ్రాస్తున్నట్లు వేళ్ళు తిప్పుతూ
తనలో తనే ఏదో మాట్లాడుకొంటూ
ఓ విస్మృత సామ్రాజ్యంలా నడుచుకుపోతున్నాడు.

మార్కెట్ నిండా మహాకవి పద్యాల్ని
చైనా వస్తువుల్లా కుప్పలు పోసి అమ్ముతున్నారు.
ఎవరో కుర్రవాడు మహాకవి వెంటబడి
"సార్ తీసుకోండి సార్, నాణ్యమైన కవితలు సర్"
అంటూ ప్రాధేయపడుతున్నాడు.
"పొద్దున్న నుంచీ ఏమీ తినలేదు సర్" అరచాడా కుర్రవాడు
"నేనుకూడా" అని గొణుక్కుంటూ సాగిపోయాడు మహాకవి.

నియాన్ లైట్ల వెలుగులో షాపుకు వేలాడదీసిన
కవిత్వ పుస్తకాల్ని చూస్తూ ఓ క్షణం ఆగాడు మహాకవి
"రండి సార్ రండి నిన్నే వచ్చిన సరుకు"
అంటూ షాపువాడు పిలుస్తున్నాడు.
మహాకవి వడివడిగా ముందుకు కదిలాడు.

మహాకవి కవిత్వ ఆథరైజ్డ్ షో రూమ్ వద్ద
క్యూలైన్ కొంచెం కొంచెం పెద్దదవుతూంది.

ఒకనాటి మహాకవి సెక్యూరిటీ గార్డు వేషమెత్తి
షోరూమ్ కి కాపలా కాస్తున్నాడు.

మేకింగ్ చార్జెస్ లభించక
చెట్టుకొమ్మకు వేలాడిన ఎండిన పంటలా
మేకింగ్ చార్జెస్ లభించక
దూలానికి ఉరిబిగించుకొన్న నూలు పోగులా
మేకింగ్ చార్జెస్ లభించక
ద్రావకపు చెరువులో శవమై తేలిన స్వర్ణకారునిలా
మహాకవి
తన బరువుతో తానే కృంగిపోయిన ఈ వృద్ధలోకానికి
అక్షరాలతో ఆయుష్షును పోస్తున్నాడు

"బ్రహ్మాండమైన ఆఫర్
మేకింగ్ చార్జీలు లేవు మహాప్రస్థానం 2.0" అంటో
వీధిమలుపు వద్ద రంగురంగుల హోర్డింగ్
విద్యుత్ కాంతులలో వెలిగిపోతోంది.

కొంతమంది యువకులు మహాకవిని గుర్తించి
అతనితో సెల్ఫీ తీసుకోవటానికి ప్రయత్నిస్తుంటే
"నేను కాదు, నాకేం తెలీదు" అంటూ వారిని తప్పించుకొని
జారిపోయిన ఫాంటును పైకి లాక్కుంటూ
గుంపులో కలిసిపోయి మాయమయ్యాడు.

26 September, 2016

ప్రణయం

అంతవరకూ
ఇరుకిరుగ్గా ప్రయాణించిన కెరటం
తీరం పెదాలపై
నురగ పువ్వులుగా విచ్చుకొంది
నీటి నవ్వులుగా పరుచుకొంది.

బొరియలోకి దూరింది కుర్రపీత
భూమిని మరోసారి ప్రేమించటానికి

22 July 2016

She repeats herself

"ఈ ఫొటోలో ఉన్నది
ఎవరో చెప్పు చూద్దాం" అంటూ
తన ఆరేళ్ళవయసు నాటి
ఫొటోను చూపుతూ అడిగిందామె
తన మూడేళ్ళ కూతుర్ని

"నేనే కొంచెం పెద్దయ్యాకా"
అందా పాపాయి తడుముకోకుండా

14 December 2016
(కొప్పర్తి కవిత ప్రేరణతో)

రహస్య ప్రియురాలు

నాకెప్పుడో
ఇసకలో దొరికిన గవ్వతో
ఏకాంతం దొరికినప్పుడల్లా
మాట్లాడుకొంటాను.

తనకే అర్థమయ్యే భాషలో
పాటలు పాడి వినిపిస్తాను.
మాకు మాత్రమే వినబడే
శబ్దాలతో గుసగుసలాడుకొంటాం

సముద్రం పెదవిపై
గవ్వా నేనూ ఒక్కోసారి
జంటగువ్వలమౌతాం.

నాకెప్పటినుంచో ఓ అనుమానం
మమ్మల్ని ఎవరో గమనిస్తున్నారని!

నాన్నతనం

అమ్మతనాన్ని గుర్తించటం కొంచెం కష్టం కానీ
రోడ్డుపై అడుగడుగునా ఎదురయ్యే
నాన్నతనాన్ని సులువుగానే పోల్చుకోవచ్చు.

పార్కులో రెండుచేతుల్తో పీచుమిఠాయో
పల్లీలపొట్లాలో తీసుకెల్తూ కనిపించవచ్చు.
సినిమా హాలులో రెండో మూడో కూల్ డ్రింకులో
ఐస్ క్రీములో పట్టికెల్తూ ఎదురవ్వొచ్చు.
ఇంటికెళ్ళే వేళ స్వీట్ కొట్లోనో, ఫ్రూట్ షాపులోనో
ఏవో పొట్లాలు కట్టిస్తూ తారసిల్లవచ్చు.

ఏ పేవ్ మెంటు మీదనో
స్కూల్ బేగ్గో, షూసో కుట్టిస్తూ కంటపడొచ్చు.
నాన్నతనాన్ని బజార్లో ఎక్కడున్నా
ఇట్టే గుర్తు పట్టేయవచ్చు
"సైజులు సరిపోకపోతే మారుస్తారు కదూ"అంటో
పిల్లల బట్టల షాపులోనో;
స్కూల్ విడిచాకా వస్తూన్న పిల్లల గుంపులోంచి
"డాడీ" అన్న పిలుపు వచ్చిన వైపు అసంకల్పితంగా
చూసే అయిదారు జతల ఆతృత నేత్రాలలోనో;
"అన్నీ పట్టుకెళుతున్నావా'' అని వందోసారి

అడుగుతూ ఎగ్జామ్ సెంటర్ వద్దనో...
ఎక్కడయినా సరే
నాన్నతనం తేలిగ్గానే దొరికిపోతుంది.

పిల్లలు కాలేజీ చదువులకై ఇల్లువిడిచాకా
వారి సెల్‌ఫోన్లో ఒక నంబరుగా మిగిలిపోతుంది నాన్నతనం
శుభాకాంక్షల్ని, జాగ్రత్తలను క్రమం తప్పకుండా అందుకొంటూ.

అప్పుడు కూడా
పార్కు బెంచీపై కూర్చొని మిత్రులతో
కొడుకు సంపాదన, కోడలి మంచితనం
మనవల అల్లరిని కళ్లకు కట్టినట్లు వర్ణిస్తూ
కనిపిస్తుంది.......... నాన్నతనం.........

కొన్ని నీటి పొరలేవో కంటికడ్డు పడినప్పటికీ

13 February 2017

సిస్టర్ అనామిక

అతని
రెండు రెక్కల్లో చేతులు ఉంచి
టాయిలెట్ సీట్ నుంచి లేపి
పళ్ళుతోమి స్నానం చేయించి
ఒళ్ళుతుడిచి బట్టలు తొడిగి
జాగ్రత్తగా నడిపించి
మంచంపై పడుకోబెట్టి
"మీ అబ్బాయి రమ్మంటున్నాడని అన్నారుగా
వెళ్ళొచ్చు కదా?" అందామె
మాత్రలు వెతుకుతూ

నీటిపొర నిండిన కళ్ళతో
సీలింగ్ కేసి చూస్తూ ఉండిపోయాడతను
ఫోన్ కూడా చేయటం మానుకొన్న
బబ్లూ గాడిని గుర్తుచేసినందుకు.

14 January 2017

చక్కగా ప్రేమించుకోక.....

పాపాయిని ఎత్తుకొన్నాను
నేను నచ్చలేదేమో
దూదిలాంటి మెత్తని చేతుల్తో
నా మొఖాన్ని తోసేస్తుంది
పలుచని గోళ్ళతో నా బుగ్గల్ని గిల్లుతోంది
కాళ్ళతో తన్నుతోంది
వాళ్ళమ్మకు ఇచ్చేసాను

తను ఎత్తుకొన్నాక
సొట్టబుగ్గలతో బోసినోటితో
నన్ను చూస్తూ నవ్వుతోంది పాపాయి.

ఒక్కసారిగా అనిపించింది
తిరస్కరించిన తరువాత
ద్వేషించక్కర లేదని
చక్కగా ప్రేమించుకోవచ్చనీ!

28 January 2017

పూడిక

పెద్ద యంత్రం తొండంతో
చెరువు పూడిక తీస్తోంది
గతాన్ని పొరలు పొరలుగా
తొలగించి పారేస్తోంది.

రేపో మాపో
చెరువులోకి కొత్తనీరు ఎక్కుతుంది
సృష్టి అపూర్వ రాగాన్ని ఎత్తుకొంటుంది
కొత్త చేపలు కిలకలు వేస్తాయి
తామర దుంపలు కొత్త మోసులెత్తుతాయి
కెరటాలు నురగలై తిరగబడతాయి

గుండె నిండా
అస్ఖలిత వీర్యాలు, అవాంఛిత స్వప్నాలు
చెరగని మరకలు, విరిగిన వాక్యాలు
ఘనీభవించిన కన్నీరు.

గుండె పూడిక ఎవరైనా తీస్తే బాగుణ్ణు!

30 January 2017

బహుళత్వం

అందరూ సమానమే అన్న
ప్రాతిపదికన ప్రయాణం మొదలెడతాం
ఒకే బాటగుండా వచ్చినందుకు.

కొంతకాలం గడిచాకా
నిన్ను నన్నూ విడదీస్తున్న
తెరలేవో లీలగా తెలుస్తూంటాయి.

నువ్వెవరైతే నాకేంటి
ఇద్దరి రక్తాలు ఒకటే ఆకాశం కదా అంటూ
వాదిస్తాను ఒకానొక ఉద్విగ్న క్షణంలో

నీళ్లను వేరుచేస్తుంది జీవితమనే హంస
దాని తూలికల అంచులవెంబడి
రక్తం బొట్లు బొట్లుగా ....

చివరకు
నువ్వు నీ నువ్వుగా, నేను నా నేనుగా
స్పష్టమౌతాం

26 January 2017

ఆ మూడు రోజులు ....

కొలతలుగానో మమతలుగానో
చూడబడే ఆమె
నెలకో మూడురోజులు
ఓ రక్తగర్భ అనీ
రక్తాశ్రువులు చిందించే
ఓ గాయగర్భ కూడా అని
మాట్లాడుకోవాల్సిన సమయం వచ్చింది.

ఋతుమతి, పుష్పవతి
ఏకవస్త్ర, త్రిరాత్ర అంటూ
సౌందర్యాత్మక భాషలో కప్పెట్టిన
కొన్ని దైహిక రహస్యాల పట్ల
అసున్నితత్వం పొందాల్సిన సమయం వచ్చింది

ఇన్‌సెనిరేటర్ లోకి విసిరిన
సానిటరీ నాప్కిన్ తో పాటు
కొన్ని బిడియాల్ని, సంకోచాల్ని
వదిలించుకోవాల్సిన సమయం వచ్చింది
ఆమెక్కూడా!

24 June 2017

పదే పదే పునఃసృష్టి....

ప్రతీదీ ఏదోఒకదానిలోకి
తెరుచుకొంటుంది.
కిటికీ ప్రపంచంలోకి
ప్రపంచం అసమానతల్లోకి
అసమానతలు రక్తంలోకి
రక్తం తిరుగుబాటులోకి
తిరుగుబాటు భానూదయంలోకి
భానూదయం కిటికిలోకి

ప్రతీదీ ఏదో ఒకదానిలోకి
తెరుచుకొంటూనే ఉంది అనంతంగా....

14 March 2017

పరిమళించిన ప్రేమ.....

ఖాళీ రేకుడబ్బాలో మట్టి నింపి
గులాబి మొక్కను పెంచుతోంది మా అమ్మాయి
స్కూలునుంచి వచ్చాకా
దానికి నీళ్ళు పోస్తూ, ఆకుల్ని సుతారంగా
నిమురుతూ మురిసిపోతుంది.
మొగ్గలేమైనా వచ్చాయా అని ప్రతిరోజూ
జాగ్రత్తగా పరిశీలిస్తుంది

"ఏ రంగు గులాబీలను పూస్తుంది
ఇంకా ఎన్నాళ్ళు పడుతుంది" అంటూ
వాళ్లమ్మను ఆరాలు తీస్తుంటుంది .

ఒక రోజు
తనకు బిగుతైన గౌనుల్ని బ్యాగ్గులో పెట్టుకొని
స్కూలుకు తీసుకెళ్ళింది ఏదో చారిటీ ప్రోగ్రాం అంటూ.

మర్నాడు ఉదయం ఒక గులాబీ
నవ్వుతూ ప్రత్యక్షమయ్యింది ఆ మొక్కకు.
చప్పట్లు కొడుతూ ఆనందిస్తోంది మా అమ్మాయి
ఆ దృశ్యాన్ని

బహుశా ఎక్కడో ఎవరో ఓ పాప
తనకు సరిగ్గా సరిపోయిన గౌనును చూసుకొని
మురిసిపోయినప్పటి ఆనందం కావచ్చు
ఆ గులాబీ.

17 March 2017

ప్రవహించే వాక్యం

మొన్న లైబ్రెరీ వద్ద నేనెంతో
ఆరాధించే వాక్యమొకటి కనిపించింది
దివ్యతేజస్సుతో వెలిగిపోతూ.
పరిచయం చేసుకొన్నాను
నిర్మాణ వ్యూహాల గురించి చాలాసేపు మాట్లాడుకొన్నాం

ఇపుడు బలంగా వీస్తోన్న పరిణామాల ప్రస్తావన వచ్చింది
మానిన నా గాయాల గురుతుల్ని చూసింది
కొత్తగాయాల పచ్చిదనాన్ని పరికించింది
ఏమీ మాట్లాడలేదు
వాతావరణం ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది.

"నా తలకు వెల కట్టారని తెంపుకు పోయారెవరో"
అంది నెమ్మదిగా
అపుడు చూసాను
దాని తల స్థానంలో మాస్క్ లాంటిదేదో ఉంది
తన చేతిని స్పృశించబోయాను అనునయంగా
చేయి లేదు! దుస్తుల వెనుక దేహమే లేదు ఆశ్చర్యంగా
"అప్రియ సత్యాలు చెప్పినందుకు నా దేహాన్ని
బూడిద చేసారు" అంది.

అయినా సరే
అనల ప్రవాహమై
మట్టి కన్నీరు తుడుస్తాను
నిప్పుల సుళ్ళు తిప్పుకొంటూ
కాల రక్తాన్ని పర్వులెట్టిస్తాను
చీకటి కోనల్లో వెల్తురు పదచిత్రాలుగా వర్షిస్తాను

నాకు చాలా పని ఉంది ఉంటా......నేస్తమా!

నువ్వూ నాతో రాగలవా?

13 September 2017

మృతుడు

అంత్యక్రియలు పూర్తిచేసి ఇంటికొచ్చేసరికి
సోఫాలో కూర్చొని పాత ఆల్బమ్ లు తిరగేస్తూ కనిపించాడు
ఆశ్చర్యం నుండి తేరుకొనేలోగా మాయమయ్యాడు

ఆ తరువాత ఎన్నోసార్లు కనిపించాడు
డైజిపామ్ కి కూడా నిద్ర పట్టక దొర్లుతూంటే
తన బొజ్జపై నన్ను పడుకోపెట్టుకొని
కథలు, పద్యాలు తన చిన్ననాటి సంగతులూ
చెపుతూండగా మధ్యలో ఎపుడో నిద్ర పట్టేసేది.

"చంటాడికి ఒళ్ళు కాలిపోతోంది" అంటూ
నన్ను భుజాలపై వేసుకొని ఆరుబయట తిప్పుతూండగా
మా అమ్మాయి నా నుదిటిపై చేయివేసి
"ఏమైంది నాన్నా" అనేది చాలాసార్లు.

నదిలో తన ప్రతిబింబాన్ని చూసుకోవటానికి
ఇక్కడిక్కడే తిరుగుతున్నాడని అనిపించేది.

ఇపుడెవరూ నమ్మటం లేదు కానీ
రేపెపుడో నేనూ అలా కనిపించినపుడు
నమ్ముతారు బహుశా!

5 September 2017

సృజన

ఏవి
అంతకు ముందు లేవో
వాటిని కొందరు
గొప్ప కాంక్షతో, దయతో
అన్వేషించి
అక్షరాల్లో మనోప్రపంచాల్ని
శిలల్లో భంగిమలని
రంగుల్లో ప్రవహించే దృశ్యాలను
ఆవిష్కరిస్తూంటారు

వాటిని కొందరు
గొప్ప విభ్రమతో, లాలసతో
అలా చూస్తూనే ఉండిపోతారు
ఏనాటికీ

20 August 2017

వలసపక్షుల గానం

రద్దీట్రాఫిక్ లో
రెండు చీమలు కలుసుకొని
కాసేపు ముద్దులాడుకొని
విడిపోయినట్లుగా మనమూ
కలుసుకొని విడిపోతూంటాం.

ఉద్యోగమో, వివాహమో, అనంతశయనమో
ఏదైనా కానీ
కలయికను లోపలనుంచి తొలిచి
వియోగ శిల్పాన్ని సృష్టించే అద్భుత శిల్పులు.

ఎప్పుడు కలుసుకొన్నామో
సమయాలు సందర్భాలు ఉంటాయికానీ
ఎప్పుడు ఒకరి హృదయంలో ఒకరు
మనుష్యులమై మొలకెత్తామో
తారీఖులు దస్తావేజులు ఉండవు

ఎందుకు కలుసుకొన్నామో
కారణాలు అవసరాలు తెలుస్తుంటాయికానీ
ఎందుకు ఒకరి దూరం
దిగంతాలవరకూ పరుచుకొనే దుఃఖం
అవుతుందో ఎన్నటికీ తెలియదు

నదిలో కొట్టుకు పోతున్న దుంగపై
కాసేపు వాలి
పేరు, ప్రవర చెప్పుకొనే వలసపక్షులు
చేసే గానమిది.

7 July 2017

కుట్రలు

చిన్నప్పుడు
మా ఇంట్లో పాడి ఉండేది
కనుమ రోజున మా అమ్మ
ఆవుకు పసుపు, కుంకుమ పూసి
గిట్టలకు బంతిపూల దండలు కట్టి
చుట్టూ ప్రదక్షిణ చేసి, హారతి ఇచ్చి
భక్తిశ్రద్ధలతో పూజ చేసేది
బతిమాలో బామాలో ఉద్దరిణిడు
గోమూత్రం రాబట్టి తలపై చల్లుకొనేది

అదే ఆవు
ఒంటిపూట పడి క్రమంగా ఒట్టిపోతే
కబేళా బేరగాడితో గీసి గీసి బేరమాడి అమ్మేసి
మరో ఆవును తెచ్చుకొనేది.

***

ఇపుడీ దేశానికి ఏమైంది
ఎవరిని వధశాలకు పంపటానికి
ఇన్ని కుట్రలు పన్నుతోంది?

9 June 2017

జీవించటమే.......

ఓ రోజు హఠాత్తుగా ఒకదారి తన గమ్యాన్ని మరచిపోయింది. చాలా బెంగ పట్టుకొంది దానికి, గమ్యం లేని జీవితమేమిటని. తన గమ్యాన్ని వెతుక్కొంటూ ప్రయాణం కట్టిందా దారి. కనిపించిన ప్రతి ఒక్కరిని అడుగుతోంది.

పిట్టల్ని పెంచే కులవృత్తిని కోల్పోయి ఏదో ఫాక్టరీలో వాచ్ మెన్ గా పనిచేస్తున్న ఓ ముసలి చెట్టును అడిగింది "నా గమ్యాన్ని ఎక్కడైనా చూసావా" అని. "తూర్పువైపున బోల్డన్ని గమ్యాలుంటాయని మా పూర్వీకులు చెప్పేవారు ఆ వైపు ప్రయత్నించు" అంది ఆ చెట్టు. అటుగా కదిలింది. పొద్దున్నుంచీ ఏమీ తినలేదేమో నిస్సత్తువ ఆవరిస్తోంది.

ఎదురుపడ్డ ఒక ఎర్రనత్తను అడిగితే "నన్ను అనుసరించు" అంటూ వెనుకకు నడవటం మొదలెట్టింది. దారికి దాని వాలకంపై అనుమానం వేసి ముందుకు సాగింది.

చీకటి పడింది. అడవి గుండా ప్రయాణం. ఏవేవో జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి. దారికి భయం వేసింది. అయినా సరే గమ్యాన్ని కనుక్కోవాలన్న నిశ్చయం సడలలేదు. ఆకలి చలిలా కొరుకుతుంది.

కొందరు దారిదోపిడి దొంగలు పొదలమాటునుండి మీదపడి దారిని బంధించారు. ఓపికలేక ప్రతిఘటించలేకపోయింది. గమ్యం లేదని గమనించి ఒదిలేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

తెల్లారింది. నెమ్మదిగా అన్వేషణ కొనసాగించింది దారి. ఏదో ఊరు కనిపించింది. పాత ఫ్లెక్సిలతో చేసిన గూళ్ళలో మనుషులు జీవిస్తున్నారు. వస్తూన్న ఒక వ్యక్తిని దాహం అడిగింది. నీళ్ళు తాగుతూ అతన్ని చూసింది. ఒక కాలు లేదు అతనికి. ఏమైంది అని ప్రశ్నించింది. "రైల్లో పల్లీలమ్ముతాను, ఓ రోజు ఆక్సిడెంట్ అయ్యింది" అన్నాడు. అతని లేని కాలును చేతిలోకి తీసుకొని తడిమింది. కన్నీళ్ళు వచ్చాయి. ఆకలి వల్ల ఎక్కువ బాధపడలేక పోయింది.

వెళ్ళిపోతున్న అతని వెనుక చేరి బుట్టలోంచి గుప్పెడుపల్లీలలను దొంగిలించి గబగబా నోట్లో కుక్కుకొంది. రైలుపట్టాలకు అంటుకొన్న రక్తం జ్ఞాపకాలు గొంతుకడ్డుపడ్డాయి.

కుంటుకొంటూ పడమరవైపు వెళుతోన్న అతన్ని చూస్తుంటే అర్థమైంది గమ్యం అంటే ఏమిటో.

ఇంకెప్పుడూ అది గమ్యం కొరకు అన్వేషించలేదు.

23 April 2017

కీమోథెరపీ

ఇంట్లోకి ఇంకా అడుగుపెట్టనే లేదు
తల వెంట్రుకల చుట్ట
బండి చక్రంలా గాలికి
దొర్లుకొంటూ దొర్లుకొంటూ వచ్చి
గడప వద్ద ఆగింది

పెను దుఃఖం
ఒక ఆలింగనం
ఎడతెగని కన్నీరు
వెంట్రుకల్ని ఒక్కొక్కటీ
రాల్చుకొంటూన్న తరువు
మెల్లమెల్లగా
గతంలోకి కూరుకుపోతోంది.

కటిక రాత్రి
జుట్టుపట్టుకొని ఈడ్చుకుపోతూంటే
తెగిన చీకటి దారాల్లా వెంట్రుకలు
ఎల్లెడలా మృత్యుశైత్యం

ఒక వేదన
భయప్రవాహం
విచ్చుకొన్న ఓదార్పు తెరచాప

7 April 2017

అయితే ఏంటటా?

అవును నిజమే
చీరకింద తలగడ ఏదో కుక్కుకొని
నెలలునిండిన దానిలా
నటిస్తూ అడుక్కొంటోంది ఆమె.
జనాల్ని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తుంది... తప్పే!

పాయింటుబ్లాంకులో
నీ సంతకాలు పెట్టించుకొందా లేక
ఉపాధికల్పన పేరుతో నీ భూములు లాక్కొందా?

నీకులాంటి జరుగుబాటు లేనివాళ్ళు
చచ్చిపోవాలా ఏమిటీ?

19 March 2017

అదేహ ప్రేయసి

నీ జ్ఞాపకాలు నిండిన రాత్రివేళ
నిర్నిద్ర దేహం
అస్వప్న జలాలలో పయనించే
గూటి పడవ అవుతుంది.

నీ రూపం, నీ నవ్వు, నీ వీడ్కోలు
నా మూసుకొన్న కనురెప్పల వెనుక
అద్దం ముందు పిచ్చుకలా
రెక్కలు ఆడిస్తూ, పొడుస్తూ,
మిథ్యా ప్రియునితో రమిస్తున్నాయి

బయటకి వెళ్ళిపోండి అని
చెప్పాలనుకొంటాను వాటితో
ఈ భారాన్ని నేను మోయలేను
అని అరవాలనుకొంటాను.
నీ చుంబనంలో బంధీ అయిన
నా పెదవులు తెరుచుకోవు.
నా గొంతులో కూడా
నువ్వే చిక్కుకొని ఉన్నావు.

31 October 2017

మూడు అనుభవాలు

ఒక చెవిటివానికి
కోయిల పాట ఎలాఉంటుందో వినాలనిపించింది.
ఓ కవిమిత్రుణ్ణి అడిగాడు
గులాబిపూవులా ఉంటుందన్నాడు.
ఒక అందమైన గులాబీని చెవి వద్ద ఉంచుకొన్నాడు
మెత్తని పరిమళ స్వరం
గులాబి ముళ్ళు చెవితమ్మెల్ని గాయపరిచాయి
చేతికి రక్తం వెచ్చగా తగిలింది
అనామక కాకి రక్తం

****

ఒక అంధునికి
ప్రేమ ఎలా ఉంటుందో చూడాలనిపించింది
సాగరంలా ఉంటుందన్నాడో మిత్రుడు
వెంటనే సముద్రంలో దూకేసాడతను
గవ్వలు, రాళ్ళు గుచ్చుకొని గాయాలయ్యాయి
లోతుల్లోకి కూరుకుపోతూంటే
ఒక సముద్రగుర్రం తన వీపుపై ఎక్కించుకొని
ఒడ్డున దీబెట్టింది
ప్రేమంటే అర్థమైందతనికి

****

ఒక మూగవానికి
దేవుడు కనిపిస్తే ఏం మాట్లాడాలన్న సందేహం వచ్చింది
చిమ్మెట శబ్దాలలో నీకు సమాధానం లభిస్తుందన్నారెవరో
చిమ్మెటలు కిక్కిరిసిన తోటలో
ఎన్నోరాత్రులు ఓపికతో ఒంటరిగా ఎదురుచూసాడతను

ఓ వేకువ జామున
దేవుడు అతనితో సంభాషించాడు.

27 October 2017

భయ్యా! నేనన్నీ గమనిస్తూనే ఉన్నాను

ఇన్నేళ్ళ మా స్నేహంలో
ఇటు పులిహోర బూరెలు అటు
అటు సేమియా బిర్యానీలు ఇటూ ప్రవహిస్తూనే ఉన్నాయి

ఇద్దరం ఒకే యజమాని కింది కూలీలమేమో
ఈ ఇంటిపై వాలిన సుఖఃదుఖాలు ఆ ఇంటిపై కూడా వాలేవి

మా ఇరవై ఏళ్ల సహవాసంలో
అతని కళ్ళల్లో ప్రేమనే తప్ప భయాన్నెప్పుడూ చూడలేదు

కానీ
మొన్న జండాల పండుగరోజున
మైకులో "వందేమాతర గీతం" వస్తూంటే దాన్ని
కూడబలుక్కుంటూ
వచ్చీరాని ఉచ్ఛారణలో వణుకుతూ అందరికీ వినబడేలా
అతను పైకి పాడటం చూసాకా నాకు భయం వేసింది

దీన్ని
ఇంకెంత దూరం తీసుకెళతారోనని
అప్పటినుంచి నాకు జలదరింపుగా ఉంది.

1 September 2017

రక్తహేల

అక్షరాలతో
ప్రశ్నలతో
ధిక్కార స్వరంతో
సలసల మరిగే రక్తాన్ని
గాజుబుడ్డిలో సేకరించి
కోటగుమ్మానికి
వేలాడదీయటం
భలే బాగుంది... శభాష్
గొప్ప విజయోత్సవ దృశ్యం అది.. కదూ?

అనామక శవాలతో
చప్పగా ప్రవహించే చరిత్రకు
ఒక వర్ధంతిని బహూకరించటం
మామూలు విషయమా!
అభినందనలు.... అభినందనలు

ఒకటి గుర్తుంచుకో
ప్రశ్నలన్నింటినీ సంఘటితంచేసే వర్ధంతి మాత్రమే
చరిత్రలో మిగిలిపోతుంది ఎప్పటికైనా
నీ FIR కాదు.

8 September 2017
(గౌరీ లంకేష్ కొరకు)

క్షతగాత్ర నది

జీవం కోల్పోయి
ఎండిన కన్నీటి చారికలా
మిగిలిపోయిన నది
యూనిట్లు యూనిట్లుగా
తరలించబడుతోంది
ఎడారి నగరాల నిర్మాణం కొరకు

మెలికలు తిరిగి, లుంగచుట్టుకొని
తరుచ్ఛాయల్ని తలచుకొంటూ
బుల్ డోజర్ కింద ఆదీవాసీ చేసిన
అరణ్యరోదనను గుర్తుచేసుకొంటూ
అపుడెపుడో మేసిన వెన్నెల్ని
చందమామ రజనుగా రోడ్డుపై కార్చుకొంటూ
క్షతగాత్ర నది
ట్రక్కులు ట్రక్కులుగా ప్రవహిస్తోంది
నగరం వైపు

24 March 2017

Message in a train

సీటు వెతుక్కొని కూర్చున్నాను
ఎదురు బెర్త్ పై ఏదో పుస్తకం కనిపించింది
దాన్ని తీసుకొని చుట్టూ చూసాను
ఎవరూ కనిపించలేదు
ఎవరో మరచిపోయినట్లున్నారు
కవర్ పేజ్ పై
"ఈ శతాబ్దపు బెస్ట్ సెల్లర్" అన్న వాక్యం
ఆకర్షించింది

మొదటి పేజీపై అందమైన చేతివ్రాతలో
"డబ్బు ఎంత పేదదో అర్థమయ్యాకా ఈ ప్రపంచానికి
సాహిత్యం విలువ తెలిసొస్తుంది" అని వ్రాసి ఉంది.
ఆసక్తిగా వెంటవెంటనే పేజీలు తిప్పాను
అన్నీ తెల్లకాగితాలు .... అంతా ఖాళీ.... ఏమీ లేదు
ఆశ్చర్యం వేసింది

ఇంతలో చిన్న చిన్న పిల్లలు
బిల బిల మంటూ రైలెక్కారు
కూ అంటూ రైలు కదిలింది

12 November 2017

నన్ను క్షమించవూ......

సంతలో నెమలీకలు అమ్ముతోన్న
ఒక వ్యక్తిని చూసాను

అలా అమ్మటం చట్టరీత్యా నేరమని
అతనితో చెప్పాలనుకొన్నాను

"చిరుగులు పడ్డ మాసిన దుస్తులు
కపాలానికి చర్మం తొడిగినట్లున్న మొఖం
తాడుకి వేలాడుతోన్న పగిలిన కళ్లజోడు
చెప్పులుకూడా లేని కాళ్లతో"
అతని రూపం చూసాకా
చెప్పబుద్ధి కాలేదు.

అవసరం లేకపోయినా
ఓ నాలుగు నెమలీకలు కొనుక్కొని
మౌనంగా వచ్చేసాను

నెమలీ నెమలీ
నన్ను క్షమిస్తావు కదూ!

27 November 2017

A B C D లు

A ఫర్ ఆపిల్ కి
మైనం కోటింగ్ తో
ఊపిరాట్టం లేదు

B ఫర్ బాల్
ఒత్తిడి భరించలేక
లేని గ్రౌండ్ లో ఉరేసుకొంది

C ఫర్ కాట్
బాగ్ పైపర్ వాయించుకొంటూ
గుహ వైపు వెళుతోంది

D ఫర్ డాల్
వాణిజ్య ప్రకటనలకు
తైతెక్కలాడుతోంది

1 December 2017

చీకటి దిష్టిబొమ్మ

జీవితకాలం శ్రమించి
చిత్రించుకొన్న చిత్తరువులో
కరిగి ప్రవహించే గడియారం
కనుల చివర నిలిచిన అశ్రుబిందువు
వేదనో నవ్వో తెలియని పెదవుల రహస్యలిపి
తుప్పుపట్టిన కిటికీ చువ్వలు

అయిందేదో అయిపోయింది
ఎండిన పూజాపత్రిని ఏట్లో కలిపినట్లు
నిన్ను బాధించిన క్షణాలను మరచిపో.

పట్టుబడిన ఎలుకలను ఊరవతల విడిచినట్లు
నిన్ను బాధించిన వ్యక్తులను మరచిపో.

మాయబుట్టని పొలిమేర చెట్టుకు కట్టినట్లు
నువ్వు బాధించిన సందర్భాలను మరచిపో.

గతాన్నొక గాలిపటం చేసి ఎగరేసి
దాని దారం తెంపేయ్

వెలుతురును అడ్డుకొంటున్న
చీకటి దిష్టిబొమ్మను దహనం చేసేయ్

కొబ్బరి పాకుడు లాంటి
మెత్తని గిట్టలతో లేగదూడ
మొదటిసారిగా ఎలా నిలబడుతోందో చూడు

పాదం బరువుకు ఒరిగిన పచ్చిక
మెల్లమెల్లగా
ఎలా నిటారుగా తలెత్తుకొంటుందో చూడు

31 December 2017

ప్రయాణం.....

బస్సెక్కి నంబరు వెతుక్కొని
నా సీట్లో కూర్చొని చుట్టూ పరికించాను
బస్సు దాదాపు ఖాళీగా ఉంది

కార్నర్ కిటికీ సీట్లో ఒక స్త్రీ
ఫోన్ రింగవుతూంటే మ్యూట్ చేస్తోంది పదే పదే.
ఒక్కసారి ఎత్తింది.
కాసేపటికి ఓ నడి వయసు మనిషి వచ్చి
పక్కన కూర్చొని ఏదో మాట్లాడుతున్నాడు
ఆమె మౌనంగా ఉంది చాలాసేపు
"నన్ను ఓ పదిరోజులు ప్రశాంతంగా వదిలేయ్ ప్లీజ్"
అన్న ఆమె మాటలు మాత్రం స్పష్టంగా వినిపించాయి.
అతను వెళ్ళి పోయాడు

ఆమె కనులు మూసుకొని అద్దానికి తలాన్చి కూర్చొంది
కంటి చివర నుండి కన్నీటి చారిక మెరిసింది లిప్తపాటు.
బస్సు బయలు దేరింది

ఆమె గురించే ఆలోచిస్తూ నేనూ నిద్రలోకి జారుకొన్నాను

****

కండక్టర్ కేకతో హఠాత్తుగా మెలుకువ వచ్చింది.
తెల్లవారిపోయింది....... ఏదో స్టాప్ అనుకొంటాను.

ఆమె ఒక పిల్లాడ్ని ఎత్తుకొని
మరో పిల్లను నడిపించుకొంటూ
బస్సుదిగటం కనిపించింది.
ఆశ్చర్యం వేసింది
రాత్రి లేని పిల్లలు ఎక్కడనుంచి వచ్చారా అని!

ఎవరి స్వప్నాలలోంచి
ఎవరి స్వప్నాలలోకి
ప్రవహించారు వారు!

13 January 2018

మోహం

ఆమె నీడ
నగ్నంగా మారి
నన్ను కౌగిలించుకొంది
బిరుతెక్కిన కుచాగ్రాలు
గుచ్చుకొన్నాయి

వృత్తిధర్మం ఎరిగిన
వేశ్యలా
నన్ను నేను విప్పుకొని
అర్పించుకొన్నాను

ఖాళీ గవ్వలోని ఇసకలా
కాఫిన్ బాక్స్ లోని దేహంలా
ఆమె నీడలో ఒదిగిపోయి
కొత్తలోకాలకు ప్రయాణం కట్టాను.

24 November 2017

ముల్లు తీయించుకోవటం

ఒకని పాదాన్ని మరొకరు చేతుల్లోకి తీసుకొని
లోతుగా దిగి విరిగిన ముల్లుచుట్టూ
చర్మాన్ని ఉమ్మితో శుభ్రం చేసి
పిన్నీసు మొనతో
మెల్లమెల్లగా ముల్లును పైకి లేపుతూ
బొటనవేలు చూపుడు వేలు గోర్లతో
పట్టుకొని బయటకు లాగి
అరచేతిలో ఉంచుకొని
విప్పారిన నేత్రాలకు చూపటం;
కాలుతున్న చుట్టను తీసుకొని
ముల్లు చేసిన గాయానికి సెగ పెట్టటం
ఎంత గొప్ప మానవీయ అనుభవం!
చిట్టిపాదాల్ని చిగుళ్లకు ఆనించి
మునిపంటితో ముల్లును తొలగించిన
అమ్మ జ్ఞాపకం లాంటి అనుభవం.

***

నేనెప్పుడైనా ఈ ప్రపంచంతో
రోజంతా వేసారి విసుగుచెంది అలసిపోయి
ఇంటికొచ్చినప్పుడు
నీ ప్రేమ ప్రవాహపు చేతులతో
నా ఆలోచనలకు కళ్లెం వేసి
నీ దేహ సౌగంధికా పరిమళంతో అల్లుకొని

నీ మెడ ఒంపులో అందంగా అమరిన
ఆకుపచ్చని రక్తనాళాలలోకి
నన్ను పొదువుకొంటావు ప్రతీసారీ

అపుడెందుకో నాకు
ముల్లు తీయించుకొన్న అనుభవమే
పదే పదే గుర్తుకు వస్తుంది.

5 April 2018

ఒక....పురా.... ప్రకాశం....

ఒక 'సభానంతర సంభాషణ'లో
శివుని చుట్టూ చీమలు మూగాయి
చలి కాచుకొనేందుకు
చలిమంట జలపాతాన్ని ఆవిష్కరించిన
శివుడు తానే చలిమంటై
నృత్యం చేయనారంభించాడు.
పుల్లలని ఎగదోసే మిషతో
తానూ చలిమంటలో లయమైపోయాడు
మణుల శిఖుడు
చలిమంట వెలుగుల్ని తొడుక్కొన్న
'ఎడతెగని ప్రయాణం'
కవిత్వంలో సంగమించింది
***
కాళిదాసు, దండి, భవభూతి ఏనాడో
చంద్రుని చలిమంటగా కాచుకొనే ఉంటారు
ఏనుగు కుంభస్థలాన్ని చీల్చి దోచుకొన్న ముత్యాలలో
ఒకరినొకరు చూసుకొని మురిసిపోయే ఉంటారు.

లిప్తపాటు మెరిసిమాయమయ్యే దీపశిఖ వెలుగుల్లో
అనంతంగా ప్రకాశిస్తూనే ఉన్నారు
చలిమంటై....... నేటికీ.....

("గోదారి పలకరింపు" పుస్తకావిష్కరణ సందర్భంగా)
26 February 2018

Brain in a Jar

నిన్న లేదు, రేపూ లేదు
ఈ క్షణం అంతకన్నా లేదు
నిద్రలేస్తే అదృశ్యమయ్యే స్వప్నం లాంటి
ఆలోచన మాత్రమే ఇదంతా
ఇంకా చెప్పాలంటే
ఆలోచన ఉందన్న స్పృహే
ఈ ప్రపంచం.

పూలు, కన్నీరు,
నాలికపై కరిగే చక్కెర గుళికా
నొప్పి తెప్పించే సిరెంజి సూది
ఈ మతం, ఈ కులం, ప్రజాస్వామ్యం
ప్రతీదీ ఒక ఆలోచన
మనిషిదో, శవానిదో, కాలానిదో!

నువ్వింతవరకూ చూడని
నా చిన్ననాటి నీలం చొక్కా నీకు లేనట్టే
నేనింతవరకూ చూడని
ఈఫిల్ టవర్ నాకూ లేనట్టే

డైనోసార్లని, పలాయనించే గజాన్ని, నీలం చొక్కాల్ని
కాలాతీతంగా ఒకే రంగస్థలంపై నాట్యం చేయించే

స్పృహ మాత్రమే అంతిమ సత్యం
మిగిలినదంతా ఒట్టి హంబగ్.

ఆలోచనల్ని స్రవించే
నువ్వూ నేనూ
గాజు సీసాలోని ఉత్త మెదళ్ళం.

25 October 2018

Alone but Together....

The Two of Us Together and
Each of Us Alone - from a rental contract అనే Yehuda
వాక్యం వల్ల నిద్రపట్టక దొర్లుతుంటే
సడన్ గా ఫోన్ మోగింది
"మావయ్య పోయాడురా" అన్నాడు కుమార్ బావ
"ఎలాగా" అనబోయి అర్ధరహితమనిపించి
"అలాగా, రేపు బయలుదేరి వస్తాను" అన్నాను

ఒక్కసారిగా
అమ్మ గుర్తుకొచ్చింది
"నీకిష్టమని మజ్జిగపులుసు చేసానురా తమ్ముడూ"
అంటూ కొసరి కొసరి వడ్డించేది మామయ్యకు

"ఉండు బస్టాండు దాకా వస్తాను" అంటూ చొక్కావేసుకొనే
నాన్న గుర్తొచ్చాడు

"వాడొట్టి వెర్రిబాగులోడు ఎలా బతుకుతాడో ఏంటో"
అంటూండే అమ్మమ్మ గుర్తుకొచ్చింది

"ఇంటికి పెద్దోడివి నువ్వే డీలా పడిపోతే ఎలా" అంటూ
నాన్న లేనప్పుడు ధైర్యం చెప్పిన అత్తయ్య గుర్తుకొచ్చింది

“మీ అత్తయ్య పోయినప్పటినుండీ
బతకాలనిపించటం లేదురా” అని వలవలా ఏడ్చిన
మామయ్య గుర్తుకొచ్చాడు

ఒక చావు వంద చావుల్ని బతికిస్తుంది

జీవించటం అంటే
ప్రేమించిన ఒక్కొక్కరినీ కోల్పోవటం కాదూ!

23 October, 2018

బక్కచిక్కిన ప్రశ్న వొకటి....

మొదటి ప్రశ్నను నరుకుతోన్నపుడు
మనం పెద్దగా పట్టించుకోలేదు
పట్టించుకొన్నామేమో!
అది సరిపోలేదు
ఇపుడు
ప్రశ్నలన్నింటిమీదా
రంపం కోత చారలు

ప్రశ్నలన్నీ అంతరించాకా
పాంపే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ దేహాల్లా
ఒకేరంగు దుస్తులు ధరించి
విజృంభిస్తోన్న కుంటి జవాబులు

ఫాక్టరీల్లో తయారుచేసి
హెలికాప్టర్లలో ఊర్లపై వెదజల్లే
అభిప్రాయాల్లాంటి జవాబులు
ఎక్కడ చూసినా

ఎర్రటి ఎండలో
బక్కచిక్కిన ప్రశ్నొకటి తన నీడలో తనే
కుక్కలా ముడుచుకు
పడుకొంది.....

పిల్లల చిన్నప్పటి ఆల్బమ్ ని
తడుముతో చూసుకొనే
వృద్ధ తల్లిలా
దాని చెంపకు నా చెంపను ఆనించి
దాని దుఃఖం వింటున్నాను

21 October 2018

దుఃఖ ద్వారం

నగరం
కళ్ళు తెరచి నిద్రిస్తోంది
దాని రెండు కళ్ళు
రెండు దుఃఖ ద్వారాలు

పోయినేడు
వలస వెళ్ళిన కొంగలలో
ఒక్కటీ తిరిగిరాలేదు

వందలబానిసలు
తెడ్లు వేస్తోంటే
విలాసంగా కదులుతోంది కాలం

19 October, 2018

సమాధానం

చెట్టుమీద ఉన్న
శవాన్ని భుజాన వేసుకొని
నడుస్తున్నాను
శవం తన కథ చెప్పటం మొదలెట్టింది

మొదట లోగొంతుకతో
క్రమక్రమంగా
భీకర అరుపులతో, ఊళలతో
గంటలు రోజులు సంవత్సరాలు
కథ సాగుతోంది అనంతంగా

ఎన్నో దృశ్యాలు కళ్ళముందు
లిప్తపాటు మెరిసి మాయమవుతున్నాయి

పాయింటు బ్లాంకులో పుస్తకాల్ని కాల్చటం
పాలిచ్చే జంతువుతో కేబరే డాన్స్ చేయించటం
నరమాంసభక్షణ చేస్తోన్న ఆటవిక మూకలు
పొడవాటి క్యూలో కుప్పకూలిన చమటనోటు
లాంటి దృశ్యాలు గగుర్పొడుస్తున్నాయి.. పదే పదే

బాటపైని రాళ్ళు, ముళ్ళు గుచ్చుకొని
బొబ్బలు తేరి, రక్తమోడుతున్నాయి పాదాలు

చివరగా
"సమాధానం చెప్పలేదో
నీ తల వేయి వ్రక్కలవుతుంది జాగ్రత" అంది శవం

సమాధానం చెప్పాను

శవం తల వేయి వ్రక్కలయింది!

12 September, 2018

ఒక apocalypse అనంతరం.....

అడవి మధ్య పెద్ద మైదానంలో
ఒక గుంపు పోగుబడి ఉంది
పూసలు ధరించిన ఓ ముసలి వ్యక్తి
రాళ్ల మధ్య అటూ ఇటూ తిరిగి
గుండ్రంగా నునుపుగా ఉన్న చిన్న రాయిని ఎంపికచేసి
శుభ్రం చేసిన నేలపై ఉంచాడు.
చుట్టూ నాలుగు పుల్లలు పాతి
పుల్లలపై ఏదో అడవి చెట్టు ఆకులు పేర్చి
ఎదురుగా కూర్చొని ఆ రాయినే చూస్తూ
ఏదో మాట్లాడుతున్నాడు

అతని చుట్టూ అందరూ ఒక వలయాకారంగా కూర్చొని
కనులు మూసుకొని మౌనంగా ఉన్నారు

రకరకాల హావభావాలతో అతనా రాయితో
మెల్లగా మాట్లాడుతున్నాడు – మధ్యమధ్యలో నవ్వుతూ,
ఏడుస్తు, ఒక్కోసారి గంభీరంగా, కొన్ని సార్లు అభావంగా
చివరగా నేలను ముద్దాడి,
తన మనుషులకు నవ్వుతూ సైగ చేసాడు
అందరూ గంతులు వేస్తూ, డప్పులు మోగిస్తూ,
ఆనందించటం మొదలెట్టారు

అతని వద్దకు నెమ్మదిగా వెళ్ళి అడిగాను
ఆ రాయేమిటని
మా దేవుడు
ఎం చేసావు ఇంతసేపూ
మాట్లాడాను
ఏం మాట్లాడావు
పోయినేడు పంపించిన పెద్దలను చల్లగా చూసుకోమని
అడవి పూలు విరగకాయాలని
పిట్టలు, జంతువులూ సంతోషంగా జతకట్టాలని అడిగాను
ఇంకా
జీవులన్నీ పంచుకోగా పళ్ళూ దుంపలు మిగలాలనీ
వానలతో కప్పల నోళ్ళు నిండాలనీ
పుట్టబోయే బిడ్డలకొరకు వారి తల్లుల గర్భాలు గట్టిపడాలని

దేవుడు ఏమన్నాడు?
అలాగేనన్నాడు
మీ దేవుడి పేరేమిటి?
దేవుడు
పేరు
దేవుడికి పేరేమిటి? దేవుడి పేరు దేవుడే!
ఇదిగో జీలుగు రసం తాగు అంటూ
చిన్న తాటాకు దొప్ప చేతిలో ఉంచాడు.

6 August 2018

గాయాల శ్వాస

CT స్కాన్ కవరును
చేతితో పట్టుకొని
ఆమె రోడ్డుపై భారంగా
అడుగులు వేస్తూ నడుస్తోంది.

సీతాకోకల తెగిన రెక్కల వానలో
వెన్నువిరిగిన అట్లాస్ లా ఆమె
స్వప్నించిన జీవితానికి
జీవిస్తోన్న స్వప్నానికి మధ్య
కన్నీటి పొరలు
నాపరాతి పొరలు
ఒక్కొక్క పొరను తవ్వుకొంటూ
ఒక్క ఆశకోసం ఒకే ఒక్క ఆశకోసం
ఆమె అన్వేషిస్తోంది

****

ఈ చేతుల్తో ఎన్నో గాయాల్ని
చిత్రించాను
ఈ గాయాన్నెందుకో
మరో కాలంలోకి
ఒంపలేకపోతున్నాను
గుండెలనిండా పురాగాయాల శ్వాస
నన్ను క్షమించు మిత్రమా!

30, June, 2018

ఏం పని ఉంటుంది నీకూ ..

వెళ్తూ వెళ్తూ అతనన్నాడూ
"నే వచ్చేవరకూ
ఏం పని ఉంటుంది నీకు" అని

అతను వచ్చేసరికి
ధూళి, ఈగలు ముసిరిన నేల
బురదలో పొర్లాడిన పంది
అవతారం ఎత్తి
నట్టింట్లో తిష్టవేసి ఉంది.

నిన్నటి పూలు వాడి ఎండినా
రాల్చుకోకుండా
కొత్తమొగ్గల దుప్పటిని
కప్పుకోకుండా
మంచం మల్లెపొద
బద్ధకంగా పడుకొని ఉంది

కిచెన్ సింక్ తటాకంపై
చచ్చిన చేపలు నాని ఉబ్బి
వికృతంగా తెట్టులా తేలి
అంతిమ పరిమళాన్ని
గానం చేస్తున్నాయి.

పాపాయి జారవిడిచిన
డైపరు విదిల్చిన శకలాలను
నదులు, పర్వతాలు మైదానాలు
అలంకరించుకొన్నాయి

బట్టలపెట్టి పొట్టపగిలి
లుకలుకలాడుతూ బెకబెకలాడుతూ
బయటపడ్డ జబ్బుచేసిన సీతాకోకలు

ఇల్లు మొత్తం
క్వారీపక్కన జుత్తు నెరిసి
కాంతి నశించిన చెట్టులా ఉంది.

అతను ఇంకెప్పుడూ అలా అనలేదు!

18 May, 2018

నివేదన

లేత కొబ్బరాకుపై
ప్రతిబింబించే
వేన వేల స్వప్నాల
నిగారింపు

గోడపై గుచ్చిన
సీసాపెంకులకు
అంటుకున్న ఎండిన
రక్తపుమరకలు

కోట శిథిలాల మధ్య
ఏ జంతువుకో
చిక్కిన పావురపు
ఈకల కుప్ప

తల్లి రాకను గుర్తించిన
పక్షిపిల్లలా
తెరుచుకొన్న నోటితో
మూడడుగుల నేల

నీటిపై సన్నని పొడవైన
కాళ్ళతో
చక చకా నడిచిపోయే
సాలీడల్లే కాలం

25 April, 2018

ఆట

ఆ పిలగాడికి
పెద్దజబ్బు చేసింది
చనిపోతాడనుకొన్నారు అందరూ

పదిరోజుల లంఖణాల తరువాత
చారు అన్నం తిని
అరుగుపై కూర్చొన్నాడు

వాడి స్నేహితులు
సైకిల్ తొక్కుకొంటూ
పరుగులెత్తుతో
కేకలు వేస్తూ
ఆడుకొంటున్నారు రోడ్డుపై

జీవించి ఉండటంలోని
సౌందర్యం
కొద్ది కొద్దిగా అర్ధమౌతోంది వాడికి

15 April, 2018

అధికారం

అధికారంతో
నగరాలు, వంతెనలే కాదు
విశ్వాసాల సామ్రాజ్యాలు కూడా
నిర్మించగలరు కొంతమంది.

తమ జాతి గొప్పదని
తమ సంస్కృతి ఉత్తమమని
తమ అలవాట్లే పవిత్రమైనవనీ
ప్రచారం చేసి
మనుషుల్ని సమూహాలుగా, సంఖ్యలుగా
మార్చేస్తారు.

ఆలోచనల్ని పంజరాల్లో బంధించి
కాప్టివ్ బ్రీడింగ్ చేసుకొమ్మని వదిలేసి
వేడుక చూస్తారు.
తప్పించుకొన్న ఏ ఆలోచననైనా
రెక్కలు కత్తిరించి
నాలుగ్గోడల మధ్య వీల్‌చైర్ లో

కూర్చోపెడతారు.
ఓ నాయకుడు
రెండువేళ్ళూ పైకెత్తి గాల్లో
అటూ ఇటూ ఊపుతున్నాడు
ఎవరి విజయమో తెలియని
వెర్రిజనం కూడా ఊపుతున్నారు

గీత

చికన్ షాపు పంజరంలోని
కోడిపుంజు మెడసారించి
కొక్కొరొక్కో' అంటూ కూస్తోంది
ఘడియను సూచిస్తూ
గమనించావా!

చివరి క్షణం వరకూ
చెయ్యాల్సిన పనుల్ని చేస్తూండటాన్ని
కాలం కూడా తప్పించుకోలేదు.

దిగులు చెందకు
కర్చీఫ్ ఇదిగో
కనులు తుడుచుకో ముందు!

22 November 2016

ఇకపై...

తోడేళ్లకు
ఇష్టమైనదేదో
స్త్రీలో పెట్టానన్న పొరపాటుని
దేవుడు గుర్తించాడు
నాలుక కరచుకొని
సృష్టిని రీబూట్ చేసాడు

ఇకపై
మానవజాతి అరటి పిలకల్లా
పునరుత్పత్తి జరుపుకోనుంది

23 June, 2019

అస్తిత్వం

అస్తిత్వం అనేది
గోనె సంచిలో తీసుకెళ్ళి ఊరి చివర విడిచినా
తోకూపుకొంటూ వచ్చి చేరే పిల్లి పిల్ల లాంటిది.
దాన్ని ప్రేమించటం నేర్చుకో
ఎన్ని కష్టాలు ఎదురైనా దాన్ని నిలుపుకో.

ఈ ప్రపంచం
నిన్నెలా చూడాలనుకొంటుంటుందో
అలా వేషం కట్టి
ఆత్మలోకంలో అమ్ముడుపోకు.
అబద్ధపు వేషం పదే పదే కట్టి
నువ్వే ఓ నిలువెత్తు అబద్ధంగా మారిపోకు

ఈ ప్రపంచం
ఏవి నీకు ఉండకూడదని ఆశిస్తుందో
అదే నీ అస్తిత్వం వాటిని కోల్పోకు
కర్ణుడు కవచకుండలాలని కోల్పోయినట్లు.

ఇంకొకరి అభిప్రాయంగా ఉండేకన్నా
నువ్వే ఓ సిద్ధాంతంలా మారు

26 April 2017

సెల్ఫీ

కొత్తవిలువలతో
వ్యామోహాలతో
ఆక్రమింపబడిన కాలమిది
దేహాలలో పాల బదులు
ఇనుప గుప్పెళ్ళతో పూలను పిండి
వండిన అత్తరు ప్రవహిస్తోంది

అద్దాల గదిలో
అసంఖ్యాక ప్రతిబింబాల్లా
ఎవరు ఎవర్ని
అనుకరిస్తున్నారో తెలియని
పరాయీకరణ పరాకాష్ట ఇది.

జీవితం
అప్పుడప్పుడూ కాసేపాగి
తన సెల్ఫీ తానే తీసుకొంటోంది
ఒక్కో ఫొటో
రక్తమూ కన్నీళ్ళు నింపుకొన్న
కవిత్వమై చరిత్రలోకి ఇంకిపోతోంది.

5 December 2017

పూలతోట

అమ్ముడు పోని పూలు
వాడి
ఎండిపోయాయనీ
ధరతక్కువ
ప్లాస్టిక్ పూలతో ఈ లోకం
నిండిపోయిందనీ
నిందిస్తూన్నంతకాలం
నువ్వు ఇంకా పంజరంలోనే
ఉన్నావని అర్థం

కిటికీ అద్దాన్ని బొగ్గుపొడితో
శుభ్రం చేయి.
ఎండిన పూలు విత్తనాలై
మొలకలెత్తి పూల తోటల్ని సృష్టిస్తోన్న
దృశ్యం కనిపిస్తుంది
ప్లాస్టిక్ పూలపై
ఏ తుమ్మెదా వాలటం లేదనే
సత్యం గోచరిస్తుంది.

నీలోపలకు తొంగిచూసుకో
పరిమళమేదో
సన్నగా వీచటం తెలుస్తుంది.

దాన్ని అనుసరించు
నీ పంజరాన్ని తెరిచే
తాళంచెవి ఉన్న చెట్టుతొర్ర వద్దకు
నిన్ను తీసుకెల్తుంది

నువ్వొక రెక్కల
కుసుమానివన్న స్పృహ
ఒక్కసారిగా కలుగుతుంది నీకు
పంజరం వీడి
ఎగరటం మొదలెడతావు

జీవితపర్యంతమూ
పరిమళించీ పరిమళించీ
పూదోటగా విస్తరించటానికే
నువ్వు ఇక్కడకు వచ్చావు

3 January 2017

మా నాన్నా - నేనూ

మా అక్కని ఒంటరిగా ఎప్పుడూ
బయటకు పంపేవాడు కాదు మా నాన్న
ఇప్పుడు నేనూ అంతే
మా అమ్మాయి బయటకు వెళతానంటే
తమ్ముణ్ణి తోడుగా తీసుకెళ్లమంటున్నాను.

కరువు కాలంలో పావలా తగ్గుతుందని
మూడు కిలోమీటర్లు సైకిలు తొక్కుకొని
పెద్దమార్కెట్లో సంత చేసేవాడు మా నాన్న
ఇపుడు నేనూ అంతే
ఏడాదికోసారి ఉల్లిపాయల క్యూలో
గంటలతరబడి నిలుచుంటున్నాను

సమాజం పట్ల ఆవేశం కలిగినపుడు
హిందూ పత్రికకు ఓ ఉత్తరం వ్రాసి పారేసి
ప్రపంచం మారిపోతుంది అని కలలు కనేవాడు
ఇప్పుడు నేనూ అంతే
ఆవేశాన్ని అక్షరాలలోకి ఒంపుకొంటాను
ఇంకేం చేయాలో తెలియక.

పాతబస్తీ అల్లర్లని రేడియోలో విన్నప్పుడు
పార్టిషన్ నాటి ఘర్షణల రక్తగాయాల్ని
కథలు కథలుగా వినిపించేవాడు మా నాన్న.

ఇప్పుడు నేనూ అంతే
టివిలో మారణహోమాల్ని చూసినపుడు
క్రుసేడ్లనుంచి సద్దాం వరకూ చరిత్రను ఏకరువుపెట్టి
బటర్‌ఫ్లై సిద్ధాంతాన్ని ఎగరేస్తాను నిస్సిగ్గుగా

మా ఇద్దరి జీవితాల మధ్యా
నాలుగు దశాబ్దాల దూరం పరుచుకొని ఉంది

మేమిద్దరం రకరకాల పాలకుల్ని మార్చాం కూడా

24 January 2017

ఎలా బయటపడగలవ్?

వేల నాల్కలతో మింగే
దాహానికి
శలభంలా మాడిమసి కాక ముందు
నువ్వు దానితో చేసుకొన్న
రాజీ ఒప్పందాన్ని ఎక్కడా చెప్పకు
ఆత్మను చంపుకొంటావో
హృదయాన్ని అమ్ముకొంటావో
నీ యిష్టం

గొర్రెల మధ్య గొర్రెలా
నక్కల మధ్య నక్కలా బతకటం
చాలా సులువు
మనిషిలా
బతకాలనుకోవటం కన్నా

17 February 2019

మహా నగరం

ఓ మహా వృక్షాన్ని కొట్టేసారు
ఒక పిట్ట తన చివరి పాటను
అక్కడే విడిచి
ఎక్కడికో ఎగిరిపోయింది
లేని చెట్టుకొమ్మకు వేలాడుతోన్న
ఆ పిట్ట పాట గాలికి ఊగుతోంది

ఆ పాట వినీ వినీ
నగరానికి పిచ్చెక్కింది

దుస్తులు చింపుకొని నగ్నయై
నేలపై పొర్లాడుతోంది
తన బాహువుల్ని తాడెత్తు గోడల్లా
పిచ్చిగా విస్తరింపచేసి
సరిహద్దుల్ని బంధించింది.

బయటకు వెళ్ళే మార్గం
ఎవరికీ తెలియదు
దాని గురించి
ఎవరూ మాట్లాడుకోరు కూడా!

11 March 2019

సోషల్ ఇంజనీరింగ్

మన జీవితాల్ని ఎక్సెల్ షీట్ లో
గదులు గదులుగా నింపి
బోర్డు మీటింగుల్లో
పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ద్వారా
మన తరపున నిర్ణయాలు తీసుకొంటారు
ఏం కొనాలో
ఏం తినాలో
ఎలా బతకాలో అన్ని నిర్ణయాలూ.

ఆ ప్రకారం జీవించాల్సిందే! వేరే దారి లేదు.
వ్యతిరేకించటానికి చేసే ధర్నా కూడా
నిర్దేశిత ప్రదేశాలలో అనుమతి తీసుకొని చేయాలి.
ఏదో కంపనీ సబ్బు కొని నీకు కరుణ ఉందని
ఏదో దేశ ప్రజలను ద్వేషించి నీకు దేశభక్తి ఉందని
నిరూపించుకోవలసి ఉంటుంది.

ఇప్పుడు ప్రపంచం
చక్కగా నియంత్రించబడుతోన్న ఒక యంత్రాంగం
చివరకు
నిన్నరాత్రి నువ్వు కన్న స్వప్నంతో సహా!

14 March 2019

గులకరాయి

వాచీలో అపుడు సమయం మారేడుమిల్లి
సెలయేటి ఒడ్డున కూర్చొని
నీటి రాపిడికి గుండ్రంగా నున్నగా మారిన
ఒక గులకరాయిని చేతిలోకి తీసుకొని
చెవి వద్ద ఉంచుకొన్నాను.

కొండలపై భోరున కురిసే వాన శబ్దాలు,
ఉరుములు, భీకరంగా వీచే గాలుల ఊళలు,
చీకట్లో చినుకుల దారిలో
"a girl in red coat" ఒంటరిగా
నడిచిపోతోన్న అడుగుల సవ్వడులు వినిపించాయి.
ఏవో జ్ఞాపకాలు బహుశా!

ఆ గులకరాయిని ఆశ్చర్యంతో చూస్తుండగానే
కళ్లముందే ఓ సీతాకోక చిలుకలా మారి
తన ఒంటరితనాన్ని నా చేతిలో ఒదిలిపెట్టి.
ఎటో వెళ్ళిపోయింది
దాన్ని జేబులో వేసుకొని ఇంటికి బయల్దేరాను.

***

ఒంటరితనం
ఎర్రని గౌను తొడుక్కొని

నా రీడింగ్ టేబుల్ పై కూర్చొని
చీకట్లో మెరిసే కళ్లతో
నన్నే తదేకంగా చూస్తోంది.
వాచీలో అపుడు సమయం అడవి.

("a girl in red coat"- "Schindler's list" సినిమాలో ఒక ప్రతీకాత్మక పాత్ర)

5 April 2019

స్త్రీ

ఎంతకాలం
తన స్వప్నాల్ని
బతికించుకోగలడు
పాపం ఆ కుర్రాడు!

నేత్రాల్ని అమ్ముకొని అంధత్వాన్ని
హృదయాన్ని అమ్ముకొని అల్పత్వాన్ని
కొనుక్కోక తప్పదు ఏనాటికైనా

"నువ్వు ఇదివరకట్లా లేవు
చాలా మారిపోయావు" అంటుందామె ఓ రోజు
కాళ్ల క్రింద నేల కూలినట్లనిపిస్తుంది అతనికి

ఆమె ఒళ్ళో చేరి
వల వలా ఏడ్చేస్తాడు.
ఆమె
తన స్తన్యాన్ని అతని
నోటికి అందించి
ఓదారుస్తుంది.

27 April 2019

Personal

నువ్వు మతవాదివా?
అవును మతవాదినే!

మతం అంటే భగవంతునితో
నేచేసే ఏకాంత సంభాషణ
చిడతలు పట్టుకొన్న సమూహాలలోను
త్రిశూలాలు తిప్పుతున్న బ ృందాలలోను
నేను లేను..... జై శ్రీరామ్

నువ్వు కమ్యూనిస్టువా?
అవును కమ్యూనిస్టునే!

కమ్యూనిజం అంటే సమాజం పట్ల
నాకున్న వ్యక్తిగత బాధ్యత
జండాలు పట్టుకొన్న సమూహాలలోను
తుపాకులు మోస్తున్న బృందాలలోను
నేను లేను..... లాల్ సలామ్.

27 May 2019

చిట్టి కురువి

ఓ చిన్నారి పిట్ట
నిలువ నీడలేక, దాహం తాళలేక
నేల కూలింది

మానవుడు ఇంతవరకూ తయారుచేసిన
గొడ్డళ్ళన్నీ
చనిపోతున్న ఆ పిట్ట చుట్టూ చేరి
దీనంగా చూస్తున్నాయి
రంపాలన్నీ
చనిపోతున్న ఆ పిట్టకొరకు
కన్నీరు కారుస్తున్నాయి
బుల్ డోజర్లన్నీ
చనిపోతున్న పిట్టను బ్రతికించమని
తొండాలెత్తి ప్రార్థిస్తున్నాయి

మనిషి జాడ లేదు

ఒక చిన్న పాప మెల్లగా నడచుకొంటూ వచ్చి
"చిట్టి కురివీ! నిన్నెవరు కొట్టారమ్మా" అంటూ
ఆ పిట్టను చేతిలోకి తీసుకొంది.
వేళ్ళ కొనలలోంచి జలపాతాల్ని పుట్టించింది.

దాహం తీర్చుకొన్న పిట్ట
రెక్కలు తప తప లాడిస్తో
పాప చుట్టూ కాసేపు తిరిగి
ఎటో ఎగిరిపోయింది.

(రోజూ పక్షుల కొరకు నీళ్ళూ, గింజలు ఉంచుతున్న చిన్నారి మేఘన కొరకు)

28 May 2019

తదుపరి ఎత్తు?

పార్కులో ఒక మూల
సిమెంటు బెంచీపై ఒక వృద్ధుడు కూచొని
రెండువైపులా ఎత్తులు తానే వేసుకొంటూ
చెస్ ఆడుతున్నాడు.

తెల్లరాజు, నల్ల రాణి ఎవరూ చూడకుండా
ముద్దులు పెట్టుకొని
ముసిముసి నవ్వులు నవ్వుకొంటున్నారు.

పల్లీల బుట్ట పట్టుకొన్న భటుడు
ఒక్కొక్కరి వద్దా కాసేపాగి ముందుకు
సాగుతున్నాడు.

బరువు తగ్గాలని ఏనుగు
గాల్లో చేతులు ఊపుకొంటూ
బోర్డంతా అటూ ఇటూ వాకింగ్ చేస్తోంది.

అమెరికన్ స్వీట్ కాన్ బండి గంట
పదే పదే మోగిస్తున్నాడు మరో బంటు

చెట్టుకింద కూర్చొన్న శకటం తాత
కమ్యూనిస్ట్ మానిఫెస్టో గురించిన కథలేవో
చెపుతున్నాడు చుట్టూ చేరిన కుర్ర భటులకు.

పెదాలపై రెండువేళ్ళు ఉంచుకొని
దీర్ఘంగా ఆలోచిస్తున్నాడా వృద్ధ ఆటగాడు

పిల్ల బంట్లు జారుడు బల్లపై
కేరింతలు కేరింతలుగా జారుతున్నారు

హాండ్ బాగ్ లోని కండోమ్ పాకెట్ ను
బయటకు తీసి రెండు వేళ్ళ మధ్యా తిప్పుతూ
ఎవరికో చూపిస్తోంది ఒక ఆడ బంటు

గుర్రం పరిగెత్తీ పరిగెత్తీ
పడమట లోయలో కరిగిపోయింది
మసక చీకటి మెల్లమెల్లగా
నాగమల్లి పూల పరిమళంతో కలిసి వీస్తోంది.

వృద్ధ ఆటగాడు ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు.
తదుపరి ఎత్తుకోసం.

11 June, 2019

కోరంగి మాంగ్రోవ్స్....

ప్రతిరోజూ ఎంతో మంది వచ్చిపోతూంటారు
పిల్లలతో, ప్రియురాళ్లతో
ఒంటరిగా, సమూహాలుగా.....

చెక్కల వంతెనదారికి ఇరువైపులా పరచుకొన్న
సౌందర్యాన్ని ఆస్వాదించటానికి,
గుంపులు గుంపులుగా నిద్రిస్తోన్న నత్తలని
నిబిడాశ్చర్యంతో చూడటానికి,
చిక్కని ఆకులతో మడచెట్లు పట్టే గొడుగు నీడల
స్నానం చేయటానికి,
రాత్రిపూట ఏదో జంతువు వదిలిన పాదముద్రల్ని
డీకోడ్ చేసేందుకు,
అసౌందర్యాన్ని రాల్చి ఎటో ఎగిరిపోయిన తెల్లకొంగను
దృశ్యంగా బంధించటానికి
ప్రతిరోజూ ఎంతో మంది వచ్చిపోతూంటారు

వచ్చిన వాళ్ళే మరలా మరలా వస్తూంటారు

ఈ వనానికి ఎప్పుడో గుప్పెడు క్షణాలు రుణపడ్డట్లు,
ఈ బురదనేలలో పోగొట్టుకొన్న ఏ స్వప్నాల్ని వెతుక్కోవటానికో
గాలిపీల్చుకోవటానికి భూమిపైకి వచ్చిన వేళ్ళలా
ఉరుకుల ఆయాసం తీరటానికి ఏ లోలోపలి ఊపిరికోసమో

వచ్చిన వాళ్ళని
పొన్నచెట్టు నీడలు, గుగ్గిలపు ఆకుల గలగలలూ
నవ్వుతూ పలకరిస్తాయి.

అభయారణ్యం మధ్యలో ఉన్న
క్షీణమైన పురాతన లైట్ హౌసు, దాని వలయాకార మెట్లు
ఏ కొద్దిమంది సాహసులనో ఆకర్షిస్తాయి
ఉత్సాహంగా ఉరకలు వేస్తూ, కేరింతలు కొడుతో
దానిపైకి ఎక్కి ఫొటోలు తీసుకొంటారు

వారిలో ఏ ఒకడో
దూరంగా కనిపించే సువిశాల సముద్రాన్నీ
లంగరు వేసిన ఓడల్ని, నగర హర్మ్యాల్ని
ఇంకా సుదూరంగా కనిపించే ఫాక్టరీ గొట్టాల్ని
శిథిలమైపోయిన ఒకనాటి కోరంగి మహానగరాన్ని
తదేకంగా చూసి
మౌన భారంతో మెట్లు దిగుతాడు

నదీపాయల నడుమ నారాయణ పక్షుల బారుని
డీజిల్ శబ్దం
చెల్లాచెదురు చేస్తుంది.

18 August , 2019

అంధుని ఇంద్రధనుసు ....

దాహానికి పనికిరాని
ఉప్పునీరు
పరవళ్ళు తొక్కుతూ
ప్రవహిస్తుంది

నువు మాట్లాడని మాటలన్నీ కూడా
నీ అస్తిత్వమే అన్న స్పృహ
నిన్ను దారికాసి అడ్డగిస్తుంది
జ్ఞాపకాలతో అనంతమైన పెనుగులాట

LED కాంతుల సందోహంలో
ఎపుడు తెలవారిందో
గమనింపే ఉండదు
పిట్టలన్నీ దారితప్పి
సముద్రంలో కూలిపోతాయి.

హతుని పిడికిలిలోని వెంట్రుకలు
ఏ DNA పరీక్షలకూ అందవు.

గతమంతా
అంధుని ఇంద్రధనుసు వర్ణనలా
అనిపిస్తుంది చివరకు.

అంతా అయిపోయిందని
కాడి పారేస్తాం.
అపుడు గమనించం కానీ
నేలపగుళ్ళలో దాక్కున గింజో
ఎదురొచ్చి కాళ్ళకు చుట్టుకొనే
పసిపాప నవ్వో
ఏదో మిగిలే ఉంటుంది.

కర్రను చెక్కపై తిప్పగా తిప్పగా
నిప్పు పుట్టినట్లు
ఒక్కసారిగా లోలోపల ఏదో కొత్తకాంతి
విచ్చుకొంటుంది.

కొండలమధ్య ఎక్కడో ఓ ఖగరాజం
నోటికి అడ్డంగా పెరిగిన ముక్కును
రాళ్ళకేసి బాదుకొని బాదుకొని
పునర్జన్మ పొందుతుంది.

20 August, 2019

వలస పోవటం....

"ఉండరా ఎదురు వస్తాను" అంది అమ్మ
"అవన్నీ మూఢనమ్మకాలమ్మా, నీ పిచ్చికానీ" అన్నాను
అమ్మ నవ్వుతూ ఎదురుగా వస్తూంటే
బేగ్ భుజాన వేసుకొని బయలుదేరాను
"జాగ్రత్తరా! ఉత్తరం రాయి" వెనుకనుంచి నాన్న

ముప్పై ఏళ్ళు గడిచిపోయాయి

అదంతా మళ్ళీ జీవించాల్సి వస్తే బహుసా
ఇలాంటి దారుల్లోనే సాగాల్సి వచ్చేదేమో!

కానీ ఖచ్చితంగా
"ఇది నీకు గొప్ప అవకాశమోయ్" అన్నప్పుడు
బాల్యం నుంచి తెచ్చుకొన్న నీలగోరింట మొక్కను
ఎడార్లకు అమ్ముకోకపోదును.

ఒక రాత్రివేళ గులాబి చేతుల్ని
విడిపించుకొని వచ్చేసేవాణ్ణికాదు.

మెట్లు ఎక్కుతున్న కొద్దీ నేలకు దూరమౌతున్నాననే
ఎరుకను మొదట్లోనే గ్రహించేవాడిని.

చీకటి జిప్పుతీసి ఒంటరితనాన్ని పదే పదే
చూపించే కిటికీని ధ్వంసం చేసి ఉండేవాడిని.

రెండుగా చీలిన దారిలో మరలా కుడివైపుకే
బహుశ కొంచెం ముందుగానే మళ్ళేవాడినేమో!

***

"ఉండరా ఎదురొస్తాను" అంటోంది నా భార్య
"అవన్నీ blind faiths అమ్మా" అంటున్నాడు కానీ
నా కొడుక్కూ అది ఇష్టమేనని నాకు తెలుసు.
ఆమె నవ్వుతూ ఎదురొస్తుంటే
ఓలాకాబ్ మెల్లగా ముందుకు కదిలింది
"ఫోన్ చేస్తూండు" అన్నాను కానీ
మాటలు గొంతుదాటాయో లేదో నాకే తెలీలేదు

చెంపలపై ఏదో జారినట్లనిపించింది
చేతికి వెచ్చగా కన్నీరు తగిలింది.

ముప్పై ఏళ్ల క్రితం ఇల్లు విడిచినపుడు
మా నాన్న కళ్ళలో కళ్ళు పెట్టి చూడలేకపోయాను!
ఇందుకేనేమో!

29 August, 2019

ప్రేమ...

చాన్నాళ్ళ తరువాత
చిన్ననాటి స్నేహితురాల్ని
కలిసాను
ఒకనాటి విఫల ప్రేమికురాలు
ఆమె.

ప్రేమించిన వాడి
పేరును
చేతిపై పచ్చబొట్టు
వేయించుకోవటాన్ని
వింతగా చెప్పుకొనేవాళ్ళం
అప్పట్లో!

హృదయంపై ఉండే
బార్ కోడ్ గీతలు ఒక్కొక్కటీ
కులానికి
మతానికి
అంతస్తుకి
ప్రతీకలని ఇప్పటికైనా
గ్రహించిందో లేదో!

22 November 2016

ఉదయకాంతి

సీసాకు ఉన్న అన్ని ఒంపులను
దుస్తులుగా ధరించే ద్రవంలా
హృదయం
ఈ లోకపు అన్ని వంకరలకు సర్దుకుపోగలిగితే
ఇక సాహిత్యం అవసరం ఏముంటుంది?

సర్దుకుపోవటం అంటే
చచ్చిపోకుండా ఉండటం అంతే!
చరిత్రలో
మనిషేనాడూ సర్దుకుపోలేదు.

సౌందర్యం తనను వర్ణించమంటుంది
కన్నీళ్ళు తమగురించి చెప్పమంటాయి
గాయాలు తమగురించి రాయమంటాయి
సంకెళ్ళు తమగురించి మాట్లాడమంటాయి

***

సరైన పదం కోసం
చీకట్లో తడుముకొంటూంటే
చేతికి సూర్యుని ముక్క తగిలింది

కన్నీళ్ళు తుడిచే
గాయాలని తడిమే

సంకెళ్ళని తెంచే
ఉదయకాంతి పద్యమై
విచ్చుకొంది

ఎప్పటికైనా
పద్యమే ఉదయకాంతి

5 January, 2018

గురుదేవులకు వందనాలు

కొన్ని జ్ఞాపకాలు
అలా నిలిచిపోతాయి మదిలోతుల్లో
మధుర గీతాల్లా, సుందర చిత్రాల్లా.

తనువు ఎక్కడెక్కడ సంచరించినా
ఏవో కొన్ని ఆత్మ శకలాలు ఈ స్కూలు ఆవరణలో
నేటికీ తిరుగాడుతూనే ఉంటాయి నీకైనా నాకైనా.

స్కూలు అంటేనే గురువులు
గురువులు అంటే నిన్నూ నన్నూ
గురిచూసి సంధించిన విలుకాళ్ళు.

****

మహేంద్రుడు స్వర్గలోకాధిపతి అని వినటమే! కానీ
మా మహేంద్రవాడ మాష్టారు అధిపతిగా ఉండి ఈ స్కూలును
అమృతతుల్యం చేసారు మా స్మృతులలో ఈనాటికీ.

కామేశ్వరరావు మాష్టారి చేతివేళ్ళనుండి మన జబ్బగుండా
హృదయంలోకి ప్రవహించిన క్రమశిక్షణ
అప్పుడు నెప్పనిపించినా ఇప్పుడు మెప్పుల్ని ఇస్తోంది.

దంగేటి మాష్టారు NCC దుస్తుల్లో తిరుగుతోంటే
ఆ నాలుగో సింహమేదో సంచరిస్తున్నట్లుండేది.

సలాది మాష్టారు నా జోలెలోకి విదిల్చిన ఆ కాసిన్ని అక్షరాలే
నేడు ఈ కలం నుండి జాలువారుతున్నాయి.

మేరుపర్వతం వంటి పేరి మాష్టారి భాషాగరిమ
విద్వత్ గాంభీర్యం అపుడు ఇపుడూ ఒక ఆశ్చర్యమే!

పెద్ద హిందీ మాష్టారి క్లాసులు రసవంతంగా
చిన్న హిందీ మాష్టారి క్లాసులు భాషావంతంగా ఉండేవి

ఉంగరాల మాష్టారు ఆనాడు క్లాసులో చెప్పిన బంగారు సూక్తులే
నేడు వ్యక్తిత్వవికాస పాఠాలుగా మార్కెట్ చేయబడుతున్నాయి.

చక్రవర్తుల మాష్టారు, ఆచార్యుల మాష్టారు గణితరాజ్య చక్రవర్తులై
మాకెవ్వరికీ గుండెగాభరా రాకుండా పరిపాలించేవారు.

రమణమాష్టారు చెప్పే జానపద కథలు ఊహాశాలితను పెంచేవి
కొప్పుల మాష్టారి విజిలు, లింగమూర్తి మాష్టారి వ్యక్తిత్వం
మాకు క్రీడలతో పాటూ జీవితాన్ని కూడా నేర్పాయి.

హబిబుల్లా మాష్టారు ఈ సువిశాల ప్రపంచాన్ని
ప్రాపంచిక తత్వాన్ని మా చిన్ని బుర్రల్లో దట్టించి వదిలారు.

జయశ్రీ మాష్టారు వాత్సల్యంతో, ఖాదర్ మాష్టారు ఉదారంగా,
మొండి మాష్టారు మంచిగా
మా హృదయాలలో శాస్త్రీయ బీజాలు నాటారు.

చెల్లి కృష్ణమూర్తి మాష్టారు క్లాసులో అంబేద్కర్ జీవిత ఘట్టాల్ని
రసార్ద్రభరితంగా ఆవిష్కరించిన వైనం నేటికీ సజీవమే ఈ
గుండెల్లో.

****

కొన్ని జ్ఞాపకాలు
అలా నిలిచిపోతాయి మదిలోతుల్లో
మధుర గీతాల్లా, సుందర చిత్రాల్లా.

ఈ జీవితానికి సరిపడా జ్ఞానాన్ని, అనుభవ సారాన్ని ఇచ్చిన
గురుదేవులందరికీ వందనం..........పాదాభివందనం.

29-12-2016

(యానాంలో నేను చదివిన మహాత్మాగాంధి బాలుర హైస్కూలు 60 వసంతాలు
పూర్తిచేసుకొన్న సందర్భంగా వెలువరించిన సావనీర్ కొరకు వ్రాసినది)

పాఠం

ప్యూపా నుంచి అందమైన
సీతాకోక చిలుక రావటాన్ని
నిబిడాశ్చర్యంతో
గమనించాడా పిలగాడు.

అది రెక్కలల్లార్చుకొంటూ
ఎగురుతోంటే చప్పట్లు కొడుతూ
ఆనందించాడు.

కొన్నాళ్ళకు
చచ్చిపోయిన ఓ సీతాకోకను
బ్రతికించటానికి ఎన్నో ప్రార్థనలు చేసి
ఫలించక ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు.

జీవితం ముందుకేతప్ప వెనక్కు
ప్రవహించదన్న సంగతి
ఏ స్వప్నమో నేర్పుతుందిలే!

20-09-2019

పట్నం కన్నీరు....

రాత్రి వేసిన
సిమెంటు రోడ్డుపై
ఏ పశువో నడిచిందేమో!

జంట చంద్రవంకల్లా
కాలి గిట్టల గుంటలు.

వాన నీరు చేరి నీలంగా ఉన్నాయి

గోరటి వెంకన్న గుర్తొచ్చాడు

చుట్టూ చూసాను
ఒక్క పిట్టా కనిపించలేదు.

2-10-2019

Skin Trade

‘పట్టువంటి మృదువైన చర్మం
నీ వయసుని తెలియనివ్వదు’ అంటూ
మిరిమిట్లుకొలిపే కాంతుల మధ్య
ఒకరు ప్రశంసింపబడుతూంటారు.
తనలాగే రక్తమాంసాలతో తిరిగే
మరొక వ్యక్తి చర్మాన్ని సజీవంగా ఒలిచి
అతికించుకొన్న ప్లాస్టిక్ సౌందర్యమది.

ఆ చర్మకాంతి వెనుక
ఒట్టిపోయిన సెక్స్ వర్కరో
పట్టుబడిన అభాగ్యురాలో
ఆమె ఎవరైతేనేం!
బతికుండగానే చర్మం
ఒలచబడుతుంది చీకట్లో.
దేహంపై పేదరికం
చేసిన మచ్చను జీవితాంతం
మోసుకుతిరుగుతుందామె.

విషాదమేమిటంటే అక్కడ కూడా
తెల్లతోలుకు విలువెక్కువ.

9 April, 2018

(సౌందర్య సర్జరీలకై నిరుపేదల చర్మాన్ని వలిచి సరఫరాచేసే స్కిన్ ట్రేడ్ గురించి)

ఎవరు వీళ్లంతా?

ఏసుబాబు
వీరాస్వామి
లక్ష్మణరావు
పెంటయ్య
ఇంకా కొంతమందీ.... ఎవరు వీళ్ళంతా!
ఓ ముప్పై నిముషాల వ్యవధిలో
ధరాధిపతులు, నరహంతకులూ అనాదిగా
చేసిన కృత్యాలన్నీ అకృత్యాలేనని
ఒక్క తులసిదళంతో తేల్చిపారేసారు.

అంత చేసీ
ఒడ్డుకు లాక్కొచ్చిన ఇరవైఏడుమందిలో
ముగ్గురి ప్రాణాలు కాపాడలేకపోయామని
బాధపడుతున్నారు చూడు!

ఓ నా చిట్టి మేధావీ!

ఆ కొద్దిక్షణాలూ
బొట్టు, టోపీ, శిలువా, రోలెక్స్ వాచీ
ఏ తారతమ్యం లేదక్కడ
ఆ కొద్దిక్షణాలూ
మనం నిర్మించుకొన్న
గోడలన్నీ కుప్పకూలిపోయాయి

ఓ నా చిట్టి మేధావీ!
మరోసారి చెపుతున్నాను విను.

మానవత్వం ఒకటే
మునిగిపోతున్న ప్రాణానికి ప్రాణం పోసింది
మనిషితనం ఒకటే
మనిషిని మనిషితో బంధించింది.
మనిషి గమ్యం మనిషితనమే ఏనాటికైనా!

ఐస్ ఏజ్ నుంచి డిజిటల్ ఏజ్ దాకా
మానవజాతి నౌకాయానానికి
ఏ చరిత్రా గుర్తించని
కనిపించని తెడ్లు వీళ్ళు.
మనుషులుగా మనం పూర్తి వైఫల్యం
చెందలేదనటానికి మిగిలున్న
ఒకే ఒక సాక్ష్యం వీళ్ళు.

19 September, 2019
(ఇటీవలి గోదావరి బోట్ ప్రమాదంలో అనేక ప్రాణాలు కాపాడిన స్థానికజాలరుల కొరకు)

ఫ్రాగ్మెంట్స్

1.
కాలంలా ఒకసారి
మొఖం చూపించి పారిపోదు కాంతి
ఇక్కడిక్కడే తారాడుతుంది
పువ్వుల్లోనో, నవ్వుల్లోనో

2.
ఆకాశం
తన పెదాలకు
ఏడురంగుల లిప్ స్టిక్
కొట్టుకొంది

3.
ఒంపులన్నీ
సరిగ్గా ఉన్నాయో లేదొ
ఆఖరుసారి అద్దంలో చూసుకొని
బయటకు అడుగుపెట్టింది
నెలవంక

4.
స్థిరత్వం లేదన్నావు కదూ!
కిటికీలోంచి వచ్చిన
సూర్యకాంతే
ఊసలు ఊసలుగా
ముక్కలయింది
ఇక నేనెంత?

6.
ఏదో చేప వలలో చిక్కింది
భారంగా ఒడ్డుకీడ్చుకొచ్చారు.
అదృశ్య కన్నీళ్ళకు
సంద్రం అనాదిగా ఉప్పుతేరుతూనే ఉంది.

7.
విద్య మద్యం
ఇక్కడ MRP ధరలకే
అమ్మబడును.
ఉరేసుకోవటానికి "పెర్మిట్ రూమ్"
సదుపాయం కూడా కలదు

8.
అభిమాన నటుడి ఫ్లెక్సీలు
హోరెత్తించే స్పీకర్లు
తూలిపోతూ స్టెప్పులు వేస్తున్న
టీనేజ్ పిల్లలు
దుఃఖం పొంగుకొస్తోంది.

3 November 2017

ఫ్రాగ్మెంట్స్

1.
రాత్రి ఫోన్ చేసాను ఎత్తలేదేం?
24/7 సిగ్నల్స్ రిసీవ్ చేసుకోటానికి
నేను సెల్ టవర్ ని కాదు మనిషిని
అందామనుకొన్నాడా చిరుద్యోగి
"సారీ బాస్" అన్నాడు

2.
అక్కడో కోపోద్రిక్త సమూహం
రాజుగారి దిష్టిబొమ్మను తగలేస్తూంది.
అనాదిగా నరహంతక రాజ్యానికి
బలయిన అసంఖ్యాక ఆత్మలు
పడీ పడీ నవ్వుకొంటున్నాయి.

3.
సూర్యకిరణాల కిలకిలారావాలతో
మొదలవ్వాల్సిన కొన్ని ఉదయాలు
తుపాకీ మోతలతో మొదలవటం
ఎంత విషాదం!
'వివేకుడా' నీకు నా ముద్దులు.

4.
అందమైన సీతాకోకలు
గాల్లో తేలిగ్గా అలా ఎగిరే దృశ్యం
హాయిగా అనిపించేది.
ఒకరోజు
రైల్వే ట్రాక్ పై చెత్త ఏరుకొంటున్న
మురికిబట్టల సీతాకోకను
చూసే వరకూ.....

5.
ఒక్కో విప్లవంలోంచి
ఒక్కో నియంత పుట్టుకొచ్చినట్లు
ఒక్కో విత్తనం లోంచి
ఒక్కో ఉరికొయ్య మొలకెత్తుతోంది.

6.
ఎంతో స్వచ్ఛంగా బోసి నవ్వులతో
ఇక్కడికి వస్తాం
మురికి మురికిగా మారి
ఏడుస్తూ నిష్క్రమిస్తాం

ఫ్రాగ్మెంట్స్

1.

పచ్చని చెట్టుమీదకు
ఆకాశం నుండి
తెల్లని కొంగ ఒకటి
కాళ్లని ముందుకు సారించి
రెక్కల్ని లోనికి తీసుకొని
కొమ్మపై వేళ్ళను బిగిస్తూ
బివివి హైకూలా వచ్చి వాలింది

2.

ఈ అపార్ట్ మెంట్ కిటికీ
ఓ తెరుచుకొన్న గాయం.
బరువైన వక్షోజాలు
బలమైన ఊరువులతో
ప్రపంచం
ఓ ఆటకత్తె ఆకర్షిస్తోంది.

3.

ఏది తేలికైనది?
ప్రపంచం అనే భారాన్ని
మోయక్కరలేని స్వప్నమా!
హృదయం అనే సంకెళ్ళను
వదిలించుకొన్న సత్యమా!

4.
పాటు సమయాన తీరంపై
వీచే సముద్రపు వాసనలా
ఆమె దేహ పరిమళం
చలికాలపు కాన్క

5.
సామాన్లు సర్దుతుంటే
పాత ఫోను కనిపించింది
ఆన్ అయింది చిత్రంగా
కంటాక్ట్స్‌లో అమ్మ నంబరు
అలాగే ఉంది.

6.
ఏ రెండు
కన్నీటి చుక్కలు ఒకేలా ఉండవు
వాటిని చూసినపుడు
జారిన మూడో కన్నీటి చుక్క
కవిత్వం.

బొల్లోజు బాబా

తల్లిదండ్రులు	బొల్లోజు బసవలింగం, అమ్మాజి
సహచరి	సూర్య పద్మ
పిల్లలు	అపరాజిత, బసవ శ్రీధర్
చదువు	M.Sc., B.Ed., M.Phil.
వృత్తి	జువాలజీ అధ్యాపకుడు

రచనలు

యానాం విమోచనోద్యమం (2007)
ఆకుపచ్చని తడిగీతం (2009) కవితా సంపుటి
ఫ్రెంచిపాలనలో యానం (2012)
స్వేచ్ఛావిహంగాలు (2016) (రవీంద్రుని స్ట్రే బర్డ్స్ అనువాదం)
వెలుతురు తెర (2016) కవితా సంపుటి
కవిత్వ భాష (2018) సాహిత్య వ్యాసాలు

ఇ.బుక్స్

'ఎడారి అత్తరులు' (ప్రముఖ సూఫీ కవుల గీతాల అనువాదాలు)
ఇరవై ప్రేమకవితలు ఒక విషాదగీతం (Twenty Love Poems and a Song of Despair, Pablo Neruda , అనువాదం)
రవీంద్రుని క్రిసెంట్ మూన్ అనువాదం
గాథాసప్తశతి–కొన్ని అనువాదాలు
వివిధ పుస్తకాల పరిచయ వ్యాసాలు
(పై పుస్తకాలు http://www.kinige.com/author/Bolloju+Baba వద్ద లభ్యం)

బ్లాగు	http://sahitheeyanam.blogspot.com/
ఎఫ్.బి.	https://www.facebook.com/bolloju.baba

అవార్డులు

'ఆకుపచ్చని తడిగీతం' కు శిలపరశెట్టి సాహితీ ప్రత్యేక పురస్కారం 2010
శ్రీ ర్యాలి ప్రసాద్ – డా. సోమసుందర్ స్మారక సాహితీ పురస్కారం 2016
ఇస్మాయిల్ సాహితీ పురస్కారం 2017
రొట్టమాకు రేవు కవిత్వ అవార్డు 2018

bolloju baba poetry

moodo kanneeti chukka



"Narrative poetry మనకేమీ కొత్త కాదు. అయితే, అత్యాధునిక సందర్భంలో ఈ విధమైన నిర్మాణం వెంట ముఖ్యంగా రెండు ప్రయోజనాలున్నాయి. వొకటి: సంప్రదాయ కవిత్వ శైలిని నిరాకరించడం, రెండు- కవిత్వంలో వొదగని సాంస్కృతిక లక్షణాలను స్వీకరించడం. ఈ రెండు పనులూ చక్కగా చక్కదిద్దుతున్నాడు బాబా.


ముఖ్యంగా- ఈ కొత్త కవిత్వ సంపుటిలో బాబా Narrative poetry కి సంబంధించిన అనేక కోణాలని మనకి పరిచయం చేస్తున్నాడు. బహుశా, ఈ సంపుటి ప్రధానంగా తలపెట్టిన task అదే! పైన చెప్పిన కవితలో ఇతర అంశాలు అనేకం వున్నా, అందులోని narration మనల్ని కట్టిపడేస్తుంది."

- అఫ్సర్



"పర్సనల్ అనుభవాల ద్వారా పబ్లిక్ వాస్తవాన్ని రూపుకట్టటం బొల్లోజు బాబా కవిత్వ విధానం. బయటపెట్టటాన్ని మించి దాచి పెట్టటంలోనే ఇతని కవితా కళ విశిష్టత ఉంది. He hides more than he reveals. అనార్భాట మైన వచనంతో ఆకర్షణీయమైన కవిత్వ గూడు అల్లడంలో ఈ కవి నిష్ణాతుడు. మానవ వ్యవహారాల్ని మ్యాజికల్ రియలిజం ద్వారా ప్రవేశపెట్టి మెప్పించగలగడంలో దిట్ట."

- జి. లక్ష్మినరసయ్య


వెలుతురు తెర
బొల్లోజు బాబా
కవిత్వం

వెలుతురు తెర

కవితలు

బొల్లోజు బాబా

9849320443

వెలుతురు తెర

– బొల్లోజు బాబా

జూన్ – 2016

వెల: రు. 100/-

కాపీల కొరకు:

బొల్లోజు బాబా
30-7-31
సూర్యనారాయణ పురం
కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా
ఫోన్: 0884/2368189
9849320443

డిజైన్: ముమ్మిడి చిన్నారి

ముద్రణ: అభిసారిక ప్రెస్, సామర్లకోట

ఇందులో ...

మంచం నేసే చేతులు

"There is no Mountain of Sorrows
No ocean of griefs
There are only
Small hands
That Weave sorrow all day
Like a rope on a cot"

- Kedarnath Singh
Great Hindi Poet

బొల్లోజు బాబా – ఎవరీ బొల్లోజు బాబా? పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ లెక్చరర్ గా పనిచేస్తున్న అధ్యాపకుడు. కవి, కవిత్వ సమీక్షకుడు – యానాం విమోచనోద్యమం గురించి పుస్తకం రాసిన, ఒక రకంగా చరిత్రకారుడు. ప్రతీ కవీ ఒక రకంగా 'చరిత్రకారుడే' తను జీవించిన కాలాన్ని–చరిత్రగా, సామాజిక చరిత్రగా మలచేవాడే. సూఫీకవుల్నీ, విశ్వకవి రవీంద్రుణ్ణి అనువదించిన వాడు. నెరుడా–యిరవై ప్రేమ కవితలు ఒక విషాదగీతం–అనువదించిన వాడు. యివన్నీ ఎందుకంటే బాబా Novice/కొత్తవాడు కాదు; సాహిత్య సాధనలో తలమునకలై ఉన్నాడు 'అని చెబటానికి. యానాం అనగానే శిఖామణి, దాట్ల రాజుగారు గుర్తుకు రాక మానరు. బాబా కాకినాడలో పనిచేస్తున్నా– అతని వేళ్ళు యానాంలో ఉన్నాయనిపిస్తుంది. యానాంకొక చరిత్రవుంది – ఒక ఉద్యమ సాంస్కృతిక చరిత్రవుంది. ఒక సాహిత్య చరిత్రవుంది.

బాబా పూర్వరంగమిది. సాహిత్య వారసత్వమిది; కాకినాడ అనగానే ఇస్మాయిల్‌గారు గుర్తుకురాక మానరు; అటు పిఠాపురం సోమసుందర శిఖరముంది. కోనసీమ సౌందర్యముంది; వీటంటి వెనక కృష్ణశాస్త్రి గారి 'ఊరకే చలియించు ఈ రేయివెన్నెలలున్నాయి'.

బొల్లోజు బాబా సాహిత్య రేఖా విలాసాలు అందాలను అందుకోవాలంటే, రేఖామాత్రంగానైనా యివి తెలియాలి. ఈ నేపథ్యాల నుంచి, సాహిత్య వారసత్వం నుంచి బాబా జీవించాడు కవిగా. 2009 లో అచ్చయిన అతని మొదటి కవితాసంపుటి – ఆకుపచ్చని తడిగీతం' లో సౌందర్యం అనే కవిత చూడండి.

'సెలయేటి ఎగువన ఎవరో
నీటిలో వెన్నెల బిందువుల్ని
కలిపారు.
నీరు తాగాలని వంగితే
దోసిట్లో చందమామ'

సూచ్యంగా, సూక్ష్మంగా బాబా తత్వాన్ని చెప్పే కవిత. ఆ సంపుటిలోనే 'అతడు–ఆమె' అనే కవితవుంది.

'అతడామెను
నడిచే చందమామ అనీ
పరచుకొన్న వెన్నెలనీ
నిలిచిపోయిన వసంతమనీ
వర్ణించాడు'

కవిత అలా సాగి సాగి

'ఎన్నో అన్నాడు
అతడామె గురించి చాలా చెప్పాడు–
కానీ ఆమె మాత్రం
ఒక చిరునవ్వు శాపమిచ్చి వెళ్ళిపోయింది
తెరచాటు మనిషి కదా!'

ఒక ముక్తాయింపు, ఒక ఆశ్చర్యపు వెలుగు–

చిరునవ్వు శాపమిచ్చి వెళ్ళిపోవటం' గొప్ప ఊహ–

అతని రెండో కవితా సంపుటి యిప్పుడు రాబోతుంది–''వెలుతురు తెర''–ఇంకేదయినా మంచి పేరు సూచించమనీ అడిగాడు. 'వెలుతురు తెర' బాగుంది. అతని మొదటి కవితా సంపుటికి గొప్ప పొడిగింపు– Beautiful Extension. వస్తు, రూపాల్లో ఒక Sophistication –ఒక నాగరీకం వచ్చింది. ఏ గుణాలయితే కవిత్వసంబంధి అంశాలో – యిందులో అవి పరిపక్వ దశకి చేరాయి. ఒక పరిణత కన్పించింది. వస్తువును సంభావించే తీరులో, దానికొక రూపమిచ్చే పనిలో గొప్ప నైపుణ్యం కన్పించింది. ఒక లాఘవం–ఒక వడుపూ అబ్బాయి–

మొదటి కవితా సంపుటిలో ఈ వాక్యాలు ఎదురవుతాయి–

'ఏదయినా ఓ పుస్తకంలోకి నడవటమంటే
పరిచిత పాత్రలలోకి
మనల్ని మనం ఒంపుకోవటమే'

ఈ కవితా వాక్యాల్ని కొద్దిగా మార్పులు చేస్తే, రెండో కవితా సంపుటికి అన్వయిస్తాయి.

ఏదయినా ఓ పుస్తకంలోకి నడవటమంటే
పరిచిత ప్రాంతాలలోకి
మనల్ని మనం ఒంపుకోవటమే–

యింకాస్త మార్చితే–

అపరిచిత ప్రాంతాలలోకి
పాత్రలలోకి
మనల్ని మనం ఒంపుకోవటమే!

పరిచయమయిన పాత్రగావచ్చు ప్రాంతం గావచ్చు – కవితలో కొత్తగా, మనం చూడని కోణం నుంచి పరిచయమవుతుంది.

షాహర్యార్ (Shahryar) అనే ప్రసిద్ధ ఉర్దూ కవి– ఒక గజల్ లో అంటాడు

The beauty of his verse
is not its meaning
Beauty of his poetry
is not always in its meaning – అని

బహుశ కవిత్వం మొత్తం వస్తువును భాషలోకి అనువదించటమే. ప్రతికవికి అతనిదయిన ప్రత్యేక భాష వుంటుంది. 'Conceiving the context into language' జీవితాంతం తన కవిత్వ పరిభాషనిర్మాణంలో కవి ధ్యానమగ్నుడై వుంటాడు. ఒక కవిని యింకొక కవినుంచి వేరు చేసేది – అతని కవిత్వ పరిభాషే. యిది అతని నేపథ్యం మీద, వర్గ కుల ప్రాంతాల ప్రభావం మీద ఆధారపడి వుంటుంది. ముఖ్యంగా అతని దృష్టిమీద – attitude మీద perception మీద ఆధారపడి వుంటుంది.

ఈ సందర్భంలో నాకొకటన్పిస్తుంది. 'బొల్లోజు బాబా తెలంగాణలో పుట్టి పెరిగివుంటే; ఉత్తరాంధ్రలో పుట్టి పెరిగివుంటే ఎటువంటి కవిత్వం రాసివుండే వాడు' అని

ఖచ్చితంగా యిప్పటి కవిత్వానికి భిన్నమయిన పరిభాషలో రాసివుండే వాడు. కాళ్ళు గాలుతుంటే, వేడిగాలులు వీస్తుంటే, గుక్కనీరు దొరక్క అటమటించిపోతుంటే – తత్సంబంధమయిన వస్తుజాలంతో– నెత్తురంటిన కవిత్వ పరిభాషలో రాసి వుండేవాడని నేననుకొంటా –

ఇదంతా ఒక Guess Work

గత రెండుతరాల కవుల– ముఖ్యంగా ముప్పయ్యిలలో–నలభైల్లలో ఉన్న కవులు– కవిత్వం చాలా భిన్నమయింది. రొట్టకొట్టుడు లేదు. వస్తు నవ్యత, రూప నవ్యత గణనీయంగా పెరిగింది. వస్తువును చూడటం దగ్గరనుంచి, కోణం ఎన్నుకోవటం దగ్గరనుంచి–విప్పుకుంటూ పోయే విధానం దాకా కొత్తపోకడలు పోతున్నారు. భాష–యింత సౌందర్య వంతంగా, నాజూకుగా, లావణ్యంగా, లాఘవంగా గతంలో వాడబడిందా అని నాకన్పిస్తుంది. సంక్షోభ భరితమైన సందర్భంలో – ముఖ్యంగా గత రెండు దశాబ్దులుగా–కూడా, మొరటుదనం లేకుండా కనపడకుండా కవిత్వం రాయటం– ఈ నూత్న తరాలకవులు సాధించిన విజయమని నే భావిస్తున్నా– వారివారి తాత్విక నేపథ్యమేదయినా–వాదమేదయినా–కవితమీద కవిత్వరూపం మీద; భాషమీద, వ్యక్తీకరించే పద్ధతి మీద–ఇంతటి ధ్యాస మునుపెన్నడూ లేదనిపిస్తుంది

ఈ పుస్తకంలో 'చరిత్ర' అనే ఒక కవిత వుంది. కవిత మొత్తం ఉదహరిస్తా

చరిత్ర

"ఈ సొరంగం చివర
వెలుతురు ఉండి తీరాలి" అన్నాడతను

"ఒకప్పుడు ఉండేదట!
చెదలు తినేసాకా వెలుతురంతా
అయిపోయింది" అన్నారు కొంతమంది వృద్ధులు.

వెలుతురుని వెతుక్కుంటూ సాగిన ఆ యువకుడు
చెదపురుగులకు బలయ్యాడు.
ప్రజలు పడీ పడీ నవ్వుకొన్నారు
అయినవాళ్ళే మూర్ఖత్వమని
గుసగుసలాడుకొన్నారు చాలాకాలం.

కొన్నేళ్ళ తరువాత
వెలుతురు రాజ్యంలో, నగరం మధ్యలో
ఆ యువకుని విగ్రహం
"వెలుతుర్ని స్వప్నించిన సాహసి"
అనే అక్షరాలతో.

ఈ కవితలో ఎన్ని పొరలున్నాయో-అర్థ స్ఫూర్తులున్నాయో, రకరకాల పాఠకులు రకరకాలుగా వ్యాఖ్యానించటానికీ, ఎంత అవకాసముందో- కాల సందర్భాల్ని వస్తువుగా మార్చి - మూడు బొమ్మల ద్వారా/Images ద్వారా వ్యక్తపరచటం-

వ్యక్తమయిన భావం భాషగా-Image గా- భాష దృశ్యం భావ దృశ్యమై, దృశ్య సమ్మితమైన భాష వస్తువుగాను, దృక్పథంగానూ-తాత్విక సారాంశంగాను-వడకట్ట బడుతుంది.

ఈ నైపుణ్యం యిపుడు కొత్తగా కవిత్వం రాస్తున్న - 30, 40 ఏళ్ళ వయసులో వున్న వాళ్ళ కవిత్వంలో చాలా బలంగా చొచ్చుకొచ్చింది. బహుశ అందుకే ఈ కవులు 'Monotony' ని బ్రేక్ చేసారనిపిస్తుంది. కవిత మొత్తం ఒక అర్థవంతమయిన రూప నిర్మాణమవుతుంది- దాని వ్యక్తిత్వం, అభివ్యక్తులు దానికుంటాయి.

బహుశ ప్రతిదీ, సంక్షోభం కావొచ్చు, సౌందర్యం కావచ్చు అంతర్నిహితమౌతుంది, అంతర్గతమౌతుంది–Internalise అవుతుంది. కవితకి రెండు ఉనికులు లేవు. ఒకే ఉనికి. ఒకే రూపం, సౌందర్యం, సంక్షోభం – నిండిన రూపం పాఠకుణ్ణి పీల్చేస్తుంది. కవిత, తన్లోకి పాఠకుణ్ణి లాగేస్తుంది. కవిత ఉనికీ,జీవితమే – అతని ఉనికి, అతని అనుభవ జీవితం. ఇక్కడ ఈ రెండుతరాల కవులు ముందడుగు వేసారు. గతాన్ని, గతపు వారసత్వాన్ని స్వీకరిస్తూనే వాళ్ళదయిన ఒక కవిత్వ వ్యక్తిత్వం, కవిత్వ నిర్మాణం చేసుకుంటూ వస్తున్నారు.

కవిత్వం వాచ్యంగా రావటం మానేసి చానాళ్ళయింది. బడ బడ శబ్దాలు చేయటం మానేసి, గుండె గొంతుకలో కొట్లాడటం మొదలెట్టింది.

'కొన్ని పదాల గురించి' అనే కవితలో

'ఏమీ గుర్తు లేవిపుడు
జేబుడు సూర్యకిరణాలు
గుప్పెడు చందమామ
ముక్కలు తప్ప.

దుఃఖాశ్రువులు నిండిన
సాయంత్రాన్ని
రాత్రి రెప్పల క్రింద
నిదురపుచ్చి అన్నీ
మరచిపోదామనుకొంటాను
కానీ
కొన్ని పదాలు నా నుండి రాలిపడి
ఓ ఎడారిని సృష్టిస్తాయి
ఆ ఎడారిలోంచి ఓ అరణ్యం
ఆ అరణ్యం లోంచి కుంభవృష్టీ
ఒక్కొక్కటిగా విచ్చుకొని
నన్ను కబళిస్తాయి.
నానుంచి పుట్టినదైనా

నన్నో పూచికపుల్లను చేసి
కొట్టుకొని పోతుంది
ఏమీ గుర్తులేవిపుడు
జేబుడు పదాలు
గుప్పెడు కలల
ముక్కలు తప్ప

అంతా ధ్వనిపూర్వకమే - వచనం నుంచి కవిత్వాన్ని వేరు చేసేది 'ధ్వని' మాత్రమే. Suggestion కి అత్యంత ప్రాధాన్యత. పద్యం చదవటం ముగిసిన తర్వాత - 'ఎంత బాగా అన్నాడు, ఎంత బాగా ఊహించాడు- ఊహించిన దాన్ని ఎలా దృశ్యమానం చేశాడు - అదెలా మన అనుభవం చేశాడు - మన అనుభవం - కవిత్వానుభవంగా మారి అంచుల దాకా చేరి పొంగిపొర్లుతుంది - ఒక ఆహ్లాదం ఒక సంతృప్తి - కొత్త దాన్నేదో అందుకొని అనుభవించిన తృప్తి - లోలోపల కాంతిగా పరిణమిల్లుతుంది - అంతా వెలుగే.

ఈ కవితా సంపుటిలో లేనిదాన్ని గురించి నేనాలోచించను; డిమాండ్ చేయను; దాన్ని గురించి ఎందుకు రాయలేదు దీన్ని గురించి ఎందుకు రాయలేదు' అని నేనడగను; అతననుకున్న దాన్ని, అతని అనుభవంలోకి వచ్చిన దాన్ని; అదే సాంద్రతతో, తీవ్రతతో మన కందించాడా లేదా అన్నదే ముఖ్యం. ఆ పని బాబా చాలా సమర్ధవంతంగా, సంతృప్తికరంగా నిర్వహించాడని నేననుకుంటా -

ఇంకా తను భారతీయ కవిత్వానికి ప్రపంచ కవిత్వానికి Expose కావలసివుంది. ప్రపంచ భాషల్లో వస్తున్న కవిత్వం - ఆయా దేశకాల పరిస్థితులలో- ఎంతగొప్పది. ఒక్కో కవి ఒక్కో అంశం చెపుతాడు. పద్మవ్యూహం నుంచి బయటపడే మార్గం చూయిస్తాడు. నువ్వెంతగా యితరుల కవిత్వాన్ని లోతుగా చదువుతావు - జీర్ణ చేసుకొంటావు - రక్తనిష్టం చేసుకొంటావు అన్నదాన్ని బట్టే, నీ ఎదుగుదల, విస్తీర్ణత, విశాలత - ఒక కవిత విస్తృతమౌతూ - సార్వజనీనానుభవం ఎలా పరిణమిల్లుతుంది; అనే గొప్ప రహస్యాన్ని యితర కవులే బోధించగలరు.

మన వేళ్ళ నుంచి-మన జీవితం నుంచి, మన ప్రపంచం నుంచి మన అన్నిరకాల నేపథ్యాల నుంచి- మనం కవిత్వం పలుకుతాం - మన అనుభవాల్నుంచి,

దేన్ని ఏరుకుని కవిత్వం చేయగలం, గొప్ప కవిత్వం చేయగలం – అనే ఒక కవిత్వమార్మిక సూత్రాన్ని యితరులనుంచే గ్రహించగలం.

అంతా వివరాలతో విస్తృతమౌతుంది. రోజుకోరకంగా రూపు దిద్దుకొంటున్న జీవితాన్ని దాని సర్వసారాంశంతో పట్టుకొని – కవిత్వం చేయటం – లోతయిన అధ్యయనం, నిత్య సాధన ద్వారానే సాధ్యమవుతుందని – బాబా ఈ పాటికి గుర్తించివుంటాడు. గొప్ప Sensibility వుంది, గొప్ప చూపు ఉంది, జీవితాన్ని ప్రకృతిని చూసి పరవశించే గుణముంది – మొద్దు బారనితనముంది; మొగలిపొదలా నిలబడే తత్వముంది–

అది శిఖామణి కావొచ్చు, శ్రీకాంతశర్మ కావొచ్చు– ఒక లోతయిన తాత్విక కోణంలో కవిత్వం రాస్తూ– (రాజకీయం కాని తాత్వికకోణం లేదు) 'కాలుష్యమంటని కవి, కవిత్వం' అనటం–బాధాకరం–నాకీ మాట బూతుమాటగా ధ్వనిస్తుంది – అంతా కల్మషమయిన జీవితంలో, ప్రపంచంలో అకల్మషమేముంటుంది.

వీటన్నింటినీ అంతర్లీనం చేసుకొని గొప్ప కవిత్వం చెప్పగల సత్తా నీలో ఉండాలి. ఆ సత్తా ఎలా సమకూర్చుకోవాలన్నది ముఖ్యం. బహుశ దీర్ఘకాలికంగా కవిత్వ సాధన చేస్తూ వస్తున్న వాళ్ళకి – ఏ వాదపు నేపథ్యం నుంచైనా – ఇవన్నీ అందుతాయి, అనుభవంలోకి వస్తాయి.

గొప్ప కవిత్వం చదవండి;
గొప్ప కవిత్వం రాయండి–
మార్గాలన్వేషించండి–

బాబాని చదువుతుంటే చాలామంది గుర్తుకు రావొచ్చు–ఆ నీడలేవో లీలగా తారాట్లాడతాయి –అవన్నీ క్రమక్రమంగా తొలగిపోతాయి– నిజమయిన బొల్లోజు బాబానే మనముందు ప్రత్యక్ష్యమౌతాడు – ఆ ఆశ, ఆ వాగ్దానం యిందులో పుష్కలంగా వుంది.

దాహం

భూమిలోంచి పైకి లేచిన కుళాయి గొట్టం
ఒంపు తిరిగి పిట్టగోడను అనుసరిస్తూ సాగి
మరో రెండు మలుపులు తీస్కొని

ఇత్తడి టాప్ నేత్రమై
ఏ మేఘసందేశాన్నో నీళ్ళ భాషలో అందిస్తుంది

పుస్తకమూ అంతే
ఎన్నో మలుపులు తీసుకొని చేతిలోకి చేరి
ఒకనాటి మనో ఆకాశపు వానచినుకుల్ని
అక్షరాలుగా వర్షింపచేస్తుంది
మట్టి నయనాలపై

బొల్లోజు బాబా కవిత్వాన్ని గొప్పగా ఆనందించా, అనుభవించా. అతనొక తేనెపిట్ట– తేనెపిట్ట పువ్వుమీద వాలకుండా గాల్లో తేలుతూ తేనె పీల్చటం ఎంతగొప్ప విద్యో – ఆ దృశ్యం ఒక అనుభవం.

ఆ అనుభవాన్ని నాకిచ్చిన బాబాకి ధన్యవాదాలు

అతనికి శుభం జరగాలి

5/4/2016 **– కె.శివారెడ్డి**

కృతజ్ఞతలు

నా గురించి, నా కవిత్వం గురించి వ్రాసి – ఎంతో ప్రేమతో
ఆశీర్వదించిన శ్రీ కె. శివారెడ్డి గారికి

వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నన్ను ముందుకు నడుపుతూన్న నా
సాహితీగురువు శ్రీ శిఖామణి గారికి

ప్రేరణగా నిలిచి, స్ఫూర్తి నిచ్చే శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి

అందమైన ముఖచిత్రాన్ని ఇచ్చిన బాల్య మిత్రుడు ముమ్మిడి చిన్నారికి–

ఇంకా – శ్రీ అఫ్సర్, శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, శ్రీ ఆకెళ్ల రవిప్రకాష్,
శ్రీ పి.ఆర్.ఎల్. స్వామి, శ్రీ యాకూబ్, శ్రీమతి విజయలక్ష్మి,
శ్రీమతి వీరలక్ష్మీదేవి, శ్రీ అద్దేపల్లి ప్రభు, శ్రీఅవధానుల మణిబాబు,
శ్రీ గనార, శ్రీ చెల్లి రాం, శ్రీ మధునాపంతుల, శ్రీ గణేష్ కుమార్,
సంజీవ్, ఫణి, సారథి, ప్రభాకరరావు, శ్రీ అశోక్ కుమార్,
అంతర్జాలంలో నా రచనలను చదివి ప్రోత్సహించే మిత్రులందరకూ....

భవదీయుడు
బొల్లోజు బాబా

తపస్సు

చెట్ల ఆకులు
ధ్యాన ముద్రలో ఉన్నాయి
కొలను అలలు కూడా వాటిని
కలచ సాహసించటం లేదు
నీడ పొదలు నిశ్శబ్దంగా
తొంగిచూస్తున్నాయి.
పరిమళాల సంచారం
నిలచిపోయింది.

నిశ్చల దృశ్యానికి
ఓ రికామీ తెమ్మెర
చక్కిలిగిలి పెట్టిపోయింది

పూలు అంతవరకూ బంధించిన
సుగంధాలు రివ్వున ఎగిసాయి.
కొలను అలలలలుగా త్రుళ్లిపడింది.
నీడపొడల అల్లరి
మళ్లీ మొదలైంది.

ఆకులు గలగలా నవ్వేసాయి
ధ్యానం ఫలించినందుకు.

మే 17, 2010

చరిత్ర

"ఈ సొరంగం చివర
వెలుతురు ఉండి తీరాలి" అన్నాడతను
"ఒకప్పుడు ఉండేదట!
చెదలు తినేసాకా వెలుతురంతా
అయిపోయింది" అన్నారు కొంతమంది వృద్ధులు.

వెలుతురుని వెతుక్కుంటూ సాగిన ఆ యువకుడు
చెదపురుగులకు బలయ్యాడు.
ప్రజలు పడీ పడీ నవ్వుకొన్నారు
అయినవాళ్ళే మూర్ఖత్వమని
గుసగుసలాడుకొన్నారు చాలాకాలం.

కొన్నేళ్ళ తరువాత
వెలుతురు రాజ్యంలో, నగరం మధ్యలో
ఆ యువకుని విగ్రహం
"వెలుతుర్ని స్వప్నించిన సాహసి"
అనే అక్షరాలతో.

సెప్టెంబరు 28, 2015

మార్పు

ఆట్టే గొప్ప అందమనీ చెప్పలేనూ
చామనఛాయ, కోటేరు ముక్కు
పెద్దకళ్ళు, వయసు చెక్కిన దేహమూ అంతే

మా అందరి కోరికపై ఆమె
కాలేజి గార్డెన్ బెంచీపై బాచీమఠం వేసుకొని,
తలపైకెత్తి కనులు మూసుకొని గొంతునరాలు ఉబ్బిస్తో
ఎన్నిపాటలు వొంపిందో ఆ సాయంత్రపు చెవుల్లోకి.
ఆనాటి ఆ సాయంత్రం ఇప్పటికీ
మట్టిని మోసుకెళ్ళే కందిరీగలా నా దేహంలో
అదే పనిగా ఎగురుతూంటుంది గుర్తొచ్చినప్పుడల్లా.

శ్రావణశుక్రవారం పూట
చేతికి తోరం చుట్టుకొని, పట్టుపరికిణీ కట్టుకొని
సాంబ్రాణి వాసన చిమ్మే కురులతో, మెరిసే కాటుక కళ్ళతో
ఆమె నడచివచ్చిన అలనాటి ఆ దృశ్యం నేటికీ
జ్ఞాపకాల పేజీలమధ్య దాచుకొన్న
నెమలీక లాంటి చందమామ శకలం.

“బాయ్స్ అందరూ ఆ అమ్మాయికి క్షమాపణ
చెప్పేదాకా మేం క్లాసులకు వెళ్ళం సార్”
అని ప్రిన్సిపాల్‌కి తెగేసి చెప్పిన ఆమె తెగువ

కుర్రవాళ్లమైన మా అందరిగుండెల్లో స్త్రీల పట్ల
గౌరవ ద్వారాన్ని తెరచిన ఒకానొక సందర్భం.

ఫేర్‌వెల్ రోజున ఆమె పాడిన
"జగమేలే పరమాత్మా ఎవరితో..... పదాల్లో పలికిన
మార్దవం కోసం పాతికేళ్ళుగా వెతుకుతూనే ఉన్నాను.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అని పిలిస్తే
నే చదివిన కాలేజీకి వెళ్ళాను
చాలా కాలం తరువాత.

ఆమె కూడా వచ్చింది

మేం కలుసుకోకుండా ఉంటే ఎంత బాగుణ్ణు
అనిపిస్తోంది ఈమధ్య పదే పదే.

డిశెంబరు 8, 2015

ఫ్రాగ్మెంట్స్

1.
కవిత్వమనేది
ఆత్మలోకంలో ఇద్దరి సంభాషణ
అది
స్వగతమూ కాదు
ఊదరగొట్టే ఉపన్యాసం
అంతకంటే కాదు.

2.
క్రోటన్ మొక్కలు ఇంద్రధనుస్సుని
పగలగొట్టుకొని
పంచుకొన్నట్లున్నాయి
లేకపోతే
మొజాయిక్ గచ్చులా
ఇన్ని రంగులెలా వస్తాయి?

3.
పేడ పురుగులా
రోజూ పుట్టి చచ్చే సూరీడు.

తెల్లగా మెరిసిన కాంతిచర్మం
సంధ్యవేళ సమీపించే కొద్దీ
పొరలు పొరలుగా రాలి
నల్లగా కమిలిపోతుంది.

4.
యవ్వనంలో
నీ పంచేంద్రియాలలో
ఏదీ నిన్ను
పవిత్రంగా ఉంచలేదు.

5.
ఆమె
కనుల నీలిమలోకి
క్షణాలు
అదృశ్యమయ్యాయి.
దుఃఖ దృశ్యం
చిట్లి రాలినా
శీతల మేఘాలు
సంచరిస్తూనే ఉంటాయి.

6.
గాలిపటాన్ని
గద్ద తన్నుకుపోయింది
చేతిలో
తెగిన దారం మిగిలింది
జ్ఞానంలా

నవంబరు 22, 2015

స్నేహం చెట్టు

అపుడెపుడో సాయింత్రపు నడకలో చెరువు గట్టున
ముద్దులొలికే ఓ స్నేహం పిల్లను చూసాను

ఎవరో ఏ పరిచయాన్నో విత్తనం చేసి నాటి ఉంటారు
ఆకుపచ్చ ముక్కుతో మట్టిపొరల్ని పొడుచుకొని
బయటకు వచ్చి విప్పారిన పత్రాలతో లోకాన్ని చూసింది.

ముద్దులొలికే ఆ చిన్నారి స్నేహం పిల్ల
ఆకుల్ని రాల్చుకొనీ రాల్చుకొనీ , వేళ్ళని పాదుకొనీ పాదుకొనీ
స్నేహం చెట్టుగా ఎదిగిపోయింది ..... చూస్తుండగానే

ఎక్కడెక్కడి పక్షులో
ఎగురుకొంటో వచ్చి ఆ స్నేహం చెట్టుపై వాలేవి.
గూళ్ళు కట్టుకొని
తమని తాము పిల్లలు పిల్లలుగా బద్దలుకొట్టుకొని
ముక్కలన్నీ ఏరుకొని మళ్ళా ఎక్కడికో ఎగిరిపోయేవి.

చీకటయితే, బావురుపిల్లో లేక నీటిపాములో
స్నేహం చెట్టు మూలమూలలా వెతుక్కొని
కడుపునింపుకొనేవి.

ఆకుపచ్చ చీర కట్టుకొని
ఆకులవెనుక సూర్యబింబమంత ఎర్రని బొట్టుపెట్టుకొన్న
స్నేహం చెట్టుని చాలా సార్లు చూసాను నేను
ఇంకా రాయబడని అద్భుతగీతాన్ని వింటున్నట్టుండేది.

ఏదో ఒకరోజున
ఈ స్నేహం చెట్టు సైకత శిల్పంలా కూలిపోవచ్చు
అయినప్పటికీ
పచ్చగా, చల్లని నీడతో ఆహ్వానించే
ఈ స్నేహం చెట్టు నా జీవితాదర్శం.

నవంబరు 15, 2015

వెలుతురు తెర

చెట్టునీడలో కూర్చొన్న
విద్యార్థుల గుంపు
వెలుతురు తెరలో దూకి
వైఫై సముద్రంలో తేలింది.

దారాన్ని స్రవించుకొని
కాళ్లతో పేనుకొంటూ తనచుట్టూ తానే
గూడు నిర్మించుకొనే పురుగులా
ప్రతీ విద్యార్థీ తనచుట్టూ
ఓ మౌన పంజరాన్ని దిగేసుకొన్నాడు.

వైఫై లింక్ తెగింది
ఓహ్! షిట్.....

గూడులోంచి సీతాకోక చిలుక
మెత్త మెత్తగా బయటపడినట్లుగా
ఒక్కో విద్యార్థీ మాటల ప్రపంచంలోకి
మెల మెల్లగా మేల్కొన్నాడు.
కాసేపటికి కాంపస్ అంతా
రంగు రంగుల మాటల చిలుకలు
రెక్కలల్లార్చుకొంటూ ఎగురుతో!

డిశెంబరు 19, 2015

వస్తావా?

చీకటి దుప్పట్లో దూరి
దేహ దీపాల్ని
వెలిగించుకొందాం

రాత్రి హార్మోనియంపై
మోహపరిమళాల రాగాల్ని పలికిద్దాం
శీతవేళకు చిక్కకుండా
వేడిశ్వాసల్ని కప్పుకొందాం

ఒక సమాంతర కాలంలోకి
అనంతంగా ప్రవహిద్దాం
వస్తావా!

డిశెంబరు 29, 2011

అసమానతలు

వేకువని
తలోముక్కా చక్కగా
పంచుకొన్నాయి పక్షులు
కిరణాల్ని
ఏ పేచీ లేకుండా పత్రాల సంచుల్తో
పంచుకొన్నాయి తరువులు

ఇంద్రధనుసుని
పొరలు పొరలుగా ఒలుచుకొని
పంచుకొన్నాయి పూలు

పూలనీ
పుప్పొడి గుప్పెళ్ళతో
పంచుకొన్నాయి తుమ్మెదలు

పంచుకోవటం
మనిషెప్పటికి నేర్చుకొంటాడు?

అక్టోబరు 8, 2015

వృద్ధ జంట

తేనెవానల్ని కురిపించిన
వెన్నెల రాత్రులు
అదృశ్యమయ్యాయి.

స్వర్ణ వాసనల్ని ఎగరేసిన
జాజులు నేలకొరిగాయి.
ఇంద్రధనుస్సులపై
స్వారీ చేసిన మహోద్రేకాలు
ఇక శలవన్నాయి.

నే పూయించిన
విజయాలు కరిగిపోయాయి.
నే సాగించిన
యుద్ధాలు ముగిసిపోయాయి.
నే మొలిపించిన
స్వప్నాలు వెలిసిపోయాయి.

నువ్వు మాత్రమే మిగిలావు నాకు.

ఈ దుర్బల దేహానికి
కాస్తంత

నమ్మికనివ్వటానికి
నా అనంత శయనాన
రవంత
కన్నీరు నించటానికి
నువ్వు మాత్రమే మిగిలావు నాకు.

పెళ్లిచూపుల్లో
తలుపు సందులోంచి నన్ను చూసి
సన్నగా నవ్విన ఆనాటి
నువ్వు మాత్రమే మిగిలావు నాకు.

నవంబరు 17, 2009

ఫ్రాగ్మెంట్స్

1.
నేల సంకెళ్లను
నిత్యం తడుముకుంటూనే
వెలుగును తరుముకుంటూ
నీలాకాశంలోకి చొచ్చుకొని
పోతూంటాయి తరువులు.

చెట్టుని మించిన
వ్యక్తిత్వవికాస పుస్తకం ఏది?

2.
జీవితం అతని మోముపై
నర్తించి నర్తించి
అలసిపోయింది.
ఆ ముఖంపై ముడుతలన్నీ
దాని పాదముద్రలే.

3.
ఒక్క ప్రార్థనతో
ఈ గాజుపెంకులు
తొలగిపోతాయంటే
ఆత్మను కొవ్వొత్తిలా

మండించటానికి
నెనెప్పుడూ తయారే!

కానీ బెల్లు నొక్కితే
ఈశ్వరుడు ప్రత్యక్షమౌతాడా?

4.
అందరూ ఏదో ఒకనాడు
సూదిబెజ్జంలోంచి సాగాల్సిందే
వెలుగులోకో, చీకట్లోకో!

ఆ దినాంతాన
ఇచ్చిన వాటిని
పంచావా అంటే
ఏం చెప్పాలీ?

5.
తేనెటీగ కుట్టిన బాధలో
నాకు గుర్తుకే రాలేదు
కాసేపట్లో
అది చచ్చిపోతుందని.

6.
నీ నిష్క్రమణ
తరువాత రోజులన్నీ
ఒకేలా ఉన్నాయి.
మరోసారి
ఏడవటం తప్ప
మరేం చేయగలను చిన్నమ్మా!

జనవరి 24, 2010

పక్షి ప్రేమికులు

ప్రతీరోజూ అతను
తట్టనిండా కొంత దయను
మోసుకొని వచ్చి ప్లాట్ ఫార్మ్ పై పేర్చి
ఒక మూలగా కూర్చొని
దారిన పోయే వాళ్ళ కళ్ళలోకి
చూస్తుంటాడు.

దయంటే ఏమీ కాదూ
వాని జీవితంలోని కొంత భాగమూ,
కొన్ని చెమట చుక్కలు,
కాస్త పల్లెటూరి మట్టీ అంతే!
వాటిని తీసుకొని
సారెపై బుడగలా ఉబ్బించి, నిప్పుల్లో కాల్చి
తట్టలోకి ఎత్తుకొని పట్నం వచ్చి
ప్లాట్ ఫారం పై అమ్మకానికి పెడతాడు.

కరంటు తీగలమీద పక్షులు
ఆ పల్లెటూరి మట్టిని
విప్పారిన నేత్రాలతో చూస్తూంటాయి.

మట్టితో చేసిన ఆ పక్షిగూళ్ళను
ఎవరెవరో దయాళువులు
ఒక్కొక్కటిగా కొనుక్కుంటారు
ఇంటి బయట వేలాడదీయటానికి.

సాయింత్రానికి ఖాళీతట్టను
భుజానికి తగిలించుకొని
బయలుదేరేటపుడు
పక్షులు అతని తలపై తిరుగుతూ
అరుస్తూ, ఆనందంగా సాగనంపుతాయి.

అక్టోబరు *26, 2015*

పిడిబాకు

ప్రశాంతతను
గాయపరచే పిడిబాకు
మళ్లా ప్రత్యక్షమైంది

దెబ్బకు స్వప్నం కాస్తా వాస్తవంగా
వాస్తవం కాస్తా మహా ఎడారిగా
మహా ఎడారి కాస్తా మృగతృష్ణగా
రంగులు మార్చేసాయి

ఆ నిర్జలోష్ణ కాసారపుటొడ్డున
రాళ్లు విసురుతో నా ఆత్మ

పిడి బాకు అంచున తృష్ణా బిందువు
పిడి బాకు అంచున మృగకాంక్షా శ్వాస
అచ్చోటనే రుధిర జాతర.
నరక సౌఖ్యం, స్వర్గ బాధ పెనవేసుకొన్న
సృష్టి సౌందర్య విస్ఫోటనం కూడా అక్కడే

తలుపు భళ్లున తెరచా
ఈ సమయంలో వచ్చావేమిటీ!
అందామె ఆశ్చర్యపడుతో

నెత్తురు నింపుకొన్న నా క్షణాల్ని
చూపించా!

గాయపడ్డ నా గీతాన్ని
తన దేహంలోకి తీసుకొని
స్వస్థ పరచిందామె ....ప్రేమతో....

ఏప్రెల్ 29, 2010

ప్రార్థన

ఇప్పుడిక ఓ ఎడారిని ప్రసాదించు
వర్షించే ఇసుకా, ప్రవహించే ఎండా
దిగంతాలవరకూ
పరచుకొన్న ఏకాంతం
నిర్జల సరోవరాలతో కూడిన
ఓ ఎడారి కావాలిపుడు.

దానికేమాత్రం తగ్గినా
ఈ ఘడియ రక్తికట్టదు.

లేదా
ఓ సముద్రాన్నిప్పించు
దేహాన్ని తేల్చుతూ ఉండేంత ఉప్పని నీరు
చుట్టూ విశాలంగా విస్తరించిన ఏకాంతం
కింద వెచ్చని బడబాగ్ని
పైన చల్లని సుడిగాలులతో కూడిన
ఓ ఉప్పని సముద్రమైనా చాలు
సరిగా సరిపోతుంది.

లేక పోతే
ఓ రాత్రిని అనుగ్రహించు

అన్ని వైపుల్నుంచీ వీచే నల్లని గాలి
మువ్వలచేతికర్రతో సాగే నేత్రద్వయం
స్పటికం లా వణికే చిక్కని నీలిమా
పొదలమాటున మెరిసే కనుల ఏకాంతంతో కూడిన
ఓ రాత్రయినా చాలు సందర్భోచితంగా ఉంటుంది.

లేదా ....

జులై 14, 2010

ఎందుకో తెలియటం లేదు.........

ఎందుకో తెలియటం లేదు కానీ
ఆ వీధిలోంచి వెళ్ళాలనిపించటం లేదు.

ఆ గుడిసె ముందు ఆ ఆటోని చూసినప్పుడల్లా
యాక్సిడంటులో నుజ్జు నుజ్జయిన
ఆ ఆటోని చూసినప్పుడల్లా
పగిలిన దాని హెడ్ లైట్ నిస్తేజాన్ని చూసినప్పుడల్లా....

"అటెండెన్స్ సరిపోలేదని
స్కాలర్‌షిప్ నిలుపు చేసేసారు సార్
డబ్బు చాలా అవసరం హెల్ప్‌చేసి పెట్టండి సార్" అని
అభ్యర్థించిన ఆ కుర్రవాని కనులే
జ్ఞాపకం వస్తున్నాయి.

కాగితాలు, కంప్యూటర్లూ జీవితాల్లోకి
చూడలేవన్న విషయాన్ని ఎలా చెప్పగలిగానూ?

ఆ వీధిలో, ఆ గుడిసె ముందు నిలిచిపోయిన
ఆ ఆటోని చూసినప్పుడల్లా....
రంగువెలసీ, తుప్పు పట్టీ, గడ్డి మొలచీ శిధిలమౌతున్న
ఆ ఆటోని చూసినప్పుడల్లా.....

చాన్నాళ్ళ తరువాత ఆటో నడుపుతూ కనిపించిన వాడు

"దేవుని కృప వల్ల అంతో ఇంతో సంపాదిస్తున్నాను కదా,
నువ్వింక రిక్షా తొక్కడం మానేయమంటే వినటం లేదు సార్ మా నాన్న"
అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి.

క్లాస్ రూమ్స్ లో ఎప్పటికీ నేర్వలేని పాఠాలవి.
ఆ రోజు వాడెంత ముద్దొచ్చాడనీ!

యాక్సిడెంటులో నుజ్జు నుజ్జయిన వాడి ఆటో పక్కనే
కొత్తగా గ్రీజు పెట్టిన డొక్కు రిక్షాను చూసినప్పటి నుంచీ ....

ఎందుకో తెలియటం లేదు కానీ ....

జనవరి 24, 2011

నగరంలో చిరుత

జనావాసంలోకి చిరుత ప్రవేశించింది.
పాపం అది దారి తప్పి కాదు ఇటువస్తొ.
తను పుట్టిన ప్రదేశాన్ని చూసుకొందామని వచ్చింది.
ఎటెళ్లాలో తెలియక ఓ ఇంటి బాత్ రూం లో దూరింది.

లక్షల విలువచేసే దాని మచ్చల చర్మం మెరుస్తోంది.
ఆ నిగారింపు తెలియకూడదని కామోసు
అది చీకటి మూలల్లోకి నక్కుతోంది.

తన ఒక్కో గోరు మూడేసి వేలని విన్నట్లుంది
గోళ్లనన్నీ లోనకు లాగేసుకొంది.

తన ఎముకలపొడి తులం వెయ్యి రూపాయిలని వినగానే
దానికి వెన్నులోంచి చలి మొదలైంది.
"రక్షించండి, రక్షించండీ" అని అరచింది దీనంగా.
జనాలు భయంతో పరుగులు తీసారు.

ఓ అత్యుత్సాహి దానికి "కొంచెం" దగ్గరగా నుంచొని
సెపియా టోన్ లో ఫొటోలు తీయించుకొంటున్నాడు.

మీడియావాడొకడు “ ఎక్స్ క్లూసివ్ కవరేజ్” కోసమని
దానిని కర్రతో పొడిచి కెమేరా ఆన్ చేసాడు.
ఆ హడావిడిలో బాత్ రూం తలుపు గడియ ఊడింది.
ఒక ఉరుకులో అది బయటపడి
ఇక వెనక్కు తిరిగి చూడకుండా పరిగెట్టింది.
మానవ మృగాలకు దూరంగా ... చెట్లు నరికిన అడవి వైపు.

ఫిబ్రవరి 26, 2011

కవిత్వం

ఆమె వచ్చి కూర్చొంది
ఇద్దరి మధ్యా నిశ్శబ్దం
రివ్వున వీస్తోంది

ఎక్కడి నుంచైతే నా భవిష్యత్తుని
ప్రారంభించానో ఆ పెదవులు
సన్నగా కంపిస్తున్నాయి

కానీ
ఆ నాటి కరుణ స్పందన కాదిది

ఇరువురి మౌనం
ఆ క్షణాల్ని కోసుకొంటూ సాగుతోంది
నదిని చీల్చుకొంటూ సాగే నావలా

హృదయ వేదికపై
మృత జ్ఞాపకాల
కరాళ నృత్యం

శకలాల్ని ఒక్కొక్కటీ
ఏరుకొంటున్నాను

జారిపోతున్న చీకటినంతా
కూడదీసుకొని
"ఇక వెళ్తాను" అని లేచింది
"వెళ్ళొస్తాను" అను
"వస్తే....... వెళుతున్నానుగా!" అంది
నా నిస్సహాయ చూపుల్ని
విడిపించుకొని
ఆమె వెళిపోయింది
....

పునర్జన్మించాల్సినంత
జీవన కాంక్ష
ఎంతకీ కలగట్లేదు
ఇక శలవ్!

సెప్టెంబరు *12, 2011*

ఎంతదృష్టం......

ఎంతదృష్టం!
కనులున్నాయి
కనులు కనే
కలలున్నాయి
కలలు ఆవిష్కరించే
హాయైన లోకాలున్నాయి
ఎంతదృష్టం!

గాయాల్ని
ఇముడ్చుకొనే
హృదయముంది
హృదయ గాయాల్ని
నయం చేసే
కాలం ఉంది
కాలాన్ని వేటాడే
జీవితం మిగిలే ఉంది
ఎంతదృష్టం!

అన్ని వైఫల్యాలనూ
అక్కున చేర్చుకొనే
ప్రకృతుంది

ప్రకృతి పొరల్లో
ప్రాణాన్ని గింజను చేసి
పాతిపెట్టే మృత్యువుంది
మృత్యు స్పర్శను
నిత్యం స్వప్నించే
కనులున్నాయి……
ఎంతదృష్టం!

లేకపోతేనా
ఇన్ని వైరుధ్యాలున్న లోకాన్ని
దాటటం ఎంత కష్టం!

సెప్టెంబరు 23, 2011

అదే గులాబీ.....

చేతిలో రంగుల ఉత్తరం
గులాబీ పువ్వుతో
ఆ అబ్బాయి బస్సుకై
ఎదురుచూస్తున్నాడు

తను గుర్తుకొచ్చింది
ఒకనాటి
పూర్తికాని చుంబన పరిమళం
ఎదంతా పరచుకొంది

ఆ అబ్బాయి కళ్ళు
ఆగిన ప్రతి బస్సునీ
వెతుకుతున్నాయ్.

అతను అచ్చునాకులానే
ఉన్నాడనిపించింది
అవే కళ్ళు ...
అవే చూపులు ...
అదే గులాబీ ...

ఏమో నేనే
ఆ అబ్బాయినేమో!

ఆ అబ్బాయే
నేనేమో!

మరోసారి తడుముకొన్నాను
జెబులోని
గులాబీ రేకల గరగరల్ని

సెప్టెంబరు 30, 2011

దేహమూ - నీడా

సూర్యుని
వేడి రక్తపు చుక్కలు
నెర్రలు తీసిన భూమి చర్మం

చలి చీకటి తాగి
మెరుస్తూన్న
ఆకాశపుటిరుకు సందులు

గోడ గడియారం
మసిలో కూరుకుపోయింది

ఎంతవెతికినా
పురుగు చిక్కదు
వేకువ పక్షికి

పంజరం
పరిశుభ్రంగానే ఉంది కానీ
గుండెనిండా
లుకలుక లాడే మురికికూపం.

దేహం కన్నా
నీడే తెలివిగా ఉంది
ఈ బూడిద లోకాన్ని
నిత్యం సందేహిస్తుంది

రుధిర క్షణాలు
చలి శ్వాసకు గడ్డ కట్టాయి
అంతా నిశ్శబ్దం
లోకం నిద్దరోతుంది
దేహాన్ని నీడ ఎత్తుకుపోయి
మృతుల దేశంలో దించేసింది

ఆ తరువాత.........

అక్టోబరు 9, 2011

మధ్యాహ్నపు నిదురలో ఓ స్వప్నం

ఎడారిలో నడుస్తున్నాను
కనుచూపు మేర చుట్టూ ఇసక
దాహంతో గొంతు మండిపోతూంది
ధూళిపడి కనులు మెరుగుతున్నాయి
గాలి వేడికి శ్వాస ఉక్కిరిబిక్కిరౌతూంది

దూరంగా
ఆకుపచ్చని దుస్తులు ధరించిన ఆమె
నా వేపు చేతులు చాచి
తన కౌగిలిలోకి ఆహ్వానిస్తోంది

ఆమెనుంచి వస్తూన్న అత్తరు వాసన దారిలో
దాహాన్ని ఓర్చుకొంటూ
వేడిని చీల్చుకొంటూ
బాధను అణుచుకొంటూ
కాల్చే ఇసుకలో నడుస్తున్నాను
పరిగెడుతున్నాను... తూలిపోతున్నాను

ఎంత పరిగెట్టినా
ఇద్దరిమధ్యదూరం తరగటం లేదు

అంతు లేని పరుగు ....
వేడి పరుగు ....
కాల్చే పరుగు ....
నెత్తుటి పరుగు.
****

చల్లని చేతి స్పర్శకు
హఠాత్తుగా మెలకువ వచ్చింది
ఎదురుగా ఆమె మోము
ఒక ఒయాసిస్‌లా

ఇంతసేపు ఆమె ఒడిలో
నిద్రిస్తూ కలకంటున్నానా!

ఎంతసేపటినుంచి
నా బరువుని మోస్తూందామె?

నవంబరు 15, 2011

దొరికిన దొంగ .....

కొబ్బరి కాయల దొంగ దొరికాడట
చెట్టుకు కట్టేసి కొడుతున్నారంటే
చూట్టానికి వెళ్ళాను.
అతను తల దించుకొని ఉన్నాడు
చీప్ లిక్కర్ వాసన గుప్పుమంటోంది.
వ్యసనం అతని ఆత్మను తినేసింది
ఆత్మలేని ఆ వికారదేహం
రక్త గడ్డలా ఉంది.
వాడి కుటుంబాన్ని తల్చుకొంటే జాలనిపిచింది.

వీధికొక్కటి చొప్పున
వెలిసిన గిలిటన్ల వేట్లకు
ఊర్లకు ఊర్లు కబేళాలుగా
మారుతున్న దృశ్యశకలమిది.

ఉన్నది కనుక తాగుతున్నారు
తాగుతున్నారు కనుక ఉంచుతున్నాం
నరంలేనిదే నాలుక కదా!

లిక్కర్ వైద్యం ఇన్సూరెన్స్ ఎక్స్‌గ్రేషియా అంటూ
ప్రాణం చుట్టూ అన్ని
వ్యాపారాలు ముడివేసుకొన్నపుడు
జీవితం ఎంత చవకో
అతణ్ణి చూస్తే అర్ధమౌతుంది.

"ఇది వరకు తిండి కోసం దొంగతనాలు చేసేవారు
ఇప్పుడు మందుకోసం చేస్తున్నారు" ఎవరో పెద్దాయన
గొణుక్కొంటున్నాడు.

అభివృద్ధంటే అదేనేమో!

డిశెంబరు 23, 2011

జీవితం

ఎవరూ నడవని
దారి కదాని
ఉత్సాహంగా
ముందుకుపోతూంటే
జీవితం నవ్వుతో
“ఓయ్ పిచ్చిమొద్దూ
నేనిక్కడుంటే అటెక్కడికి
పోతున్నావ్? అంది
వెనుకనుంచి.

జనవరి 8, 2012

ఒంటరితనం

ఒక మధ్యాహ్నం
ఒంటరిగా సాగిపోతూంది
నేనూ ఒంటరిగానే గదిలో
స్వారీ చేసే మౌనంతో

ఒకే ఫాను
ఒకే కుర్చీ
ఒకే టేబులు
ఒకే నేను
నిశ్శబ్దంగా
మధ్యాహ్నంలోకి
ఒలికిపోయాం
ఇక అది మమ్మల్ని మోసుకొంటూ...

జనవరి 16, 2012

నువ్వు కాదు నేనే

స్వప్నానికి నాకూ మధ్య
మంచులా పరచుకొంటున్నది
నా శ్వాసా లేక నీదా?

ఎన్నెన్ని అస్ఫష్ట దృశ్యాలు!

నేలకొరిగిన తూనీగపై పూల వాన
అద్భుత సమాధి
చుంబించుకొన్న పెదాలు అదృశ్యమైనా
ఇప్పటికీ పరిమళించే ప్రేమలా

కొలను అలలపై
ఏటవాలు కాంతిపుంజం
సన్నగా ఒణుకుతోంది
నీ జ్ఞాపకాలపై నా హృదయంలా

నీవు పంపించే వసంతాలకు
ఎడారి దూరంలో నేను
నీకై నా ఆత్మ కోయిల పాడేపాట
నాకే చేదు చేదుగా అనిపిస్తోంది

తనమార్గాన్ని తానే అల్లుకొంటూ
సాగిపోతోంది కాలం సాలీడల్లే

ఒంటరితనం శూన్యమేమీ కాదు కానీ
తీవ్రమైన అలసట మాత్రం
చీకటిలా మెరుగుతూంటుంది

జ్ఞాపకాలు నాని ఉబ్బి
వికృతంగా తయారయ్యాయి
గాలినిండా మృత్యువాసన

నా కవితల్లో నువ్వంటే నువ్వు కాదు నేనే

ఫిబ్రవరి 1, 2012

ఫ్రాగ్మెంట్స్

1.
వానచినుకూ
సాగర హృదయం
ఒకరిలోకి మరొకరు
కరిగిపోతూ మరలా
మిత్రులైపోయారు

2.
ఒకే ఒక్క రాగంతో
చిమ్మెట
తెల్లారేదాకా
సూర్యుడ్ని
పైకి లేవనియ్యలేదు

3.
అమావాస్య రాత్రి
చందమామ
శకలాలు శకలాలుగా
విడిపోయి
తిరుగుతోంది భువిపై
మిణుగురుల రూపంలో

4.
చికన్ కూర
అమ్మ వడ్డించింది

మెత్తని ముక్కలన్నీ
మాయమయ్యాయి

5.
ఆ కాన్సర్ పిలగాని
నవ్వు
కన్నీళ్ళ కన్నా
ఎక్కువ
బాధిస్తోంది

6.
స్వచ్ఛమైన
సెలయేరు
పొర్లుతూ దొర్లుతూ
నదిని చేరేసరికి
నిలువెల్లా
మురికి మురికి

7.
అందరూ
ఉత్తపేర్లేనట
అనాచ్ఛాదిత ఆత్మలు
బయటపడేలా
ఈ పేర్లను
బండకేసి తోమాలి

మూడు సంసారాలు...

కొట్టునుంచొచ్చిన భర్తకు
వడకట్టిన చెరువునీళ్ళను
దోసకాయ చెంబుతో ఇచ్చి
మామ్మ మేనత్తల జడలు
ముడివేసిన ఘనకార్యానికి
గంతులువేస్తున్న పిల్లలను వారించి
కుంపట్లోని చల్లారిన వంకాయతో
పచ్చిపులుసు చేయటానికి
వంటింట్లోకి వెళ్ళింది – నాయినమ్మ

పేపర్లు దిద్దుతున్న భర్తకు
స్టీలు ప్లేటుతో జంతికలు ఇచ్చి
ఎక్కడెక్కడో ఆట్లాడుకొని వచ్చిన పిల్లల్ని
కాళ్ళుకడుక్కొని పుస్తకాలు తియ్యమని చెప్పి,
స్టవ్ వెలిగించి టీ పెడుతూ
"రాత్రికి కూరేంచేయమంటారూ" అంది – అమ్మ

ఆఫీసు బడలికను విదిలించుకొని
పిల్లల రీడింగ్‌రూమ్ డోర్ దగ్గరకు వేసి
ఫ్రీజర్‌లోని కర్రీని ఓవెన్‌లో ఉంచి
డ్యూటీకి వెళ్ళేముందు నేపెట్టిఉంచిన

గ్రీన్ టీ ని ఫ్లాస్క్ నుంచి కప్‌లో ఒంపుకొని
సోఫాలో కూర్చొని తాగుతూ
రిమోట్‌తో టీవి ఆన్ చేసింది - నా భార్య

ఫిబ్రవరి 27, 2012

ఒక హిస్టరెక్టొమీ..

కారణాలేమైనా కానీ
నెలకో రక్తపుష్పాన్ని
రాల్చే
వృక్షాన్ని సమూలంగా
పెకలించారు.

నాగరీకుని
వైద్య ప్రయోగశాలలో
స్త్రీ దేహమెపుడూ ఓ గినియాపిగ్గే!

కారణాలేమైనా కానీ
రెండుకోతల్ని భరించి
ఒక తరాన్ని సృష్టించిన
మానవజాతి మొదటి ఊయల
మూడో కోతతో
మొదలు తెగి నేల కూలింది.

పర్యవసానాలు పూర్తిగా తెలీని వైద్యంలో
గర్భసంచో టెస్ట్ ట్యూబ్.
పిల్స్ సిజేరియన్లు ఐయుడీలు,
ఐపిల్స్ ఇదిగో ఇపుడు సర్రోగసీలు.

కారణాలేమైనా కానీ
కనిపించని కత్తెరేదో
ఏ కనపడని భాగాన్ని తొలగించిందో
ఆత్మ
పెళుసుబారి, నెర్రలుతీసి
మరుగుకోసం దేహం
అంతా తిరుగుతూ రోదిస్తోంది.

ఓదార్చటానికి
హెచ్.ఆర్.టీలు, యాంటిడిప్రెస్సెంట్స్
వెంటనే వాలిపోయాయి.

జరాయురహిత దేహమిపుడో
సజీవ టంకశాల కదా!

(విచ్చలవిడిగా జరుగుతున్న హిస్టరెక్టొమీ ఆపరేషన్లకు వ్యతిరేకంగా...)
(Hysterectomy : గర్భసంచి తొలగింపు – HRT: Hormone Replacement Therapy)

మార్చి *30, 2012*

మూల్యాంకనం

జవాబు పత్రాన్ని పట్టుకోగానే
ఓ ఏడాది కాలాన్ని
చేతిలోకి తీసుకొన్నట్లుంటుంది.
ఏదో అపరిచిత జీవితాన్ని
తడుముతున్నట్లనిపిస్తుంది.

పాస్ మార్కులు వేయమంటూ
కన్నీటి ప్రార్థనో, వెయ్యినోటో, ఫోన్ నంబరో
లేక శాపాల బెదిరింపో వంటి చేష్టలు
బిత్తరపరచినా
ఇన్నేళ్ళ చదువులో ఎక్కడా తగలని
ఒక వాక్యమో, కొత్త కోణమో, వివరణో
తళుక్కుమన్నపుడు
కవిత్వం చదివినంత
ఆనందమౌతుంది.

జవాబు పత్రాల్ని మెదడు తూకం వేస్తే
హృదయం మూల్యాంకనం చేస్తుంది.

ఈ స్టూడెంట్ కి
మమ్మీ డాడీ దీబెట్టి బెస్టాఫ్ లక్ చెప్పారో లేదో
హైలైటర్స్, స్కెచ్‌పెన్ లు కొనివ్వలేదు కాబోలు
స్కేలు కూడా లేదేమో...
పేపరు మడతే మార్జినయ్యింది.

ఈ అక్షరాలు వ్రాసిన చేయి
పొలంపనులు చేసిందో, రాళ్ళు మోసిందో
పెట్రోలు కొట్టిందో లేక అంట్లే తోమిందో
అక్షరాల నిండా మట్టి వాసన ... మట్టి వాసన...
హృదయానికి మట్టివాసన ఎంతిష్టమో!
జవాబులు సరిగ్గా రాయకపోవటానికి కారణం
ఒక్క చదవకపోవటమేనా... లేక
ఆ సమయంలో జబ్బుచేసిందా?
ముందురోజు తండ్రికి తలకొరివి పెట్టాడా?
పెళ్ళిబట్టలలో నేరుగా పరీక్షహాలుకు వచ్చిందా?
సమస్యలనుంచి రేపు పారిపోవాలనుకొంటున్నాడా?
ఖాళీ జవాబు పత్రం ప్రశ్నల పత్రమౌతుంది

పేపర్లు దిద్దటం అంటే ఒక్కోసారి
పత్రికల్లో పతాక శీర్షికలవటం కూడా
ఆత్మహత్యగానో, అత్యుత్తమ రాంక్ అనో.

జులై 20, 2012

సమతుల్యత

కప్ప దమనీ వ్యవస్థ డిసెక్షన్
విద్యార్థులకు డిమానుస్ట్రేషన్ క్లాసది.

క్లోరోఫాం ఇచ్చిన కప్పను
డిసెక్షన్ చెక్కపై ఉంచి
కదలకుండా కాళ్ళకు మేకులు కొట్టాను.

నా చుట్టూ విద్యార్థులు నిల్చుని
శ్రద్ధగా గమనిస్తున్నారు.
సిజర్‌తో చర్మాన్ని కొద్దికొద్దిగా తొలగిస్తూ
స్టెర్నమ్ ఎముకను కత్తిరించి
ఉరఃకుహరాన్ని బయల్పరిచాను.

"మీ చేతులు వణుకుతున్నాయి సార్"
అన్నాడో విద్యార్థి.

అప్పుడు గమనించాను
నా చేతులు విపరీతంగా వణుకుతున్నాయి.
మిగిలిన డిసెక్షన్ వెంటవెంటనే ముగించి
వచ్చేవారం మీరు చేద్దురుగాని అని చెప్పి
డిపార్ట్‌మెంటుకు వచ్చేసాను.

భయమేసింది జబ్బేదైనానా అని.
కాగితం తీసుకొని నా పేరు వ్రాసుకొన్నాను
ముత్యాల్లాంటి అక్షరాలు
కొంచెం ధైర్యం వచ్చింది.

****

విద్యార్థుల ఒక్కొక్కరి ట్రేలో ఒక్కో కప్ప
వాళ్ళు జాగ్రత్తగా డిసెక్షన్ మొదలుపెట్టారు.
కాసేపయ్యాకా చూద్దును కదా
ప్రతి ఒక్కరి చేతులూ వణుకుతున్నాయి

అలా వణుకుతున్న చేతులతోనే
అందరూ డిసెక్షన్ చేస్తున్నారు – ఆశ్చర్యంగా!

****

నిన్నరాత్రి
చెరువుగట్టుపై మిడతలు వాలినపుడు
గరికపూలు అలానే వణికుంటాయి

ఏప్రెల్ 24, 2013

ఊడుపు

పట్టె తోలిన వరిచేను
ఏది మబ్బు? ఏది కొంగ?

ఒంగున్న స్త్రీలు
వరిమొలకల్ని
అనంత నీలిమలో
గుచ్చుతున్నారు
ఏది మన్ను? ఏది మిన్ను?

జులై 18, 2013

స్వప్నమునందు నిదురించువారు ధన్యులు...

నాకూ నా అంతరాత్మకు
ఈ మధ్య అస్సలు పడటం లేదు
నే చేసే పనులపట్ల
వాడు చాలా కోపంగా ఉంటున్నాడు
అరిచి గోల చేస్తున్నాడు
నేనో హరిత పంజరంలో చిక్కుకొన్న
పక్షినని ఎంత చెప్పినా వినడు
“నాతో చెప్పద్దు, నీ ఇష్టం
వచ్చినట్లు చేసుకో” అంటో
చీదరించుకొంటాడు

ఆమె బేల చూపుల్ని విదిలించుకొని
వచ్చేసిన రోజయితే
వాడు తన బలమైన చేతులతో
నన్ను కుదిపేస్తూ
ఉక్కిరిబిక్కిరి చేసేసాడు

గడియారం టిక్కు టిక్కు మంటో
దగ్గుతున్నట్లుగా...

తెల్లని కంటిపాపపై
వెంట్రుకలు మొలిచినట్లుగా...
ప్రాణపాము తన బట్టల్ని విడిచి
ఎటో వెళిపోయినట్లుగా .... జీవితం

ఇలాగయితే సుఖం లేదని
ఓ రోజు గోదారి ఒడ్డుకు వెళ్ళి
వాడితో మాట్లాడటం మొదలుపెట్టాను
కాసేపటికి నా కళ్ళమ్మట నీళ్ళు
ఇద్దరం భోరు భోరున ఏడ్చుకొన్నాం

చాలాసేపు మౌనం తరువాత
"నువ్వు మాత్రం ఏం చేస్తావులే"
అని వాడు గొణుక్కోవటం వినిపించింది

జులై 29, 2013

ఒక జ్ఞాపకం ....

మొదటి సారి
కలిసిచూసిన సినిమా టిక్కెట్టు
నాది నావద్ద భద్రంగా ఉంది
తన వద్ద కూడా
ఉండి ఉంటుందా!

రాత్రి పొడవునా
చూపులు వర్షిస్తూనే ఉన్నాయి
స్వప్నం అంచుల చుట్టూ
ఆలోచనల చీమలు చేరి
కతుకుతున్నాయి.

చీకటి వేళ్ళు
హృదయంలో లోతుగా
పాతుకొంటున్నాయి.

స్వరపేటికపై వసంతాల్ని
నాట్యం చేయించిన పిట్ట
వర్షాన్నలా వింటూ ఉండిపోయి
నిలువెల్లా తడిచిపోయింది.

బిరబిరా పారుతున్న గాలికి
గజ గజ వణుకుతోంది.

ఛ..ఛ... మరచిపోవటం ఎలానో
జ్ఞాపకం ఉంచుకోకూడదు ఇకపై....

ఆగష్టు 7, 2013

కొన్ని పదాల గురించి......

ఏమీ గుర్తు లేవిపుడు
జేబుడు సూర్యకిరణాలు
గుప్పెడు చందమామ
ముక్కలు తప్ప.

దుఃఖాశ్రువులు నిండిన
సాయింత్రాన్ని
రాత్రి రెప్పల క్రింద
నిదురపుచ్చి అన్నీ
మరచిపోదామనుకొంటాను
కానీ
కొన్ని పదాలు నా నుండి రాలిపడి
ఓ ఎడారిని సృష్టిస్తాయి
ఆ ఎడారిలోంచి ఓ అరణ్యము
ఆ అరణ్యం లోంచి కుంభవృష్టీ
ఒక్కొక్కటిగా విచ్చుకొని
నన్ను కబళిస్తాయి.
నానుంచి పుట్టినదైనా
నన్నో పూచికపుల్లను చేసి
కొట్టుకొని పోతుంది

ఏమీ గుర్తులేవిపుడు
జేబుడు పదాలు
గుప్పెడు కలల
ముక్కలు తప్ప

ఆగష్టు 14, 2013

చర్మం రంగు

'ముఖ్య అతిధికి బొకే నేను ఇస్తాను టీచర్"
"నువ్వొద్దు ..... అందుకు వేరే వాళ్ళను ఎంపిక చేసాం"
ఆ 'వేరేవాళ్ళకు' తనకూ ఉన్న తేడా
ఆ అమ్మాయికి కాసేపటికి తెలిసింది
చర్మం రంగు.

చరిత్ర లోయలోకి
నెత్తురూ కన్నీళ్ళూ పారిస్తూ,
జీవన మార్గాలపై
చీకటివెలుగుల్ని శాసిస్తోన్న
చర్మం రంగు ..... చర్మం రంగు ....

సంచి కన్నా ఆత్మ గొప్పదని
వెర్రికేకలతో అరవాలనుకొంది ఆ అమ్మాయి.

ఉబ్బిన మొహం, ఎర్రని కళ్లతో
తనకొచ్చిన ప్రైజుల్ని తీసుకొని
మౌనంగా నిష్క్రమించింది.

పదేళ్ళ తరువాత .....
"ముఖ్య అతిధి" స్పీచ్ ముగించుకొని

వెళుతూ వెళుతూ
ఉబ్బిన మొహం, ఎఱ్ఱని కళ్ళతో ఉన్న
ఓ స్టూడెంట్ చేతిలో బొకే పెట్టి,
భుజం ఎందుకు తట్టిందో
ఎవరికీ అర్థం కాదు
మరో పదేళ్ళ దాకా

ఏప్రెల్ 16, 2014

విడిపోయింతరువాత........

బెల్లంపల్లి బొగ్గు పుప్పొడి
హన్మకొండ నూతి గుండె లోతూ
చొప్పదండి వాసుల బుష్ కోటు
ఆల్ఫాలో దమ్ బిర్యాని
హెడ్డాఫీసులో లెమన్ టీ .....
కొన్ని జ్ఞాపకాల్ని వదిలించుకోలేం
బుట్టలోని పాములా
బద్ధకంగా మెదలుతూంటాయ్.

టాంక్ బండ్‌పై అతిశయంతో
అటూ ఇటూ తిరిగిన ఆంధ్రతేజాలు
గద్దరన్న పాట, కెసియార్ అన్నమాట
కాళోజీ, ఆశారాజు, అఫ్సర్,
స్కైబాబ, గోరటి వెంకన్నల జ్ఞాపకాల్ని
ఎలా చెరుపుకోవాలి?

అయినా
ఎందుకు చెరుపుకోవాలి?
నీ తప్పేముంది
నీకేంకావాలో ముందునించీ
స్పష్టంగానే చెపుతున్నావ్!

మాకే అర్థం కాలేదు
ఇంత జరిగేదాకా.

నీకూ ఏవో
జ్ఞాపకాలు ఉండే ఉంటాయిలే
చెప్పుకోవటం లేదు కానీ!
కొన్ని జ్ఞాపకాల్ని
చెరుపుకోవాలనుకొన్న కొద్దీ
నత్తగుల్ల మెలికల్లా
వెలుగులోకే తెరుచుకొంటాయి

పూల చుంబనాలలో
చెట్లు అమరత్వం పొందినట్లు
ఈ స్వప్నాలలోనే
జీవిస్తాను నేను.

ఏప్రెల్ 21, 2014

అతిశయం

అన్ని నిర్ణయాలు
ముందే అయిపోయాయి
ఏదో కాలక్షేపానికి
జీవించాలి అంతే!

పుట్టినపుడు
మతాన్ని బట్టి
గ్రహాలు పైకీ క్రిందకూ మారతాయి
కులాన్ని బట్టి
తారలు అటూ ఇటూ సర్దుకొంటాయి
కుటుంబాన్ని బట్టి
రాశిచక్రం రూపుదిద్దుకొంటుంది

కలహాలు, ప్రేమలు
పోటీలు, పథకాలు
అన్నీ మనది కాని
ఏదో ప్రణాళికలో భాగాలే!
ఆఖర్న మరణం కూడా.

అయినప్పటికీ
ఓ మొగ్గ విరిసినా

ఓ తుమ్మెద వాలినా
ఓ డొలక రాలినా
ఈ చెట్టుకెంత తహ తహ!
వెలుగుని బంధించామనుకొనే
ఈ పత్రాలదెంత అతిశయం!

అక్టోబరు 30, 2014

నీటిపొర

తాగుడు పై సదభిప్రాయం లేకపోయినా
దురభిప్రాయం మాత్రం ఉండేది కాదు
అదో పురాతన విలాసం కదాని

కానీ
మొన్నోరోజు మా కాలేజీలో
ఓ విద్యార్థిని తండ్రి తన కూతుర్ని
నలుగురెదుటా బూతులు తిడుతూ
అవమానించినపుడు
ఆమె కనుల నీటిపొరలో
తాగుబోతు తండ్రులందరూ
దగ్ధమైపోవాలనుకొన్నాను

"కొయిటా అమ్మ నా పేర్న పంపించే
డబ్బుల కోసమే ఇదంతా" అని ఆ అమ్మాయి అన్నప్పుడు
ఆ నీటిపొరలో ఈ మద్యప్రపంచం
కొట్టుకు పోవాలనుకొన్నాను

గత ఘర్షణల గాయాల్ని చూపించినపుడు
ఆ నీటిపొరలో ఈ మదపు నేల నిలువునా
కృంగి పోవాలనుకొన్నాను

సముద్రాన్నీదడానికి
పూచికపుల్లంత నమ్మకాన్ని తప్ప
ఏమివ్వగలిగాం? ఆరోజా అమ్మాయికి

****

మూడ్రోజుల తరువాత
ముత్యాల్లాంటి అక్షరాలతో ఎసైన్మెంట్
రాసుకొచ్చిన ఆ అమ్మాయి
కనుల నీటిపొరలో ఎన్నెన్ని సౌందర్యాలు !

నవంబరు 14, 2014

ప్రకృతి

వానపాములు తూనీగలు
తొండలు కప్పలు పిట్టలు
గుంటనక్కలు రాబందులు
ఒకదానికొకటి గోరుముద్దలు
తినిపించుకొనేవి.
అన్నింటినీ మింగేసి
మనిషి మనిషిని తింటున్నాడు.

పాపం! జగమేలే పరమాత్మ
ఎవరితో మొరపెట్టుకొంటుంది?

డిశెంబరు 26, 2014

ప్రశాంతత

కనుల లోతుల్లోకి
ఒక దృశ్యం
రాలి పగిలి
శకలాలై వర్షించింది

హృదయం
తన జలాల్ని
తానే పైకి లేపి
నౌకల్ని లోనికి
లాగేసుకొంది.

ప్రశాంతత
అనంత నీలిమలా.....

డిశెంబరు 21, 2014

నీకసలు స్వప్నించే అర్హత ఉందా.....

నా పెదవుల్ని
నీ పెదవుల మధ్యకు తీసుకొని
ఒక గాఢ చుంబనం
నా చేతులు నీ భుజాల్ని
గట్టిగా పట్టుకొన్నాయి.
మూసుకొన్న కనుల వెనుక......

రాత్రిరోడ్డుపై నల్లని ప్రయాణం
వానల్ని మింగిన వాగు గలగలలు
చల్లని గాలులతో శ్వాసిస్తోన్న తరువులు
బొట్లుబొట్లుగా అరుస్తోన్న నిద్రరాని పిట్ట
చలిగాలికి స్వరం పెంచిన కొలను కప్ప
మీదపడి మరణించిన సాయింత్రాన్ని
మోసుకు సాగే హృదయం.
విరిగిన కిరణాలతో ఉదయించింది
అదే సూరీడా లేక వేరే సూర్యుడా?
స్పర్శలోంచి సుఖం ప్రవహించినట్లుగా
దుఃఖస్వప్నం లోంచి స్మృతులు
సీతాకోకచిలుకలై పైకెగురుతాయి.

"నీకసలు స్వప్నించే అర్హత ఉందా"
అనడిగావు కదూ!

నిన్నూ నన్నూ
ప్రేమలోనో క్షమలోనో
కలుపుతున్నవి ఈ స్వప్నాలే కదా!
నేను స్వప్నిస్తున్నాను కనుకనే
నువ్వొచ్చి వెళిపోతున్న విషయం
పదే పదే గుర్తుకొస్తోంది.

జనవరి 4, 2015

ఫ్రాగ్మెంట్స్

1.
రాలిన పత్రాల్ని
లోనికి లాగేసుకొని
పూవులుగా అందిస్తాయి
తరువులు

2.
ఏమివ్వాలో తెలీక
రెండు పక్కటెముకల్ని
అక్కడ పెట్టి
నిశ్శబ్దంగా
వచ్చేసాను

3.
హింసించే ఈ బరువుల్ని
వదిలించుకొని
భారరహితమౌదామా?
చూడు
ఆ సీతాకోకచిలుక
ఎంత తేలికగా
ఎగురుతోందో!

4.
నిత్యం నీ స్వప్నాలలో
నీతో సంభాషించే అమ్మాయి
ఈరోజు నా కల్లోకి వచ్చి
ముద్దిచ్చిన విషయం
నువ్వేనాటికీ స్వప్నించలేవు

5.
ఒక సంఘటన
ముక్కలు ముక్కలుగా
వెదజల్లబడింది
ఎవరి శకలం వారిదే.

వీడికి ఏనుగు తోక
దొరికినట్టుంది
భలే వాదిస్తున్నాడు.

జనవరి 7, 2015

ఇల్లు

ఇంటికెళ్లటం ఒక వ్యసనం
LSD ట్రిప్ కోసం పక్షులన్నీ
సాయంత్రానికల్లా
ఠంచనుగా గూళ్లకు చేరుకొంటాయి.

ఇంటికెళ్లలేకపోవటం ఒక విషాదం
పెద్దపులిని
నమ్మించలేకపోయిన ఆవు కోసం
లేగదూడ జీవితాంతం
అరుస్తూంటుంది.

జనవరి 13, 2015

అల్పత్వము

కోయిల గొంతులో రక్తజీర
జాతిని నిలుపుకోవటానికి
ఇదే చివరి పిలుపన్నట్లు.

పచ్చదనంతో పోటెత్తిన పత్రాలు
సూర్యుడ్ని పిల్చుకొంటాయి
రేపుండదన్నట్లు.

పువ్వులన్నీ పోటీపడతాయి
తుమ్మెద చుంబనానికై
ఈ రోజే ఆఖరన్నట్లు.

గాలిపటం వెనుక ఆ పిలగాడు
వడివడిగా పరుగెడతాడు
అదే ఈ లోకపు చివరిదైనట్లు.

చేతికందే ప్రతీక్షణమూ
కాలం అల్పత్వాన్ని
గుర్తుచేస్తూంటుంది.

జనవరి 21, 2015

మరణం

మీదపడి రక్కే సమయాల్ని
ఓపికగా విదిలించుకొంటూ
తోడేళ్ళు సంచరించే గాలిని
ఒడుపుగా తప్పించుకొంటూ
బాట పొడవునా
పరచుకొన్న పీడకలల్ని
జాగ్రత్తగా దాటుకొంటూ
శీతలమేఘాలు చిమ్మే కన్నీళ్ళలో
మట్టిపెళ్ళై చిట్లీ, పొట్లీ
మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతూ
చివరకు చేరుకొన్నావా!

నీకోసమే పుట్టిన
నక్షత్రాన్ని తెంపుకొని
తురాయిలో తురుముకొని
గులాబిరేకలు, మిణుగురుపిట్టలు
నిండిన విజయంలోకి
చేరుకొన్నావా మిత్రమా!
అభినందనలు.

జూన్ 3, 2015

వీలుకాదని చెప్పించకు....

నీ దేహమొక స్వప్నం
ప్రతీరోజూ ఆ స్వప్నంలోకి
అనేకానేక అనుభూతులు
వచ్చిపోతూంటాయి

ఎరుపు తెలుపు
నీలిమ ఆకుపచ్చ ఎన్నో..
ఏనాడూ దేనినీ
అనాదరించకు.
ఆహ్వానించు అన్నింటినీ
నీ దేహంలోకి

ఎందుకంటే
అవి నీ గురించే పంపబడ్డాయి
నిన్ను
సంపూర్ణుడిని చేసి
ఓ స్వప్న వర్ణచిత్రంగా
మార్చటానికే
వస్తున్నాయి.

జూన్ 7, 2015

రెండు చింతలు

భుజాలపై చేతులువేసుకొని
నిలుచున్న మిత్రుల్లా ఉండేవి
ఆ రెండు చింతచెట్లు.

నాలుగు తరాల్ని చూసుంటాయి
చివరకు రియల్ఎస్టేట్ రంపానికి
కట్టెలు కట్టెలుగా చిట్లిపోయాయి.
వేళ్ల పేగులు తెంపుకొని
రెండు చింతలు నేలకొరిగాయి.

వృక్షం నేలకూలితే పిట్టలు
కకావికలం అయినట్లు
హృదయం చుట్టూ చింతనలు

చిత్రంగా జీవితానికి కూడా
నిత్యం రెండు చింతలు
గతము, భవిష్యత్తూ.
వర్తమాన రంపం
పరాపరా కోస్తూంటుంది.

(నే నడచిన దారిలో నీడనిచ్చిన రెండు చింతచెట్ల జ్ఞాపకాలతో)

జూన్ 26, 2015

అమ్మ

లేత చర్మాన్ని చుట్టిన గుడ్డల్ని
పచ్చిబాలింత బహుజాగ్రత్తగా
మారుస్తున్నపుడు.....

అంచులదాకా చీకటి నిండిన రాత్రి
ఎక్కడెక్కడి వెలుగురేకల్నో ఏరుకొచ్చి
నిదురలో నవ్వుతున్న పాపాయి పెదవులపై
ఒక్కొక్కటిగా పేర్చింది

ఆకుల సవ్వడి, పిట్టపాట
అలల గలగల, ఆకాశపు నిశ్శబ్దం
దేహాల చావులేమి.....

అన్నిమాటలెందుకూ
ఆ క్షణం నుంచే
భూమి తిరగటం మొదలైంది

ఆగష్టు 19, 2015

అనావృష్టి

పిట్టనోట్లో రెండు బొట్లు
ఆకుల నాలుకలపై
నాలుగు తుంపర్లు
విదిల్చిన మేఘాలు
కొొండమలుపులో
అదృశ్యమయ్యాయి.

రెండు ఉతుకులకే
రంగువెలసిన వస్త్రంలా
ఆకాశం మిగిలిపోయింది.

సెప్టెంబరు *23, 2015*

వెచ్చని కన్నీరు

జ్ఞాపకం ఒక చీకటి రాత్రి
వెలుతురు దుస్తులు తీసేసిన పగల్లాంటి
చిక్కని చీకటి రాత్రి జ్ఞాపకం

ఏం చూసావో నీకు గుర్తుండదు
ఇసుకపై బజ్జున్న పసి పిల్లాడ్నో లేక
చెట్టుకొమ్మకు వేలాడుతున్న పిడికెడు మట్టినో
కానీ దాని జ్ఞాపకం మాత్రం
చీకటి రాత్రిలా నీలో విచ్చుకొంటుంది.
లోహ శబ్దాలు నిండిన మెలకువ
నిశ్శబ్దంగా పరచుకొంటుంది నీ చుట్టూ.

చరిత్ర నదిలో వెచ్చని కన్నీరు
ప్రవహించే సందర్భమది.

సెప్టెంబరు *23, 2015*

దాహం

భూమిలోంచి పైకి లేచిన కుళాయి గొట్టం
ఒంపు తిరిగి పిట్టగోడను అనుసరిస్తూ సాగి
మరో రెండు మలుపులు తీస్కొని
ఇత్తడి టాప్ నేత్రమై
ఏ మేఘసందేశాన్నో నీళ్ళ భాషలో అందిస్తుంది

పుస్తకమూ అంతే
ఎన్నో మలుపులు తీసుకొని చేతిలోకి చేరి
ఒకనాటి మనో ఆకాశపు వానచినుకుల్ని
అక్షరాలుగా వర్షింపచేస్తుంది
మట్టి నయనాలపై

డిశెంబరు 17, 2015

ఆదిమ వాక్యం

ఒక్కో వాక్యం
రకరకాల దారుల్లోకి చీలిపోతుంది
ఏమో
తానే ఓ దారిగా మారొచ్చు కూడా!

కాలం గడుస్తున్నకొద్దీ
నేను నడవని దారులు
వాటిపై వేరెవరో ప్రయాణించిన
ప్రయాణాలూ
ఒక్కొక్కటిగా మీదపడతాయి.

వాటి భారాన్ని మోసుకొంటూ
తిరగగలనా అనుకొంటాను.
సహానుభూతిని మించిన
సౌందర్యమూ, సంతృప్తి
ఎక్కడ దొరుకుతుందీ?

కండ్ల కలకలూ, కలరాలు
ప్రేమకు పరీక్షపెట్టినట్టు
ఒక్కోసారి రకరకాల దారుల్ని
అర్థం చేసుకొనే అన్వేషణలో

నన్ను నేను కోల్పోతాను
ముక్కలు ముక్కలుగా
పగిలిపోతాను, వీగిపోతాను.
ముక్కలన్నీ కూడదీసుకొన్నాక
అర్ధమౌతుంది
ఇప్పుడు
నేనే ఓ దారిగా మారిపోయానని

ఎంత కాదనుకొన్నా
మనుషులందరిలో ప్రవహించే
ఆదిమవాక్యం ఒక్కటే కదా!

నాకు అర్ధం కాదు ......

నా బాల్యాన్ని ఆక్రమించిన
ఆ పాత రేడియో అంటే నాకెంతో ఇష్టం.
రోజుకోసారి దానిని తాకనిదే
ఆ రోజు గడిచినట్లుండదు.
అది మూగవోయి చాన్నాళ్లే అయినా
నిత్యందాని దుమ్ము దులిపి
ధగ ధగా మెరిసిపోయేలా చేస్తూంటాను.

"కాలం ముందుకుపోతూంటే మీరింకా
ఆ పాతని ఎందుకు పట్టుకు వేలాడతారూ?"
అంటుంది మా ఆవిడ ప్రతీసారీ

ఓరోజు ఇంటికి పెద్ద అతిథులొస్తున్నారని
మా ఆవిడ దాన్ని అటకెక్కించేసింది.
అతిథులెళిపోయాకా ఆ రాత్రి
అటకమీంచి దాన్ని దింపి
మరలా దుమ్ము దులిపి
నా టేబుల్ పై ఉంచుకొన్నాను.

నాకర్ధం కాదసలు
బాల్యానికి పాతేమిటి, కొత్తేమిటీ?

సెప్టెంబరు *10, 2009*

ప్రేమలేఖ

అమ్మా
పెళ్ళికిముందు నువు నాన్నకు వ్రాసిన ఉత్తరం
భలేగా ఉందే అంటోంది మా అమ్మాయి
ఆశ్చర్యంగా చూస్తూ.

ఏయ్! అది నీకెక్కడ దొరికిందీ?
ఉత్తరాన్ని గబగబా లాగేసుకొంది మా ఆవిడ.

అవును మరి
బట్టలు ఉతికి ఉతికీ
కారేజీలు సర్ది సర్దీ
చీరకట్టుకొన్న కారేజీలా
మారిపోయిన అమ్మే తెలుసు వీళ్ళకు.

అయినా
ఆ ఉత్తరంలో ఏం కనిపిస్తాయి వీళ్ళకు
గుప్పెడు మల్లెలు
ఇదిగో ఇలాంటి సందర్భంకోసం
కన్న ఏవో కొన్ని కలలు తప్ప.

కానీ
ఆ అక్షరాల మధ్య ....
సగం చెక్కిన శిల్పాన్ని
పూర్తిచేస్తానని ఇచ్చిన మాట
దినాంతాన
నన్ను పడవలో జాగ్రత్తగా పడుకోబెట్టి
పడవనడిపే వానికి
రెండు బంగారునాణేలు ఇచ్చి
భద్రంగా దాటించమని చెప్తానని
చేసిన ప్రమాణమూ
నాకు తప్ప మరెవ్వరికీ
కనిపించవు.

ఆగష్టు 25, 2015

అధికారం

వెయ్యి ప్రమాణాలు
భంగమయ్యాక కానీ
అర్ధం కాదు నీకైనా నాకైనా
జయాపజయాలకు
అతీతంగా
యుద్ధం చేయాల్సిన
చెస్సు పిక్కలమని

ఇంతోటి వైభోగానికే
రాజు–బంటు తేడాలొకటీ

ఫిబ్రవరి 21, 2016

రక్తం మరకలు...

వాడు
మైకు ముందు
ఏవేవో ప్రణాళికల
చిట్టా విప్పాడు

జయజయధ్వానాలు
మిన్నంటాయి

ఎవరో నా చేతిలో
పూల రేకలు పెట్టారు
వాడు వేసే
అడుగు అడుక్కీ
పూల రేకలు చల్లాను

ఇంటికొచ్చి చూసుకొంటే
నా చేతుల నిండా రక్తం

ఎంత కడిగినా పోని
రక్తం మరకలు
రేపు నా పిల్లలకు
ఈ చేతుల్నెలా
చూపించేదీ?

ఫిబ్రవరి 16, 2016

అపుత్రస్య.......

నీకు సమ్మతమే కదా?
"సమ్మతమే"
గర్భసంచి గోడలపై
రూపుదిద్దుకొంటున్న
వాక్యం అసంపూర్ణంగా
తెగిపోయింది.
నీకు సమ్మతమే కదా?
తలదించుకొందామె.
కుడ్యచిత్రం పూర్తికాకుండానే
వాననీటికి రంగులు రంగులుగా
కరిగిపోయింది మట్టిలోకి.

ఆమెనెందుకు తీసుకురాలేదూ?
"ప్లీజ్"
రక్తనాళాల్లోకి దొంగలా ప్రవేశించిన
అబార్షన్ పిల్
గోడపై విచ్చుకొంటున్న
చామంతి మొగ్గను
చిదిమేసింది.

****

“వంశక్షయం కాకుండా
పండంటి మగబిడ్డను పొంది
స్వర్గార్హతను సాధించిన
నువ్వెంతటి అదృష్టవంతుడవయ్యా”
అని అందరూ అంటూంటే
హత్యచేయబడ్డ మూడు అసంపూర్ణ భ్రూణాలు
తలలు అడ్డంగా ఊపాయి.

జనవరి 1, 2016

ఇంటికి తీసుకెళ్ళవా?

హరప్పా పురవీధిలో నడుస్తూ
వెనక్కు తిరిగి నన్ను చూసి
నవ్విన సుందరికి
కాలాతీత కొనసాగింపు నీవు

అంత:పుర రహస్యమార్గం నిర్మించాకా
అదృశ్యం చేయబడ్డ ఆచారి విసిరిన
అలౌకిక దేహ రేణువును నేను

నిప్పుల మధ్య
నల్లని బొగ్గు అంచులతో
సగం కాలిన మన కలలు
రాతి పొరల మధ్య శిలాజాలు.

ఏ మాత్రమూ భరించలేని నిరీక్షణ
ఈ రక్త శ్వాస.

మట్టిని వెతుక్కొంటోంది విత్తనం

నన్ను ఇంటికి తీసుకెళ్ళవా?

ఫిబ్రవరి 21, 2016

ఆ తరువాతేం జరిగిందంటే.....

తెల్లని కాంతులీనే కొంగొకటి
ఓ ఊరి చెరువుగట్టుపై వాలింది
గొప్ప తేజస్సుతో, రాజసంతో ప్రకాశిస్తోన్న
దాని చుట్టూ ఊరి కొంగలు చేరాయి.

'ఎక్కడనుంచి వచ్చావు నీవు?'
'హిమాలయాలలోని మానససరోవరం నుంచి'
'మీ ఊరి విశేషాలు చెప్పు'

'సమీపాన రజతకాంతుల కైలాసశిఖరం
పవిత్ర జలాలతో నిండిన సరోవరం
దేవతలు స్నానించే నెలవు
ఒడ్డున కొలువుదీరిన కల్పవృక్షం
దివ్యకొలనునిండా స్వర్ణ పద్మాలు, మంచి ముత్యాలు'

'మరి నత్తలు... నత్తలుంటాయా మీ ఊరి చెరువులో'
'నత్తలు అంటే?'
'నత్తలంటే తెలియదా.... హవ్వ...'
అంటూ పకపకా నవ్వుకొంటూ ఎగిరిపోయాయి ఊరికొంగలు

కొన్నాళ్లకు
అమృతజలాలు లభించక
నత్తల్నెలా పగలగొట్టుకొని తినాలో తెలియక
మానససరోవరపు కొంగ కృశించి కృశించి
ఆ చెరువు గట్టునే చచ్చిపోయింది.

ఏప్రిల్ 15, 2016

రెండు నాల్కల పద్యం

ఆధునిక ప్రపంచానికి
నువ్వెవరో అనవసరం
నువ్వేం మాట్లాడుతున్నావు' అనేదే
ముఖ్యం
జేజేలు కొడితే మెచ్చుకోళ్లు
డౌన్ డౌన్ అంటే ఇక్కట్లు

నువ్వు కేవలం ఒక సంఖ్యవు అంతే!

****

ఆధునిక ప్రపంచానికి
నువ్వేం మాట్లాడుతున్నావో అనవసరం
నువ్వెవరో తెలిసితీరాలి
కులం మతం ప్రాంతం తోకలతో

నువ్వు ఉత్త విభజన రేఖవు అంతే!

ఏప్రిల్ 25, 2016

బొల్లోజు బాబా

తల్లిదండ్రులు	బొల్లోజు బసవలింగం, అమ్మాజి
సహచరి	సూర్య పద్మ
పిల్లలు	అపరాజిత, బసవ శ్రీధర్
చదువు	M.Sc., B.Ed., M.Phil.
వృత్తి	జువాలజీ అధ్యాపకుడు
రచనలు	**యానాం విమోచనోద్యమం** (2007) **ఆకుపచ్చని తడిగీతం** (2009) కవితా సంపుటి) **ఫ్రెంచిపాలనలో యానం** (2012) **స్వేచ్ఛావిహంగాలు** (రవీంద్రుని స్ట్రే బర్డ్స్ అనువాదం) 2016
ఇ.బుక్స్	**'ఎడారి అత్తరులు'** (ప్రముఖ సూఫీకవుల గీతాల అనువాదాలు) **ఇరవై ప్రేమకవితలు ఒక విషాదగీతం** (Twenty Love Poems and a Song of Despair, Pablo Neruda , తెలుగులో) **గాథాసప్తశతి-కొన్ని అనువాదాలు** (నాకు నచ్చిన కొన్ని గాథల అనువాదం) **వివిధ పుస్తకాల పరిచయ వ్యాసాలు** (పై ఇ.బుక్సు లభించు వెబ్ చిరునామా: http://www.scribd.com/bollojubaba)
బ్లాగు	http://sahitheeyanam.blogspot.com/
అవార్డులు	ఆకుపచ్చని తడిగీతం పుస్తకానికి శిలపరశెట్టి సాహితీ ప్రత్యేక పురస్కారం -2010 కళాలయ సాంస్కృతిక సంస్థ, పాలకొల్లు వారిచే సాహితీపురస్కారం 2012



ఆధునిక జీవనం సిక్స్ పేక్ హృదయం, యూజర్ నేమ్, పాస్ వర్డ్, క్లోన్ సంతతి, వినైల్ ప్రింట్లు, డిజిటల్ దినాలు వంటి అత్యాధునిక పరిభాషను అందించినా ఈ కవి మూలాలు పల్లె పట్టుల్లోనే ఉన్నాయని కొన్ని కవితల్లోని పదసంపద తెలియజెప్తుంది. విత్తనాలకై ఎండబెట్టిన బీరకాయ, అల్చిప్ప కన్ను, గాలిమొమ్మ, కర్రాట, మట్టుపైని అణుగుకోడి, వరికంకుల కుంచె, ఎద్దుకు కొట్టే నాదాలు, ఇవన్నీ నేటి నవనాగరికుని అనుభవం లోకి రాని వస్తుసామగ్రి **- శిఖామణి, కవి విమర్శకుడు, ప్రొఫసర్ తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.**

యానాం అంటే వొక మెరుపు మలుపుల గోదారి వెంట ప్రయాణం. సరిహద్దుల మధ్య కలిసే భాషల, సంస్కృతుల హోరు. తెలుగు కవి సాధారణంగా తెలుగు పొలిమేర దాటి వెళ్ళడు. ఇస్మాయిల్ గారి కప్ప లాగ. కాని, కవిత్వం ఉన్నచోటల్లా ప్రవాసం వెళ్లి, అక్కడి నించి పాడే పిట్ట బాబా. అందుకే అతని కవిత్వం తన ఎల్లలు తానే చెరిపేసుకొని నేలా-ఆకాశం ఉన్నా చోటల్లా కొత్త కవిత్వ ప్రపంచ పటాన్ని గీస్తుంది, కరుణతో, ప్రేమతో, మనిషితనంతో. అందుకే, గ్లోబలి పీట మీద కూడా బాబా ఐ.డి. మానవత్వమే, పాస్ వర్డ్ కవిత్వమే! **- అఫ్సర్, అధ్యాపకులు, ఆసియా విభాగం, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ - ఆస్టిన్.**

ఎవరో మహానుభావుడు కాసిన్ని అక్షరాల్ని కాలానికి అర్ఘ్యమిస్తాడు. ఊహల ఛాయలతో పిడికెడు ఆలోచనల్ని పుటలపై చల్లుతాడు. ఎవరో (ఆయన కూడా మహానుభావుడే) ఆ పుస్తకాన్ని తన హృదయ కవాటాల్ని తెరుచుకొని ఆవలోకిస్తాడు. అంతే ఒక సంగీతమేఘం తేనె పాటల్ని వర్షిస్తుంది. అక్కడితో అయిపోలేదు. ఆ రాగ స్పర్శకు మనోయవనికపై ఓ అపరిచిత అరణ్యం మొలకెత్తుతుంది. బొల్లోజు బాబా ఒక రసావిష్కరణ జరిగిపోవడంతో సరిపెట్టుకోడు. పుస్తకంలోకి నడవటాన్ని పరిచిత పాత్రలోకి మనల్ని మనం ఒంపుకునేట్టుగా మలుస్తాడు. **- దాట్ల దేవదానం రాజు, కవి, రచయిత, యానాం**

అసంఖ్యాక ఇంటర్నెట్ పాఠకులను కూడా తన కవిత్వంతో, చక్కని విశ్లేషణలతో ఆకట్టుకొనే నిజమైన సాహిత్య ప్రేమికుడు బొల్లోజు బాబా. ప్రతీకలు, పదచిత్రాలు ప్రయోగిస్తూనే కవిత్వంతో హృదయానికి తీయని బాధను పంచిపెట్టగల రసపిపాసి.
- డా. దార్ల వెంకటేశ్వర రావు, ప్రొఫసర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

పద్మనాభనాథ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ - కాకినాడ , ఫోన్ : 6588013

ఆకుపచ్చని తడిగీతం

ఆకుపచ్చని తడిగీతం



బొల్లోజు బాబా

ఆకుపచ్చని తడిగీతం

బొల్లోజు బాబా

అక్టోబరు 2009

కవర్ డిజైన్: చిన్నారి, యానాం

బొల్లోజు బాబా, లెక్చరర్
30-7-31, గొల్లల వీధి
సూర్యనారాయణ పురం
కాకినాడ, 533001
తూర్పుగోదావరి జిల్లా.

ఫోన్: 9849320443
0884/2368189

Please Visit - **http://sahitheeyanam.blogspot.com/**

విషయసూచిక

మగువా!
నా ప్రపంచాన్ని నీ సొగసరి
అంగుళులతో స్పృశించావు, అంతే
ప్రశాంతత సంగీతమై పల్లవించింది.
టాగోర్ – స్ట్రే బర్డ్స్

సూర్యపద్మ కు

కవిత్వంలోకి చేయిపట్టుకొని నడిపించిన శిఖామణి గారికి

యానాం ఎప్పుడెళ్లినా పుస్తకం ఎప్పుడు తెస్తావూ అంటూ పలకరించే శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి

ఆత్మీయంగా అక్షరాశీర్వాద వాక్యాలు వ్రాసిన అఫ్సర్ గారికి, దార్ల వెంకటేశ్వర రావు గారికి, సౌభాగ్య గారికి,

అందమైన ముఖ చిత్రాన్ని ఇచ్చిన బాల్య మిత్రుడు చిన్నారి కి

చెల్లి రాం, ఫణి, ప్రభాకర రావు, సారధి, సంజీవకుమార్ లకు,

అంతర్జాలంలో నా '**సాహితీ యానం**' బ్లాగు కు వచ్చి నా కవితల్ని చదివి ప్రోత్సహిస్తూ, తప్పొప్పులు చెపుతూ, సలహాలిస్తూ, ముందుకు నడిపించిన బ్లాగ్మిత్రులకు పేరు పేరునా

కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాను.

బొల్లోజు బాబా

కాలుష్యం అంటని కవి బొల్లోజు బాబా

–శిఖామణి

1991 ప్రాంతంలో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఈవారం కవిత శీర్షికలో బొల్లోజు బాబా పేరుతో కవిత చదివి ఆశ్చర్యపోయాను. మన బొల్లోజు బసవలింగం మాస్టారి గారి అబ్బాయి బాబా నా అనే సందేహం కలిగింది. సందేహంలేదు ఆ బాబానే. మా బాబానే! అప్పటికి ఒకటి రెండు సంవత్సరాలకు ముందే ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఈవారం కవిత అనే కొత్త శీర్షిక లో నా కవిత రావాలి అని ఎంతో మంది కవులు అనడం విన్నాను నేను. బాబాతో అదే అన్నాను. ఎవరి ప్రాపకం లేకుండా నీ కవిత ఈవారం కవితలో వచ్చిందంటే ఇక నీకు తిరుగులేదు, రాసుకో పో అన్నాను. నాకు యానం మట్టిలో పుట్టిన మరో కవిత్వ వారసుడు దొరికాడు అని ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాను. అయితే నా ఆనందాన్ని ఆవిరిచేస్తూ బాబా సుమారు దశాబ్దకాలం పైగా అదృశ్యం అయిపోయాడు. ఇదిగో ఇపుడు ఈ 2009 లో ఒక ఆకుపచ్చని తడిగీతం గా విస్తరించి మనముందు ప్రత్యక్షం అయ్యాడు.

ఈ బాబా వొఠి బాబా కాదు. ఇతని వెనక సాహిత్యవారసత్వం ఉంది. అది వాళ్ల నాన్నగారిచ్చిన సంపద. బొల్లోజు బసవలింగం మాస్టారు ఉత్త మాస్టారు కాదు. ఆయనకు తెలుగుతో పాటు, సంస్కృతం, ఆంగ్లం, ఫ్రెంచి భాషా సాహిత్యాలలో మంచి అభినివేశం ఉంది. 'సువర్ణశ్రీ' పేరుతో ఆయన రచనలు చేసారు. ఆయన రాసిన సాంఘిక ప్రభోదాత్మక నాటకం 'నేటి విద్యార్థి' మా కాలేజీ రోజుల్లో విద్యార్థులు విజయవంతంగా ప్రదర్శించేవారు. తమిళంలో వున్న 'ఆనందరంగరాట్చందం' గ్రంథంలో తెలుగు విశేషాలు గురించి కొంత పరిశ్రమ చేసారు. విద్యార్థి నాయకునిగా ఫ్రెంచి పాలననుండి యానాం విమోచనోద్యమంలో చురుకైన పాత్ర పోషించారు – అలాంటి సాహిత్య, సాంస్కృతిక వారసత్వం నుండి కవిగా ఎదిగొచ్చినవాడు బొల్లోజు బాబా.

ఈ తడిగీతంలోకి విస్తరించుకొంటూ లోపలికెళ్తుంటే ఎందుకో నాకు 70 ల నాటి ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారి అనుభూతి గీతాలు, దానికి అజంతా రాసిన ముందు మాటా గుర్తుకొచ్చాయి. ఇప్పుడు ఈ పద్యాలు చదువుతుంటే బాబా కల్మషం అంటని కవిలా గోచరిస్తున్నాడు.

హేమంతోత్తరీయాన్ని కప్పుకున్న వనం
ఆకుల కొనల వేలాడే
మంచు బిందువుల భారాన్ని
మోయలేక అలసిపోతోంది.

అంటూ మొదలయ్యే వెన్నెల నావ ప్రయాణం అంతరంగపు లోతుల గుండా ప్రయాణించి మనల్ని అనుభూతి శిఖరంమీద కోహోపెడుతుంది. వాన కురవడానికి కవి ఊహించిన కారణం ప్రకృతి తన్మయీభావాన్ని ప్రకటిస్తుంది.

మేఘాలూ నేలా
రాత్రి చుంబించుకొన్నట్లున్నాయి.
తెల్లవార్లూ వాన కురుస్తూనే ఉంది.
......
సూర్యకిరణాల కిలకిలారావానికి
లిట్మస్ పేపర్‌లా ఆకాశం రంగు మారింది.

ఈ పంక్తులు కవిలోని రసాయినిక చర్యలు మనకు పట్టి యిస్తాయి. మొత్తం పర్యవసానం కవి ఆలపించే ప్రాచీన గీతానికి కాన్వాసును సిద్ధం చేయటమే!

తడిచిన సీతాకోకచిలుక
కవిత్వంపై వాలి రెక్కలల్లార్చింది.

అనడం ద్వారా ఒక రసార్ద్ర చిత్త హృదయాన్ని కవి పాఠకుని ముందు పరిచాడు. ఈ ముగింపు వాక్యాలు చదివాక పఠితల్లో ఒక కొత్త మనోద్వారం తెరుచుకుంటుంది. అక్కడ్నుంచి అంతర్గత సంభాషణ మొదలౌతుంది.
ఒంటరి దీవిలో ఉన్న కవి ఒక సమూహం అంతశక్తిమంతుడు. సమూహంలో సంచరిస్తున్నా కవి అపరిచితుడు, ఒంటరికూడా! దీనికి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ ల సహపంక్తిలోని వాడు బాబా. లేకపోతే

అపరిచిత ప్రపంచంలో బతకటం అంటే
మబ్బుల మధ్య గుంపునుకోల్పోయిన
కొంగపిల్ల తుమ్మ చెట్టుకు గాయమై
వేలాడడమే!

అని వ్రాయగలిగే వాడు కాదు. జ్ఞాపకం మానవ జీవితాన్ని సౌందర్య విషాదాలలో ముంచితేల్చే అమృతగుళిక. జ్ఞాపకాలు లేనివాడు ముందు మనిషెట్లా అవుతాడు? అసలు కవెట్లా అవుతాడు. బాబా జ్ఞాపకం గురించి రెండు మధురమైన కవితలు రాసాడు. ఈ కవితలు చదివితే నల్లగేటు నందివర్ధనం చెట్టులో నేను రాసుకొన్న 'ఎందుకొస్తావే జ్ఞాపకానికి మీరా' కవిత గుర్తుకొచ్చి హృదయం చెమ్మగిల్లింది.

రాత్రయితే చాలు
1. ఋతువు తప్పని /వలస పక్షుల్లా
 నీ జ్ఞాపకాలు/హృదయంపై వాలతాయి.

2. ఏకాంత సాయింకాలపు పలుచని వెలుతురులో
హృదయంలో విరిసిన సన్నజాజుల గానంలా
ఓ జ్ఞాపకం హాయిగా సలుపుతుంది.

3. ఆల్చిప్ప కన్నుతో/ మామిడి చెక్కు ఒలిచినట్లుగా
జ్ఞాపకాల ఒక్కోపొరనీ/ ఒలుచుకుంటూ పోతే
చివరకు ఒక స్ఫటిక సదృశ/ కన్నీటి బిందువు మిగిలింది.

ఈ పంక్తుల్లోని 'రుతువు తప్పని' మాట జ్ఞాపకం అనివార్యతనీ, 'హాయిగా సలపటం' జ్ఞాపకం యొక్క స్వభావాన్ని, చర్యనీ, స్ఫటిక సదృశం పదంతో దాని నిర్మలత్వాన్ని కవి ధ్వనిస్తున్నాడు. భారతీయ సంస్కృతిలో 'గురు' సంస్కృతికి ఎంతో ఉన్నత స్థానం ఉంది. తల్లి దండ్రుల తర్వాతి స్థానం గురువులకిచ్చి గౌరవించిన సంస్కార సంపద మనది. శిష్యుల్ని అభిమానించి ప్రేమించే తత్వంలోని మాధుర్యగుణం అనుభవపూర్వకంగా తెలుసుకోవలసిందే! అలాంటి అనుభవం నుండి రాసిన కవిత 'సార్ గారండీ! సార్ గారండీ!'

వాని ఆలోచనల చురకత్తులు
పదును పెట్టుకోవటానికై
నా మెదడును సానరాయిని చేస్తాను.

నిజమైన గురువు చేయవలసిందిదే! అలాంటి శిష్యుల నుండి 'బాగున్నారా మాస్టారు' అన్న పలకరింపు కన్నా ఇంకేం కావాలీ జీవితానికి అంటాడు.

గురువు తరువాత అంతటి ప్రభావాన్ని చూపగలది పుస్తకమే! పుస్తకం చీకటి గదిలో దీపం లాంటిది అన్నాడు డా. బి.ఆర్. అంబేద్కర్. పుస్తకాన్ని చదవడంలోని అనిర్వచనీయమైన ఆనందాన్ని 'పుస్తకంలోకి నడవటమంటే' అనే కవితలో బాబా ఒడిసిపట్టుకున్నాడు.

ఎప్పుడో, ఎక్కడో, ఎవరో ఒకడు/ ఆ పుస్తకాన్ని తెరుస్తాడు.
ఒక జీవనది వాని గుండెల్లోకి/ ప్రవహించటం మొదలౌతుంది.

జీవనది ఆర్ద్రతకు, కదలికకు, చైతన్యానికి ప్రతీక. చలం అన్నట్టు ఈ పుస్తకాలు పటం మల్లె గోడకి వేళాడేవి కాదు. మంచికో చెడ్డకో జీవితాల్ని ప్రభావితం చేసేవి. ఉత్తమ పాఠకుడు కాగలిగిన వాడే 'ఉత్తమ కవీ కాగలడు' బాబా ఉత్తమ పాఠకుడని ఇలాంటి కవితలు సాక్ష్యమిస్తాయి.

ఈ సంపుటికి మకుటాయమానమైన కవిత 'యూజర్ నేమ్: మనిషి – పాస్ వర్డ్: మానవత్వం' కవిత. ఆధునిక టెక్నాలజీలో వచ్చిన సాంకేతిక పరిభాషను మనుషులు మర్చిపోతున్న మానవత్వానికి అన్వయించి రాసిన గొప్ప కవిత ఇది – అభివ్యక్తిలోనూ కొత్తదారులు తొక్కిన కవిత. కవిత అంతాచదివాక గొప్ప అనుకంప మనసు నిండా, శరీరం నిండా ఆవరిస్తుంది. శక్తిమంతమైన లక్షల మెగావాట్ల హైపర్ టర్బయిన్‌లతో శరీరంలోని రక్తాన్నంతా బయటకు తోడిపోసిన ఒక డొల్లతనం భయపెడుతుంది. ఇంతాచేసి మనిషి ఇంతేనా అనిపిస్తుంది. ఈ వాక్యాలు చదవండి ఎంత భయపెడుతున్నాయో!
జీవితం ఫోల్డర్ లోని శాంతి అనే ఫైలు
ఎంత ప్రయత్నించినా తెరుచుకోవటం లేదు.
దేవుడా! దయచేసి నా పాస్ వర్డ్

రిట్రీవ్ చేసి పెట్టవూ?
ఈ నూతిలో గొంతుకను మనందరం వినితీరవలసిన అగత్యం ఎంతైనావుంది.

ఇంతటీ స్వచ్ఛ కవినీ ఇస్మాయిల్ గారు అన్నట్టు 'భాదించే లోకపు ముల్లు' భాదిస్తూనే వుంది. ప్రాచీన గ్రామీణ భారతం నుండి ఆధునిక గ్లోబల్ విలేజీ వరకూ ఈ దేశ మూల వాసుల్ని 'మీరేవుట్లూ' అని శూలంతో ప్రశ్నిస్తూనేవుంది. అనివార్య సామాజిక సంఘర్షణలో కవి దానికి సమాధానం చెప్పుకోవడం 'బి.సి. అంటే ఎవరు నాన్నా' కవితలో చూడవచ్చు. సంపదను ఉత్పత్తి చేసే కులవృత్తుల పతనం తరువాత ' స్మశానంలా తీసుకోవడమే కానీ ఇవ్వటం తెలీని ఈ సమాజానికి తరతరాలుగా సంపదను అందిస్తున్న ఈ జీవిని ఎలా నిర్వచించాలి? అని మధనపడతాడు. పుట్టి పెరిగిన ఇంటిని చాలా ఏళ్లతర్వాత చూసినపుడు కలిగిన బాధ, లేని నాన్న టేబుల్ మీద వదిలి వెళ్లిపోయిన చేతి గడియారాన్ని చూసినప్పుడు పడ్డ సంవేదన కవితాకృతులు దాల్చాయి.

ఆధునిక జీవనం సిక్స్ పేక్ హృదయం, యూజర్ నేమ్, పాస్ వర్డ్, క్లోన్డ్ సంతతి, వినైల్ ప్రింట్లు, డిజిటల్ దినాలు వంటి అత్యాధునిక పరిభాషను అందించినా ఈ కవి మూలాలు పల్లె పట్టుల్లోనే ఉన్నాయని కొన్ని కవితల్లోని పద సంపద తెలియజెప్తుంది. విత్తనాలకై ఎండబెట్టిన బీరకాయ, ఆల్చిప్ప కన్ను, గాలిమొమ్ము, కట్రాట, మట్టుపైని అణుగుకోడి, వరికంకుల కుంచె, పూడిక తీయని బావి, ఎద్దుకు కొట్టే నాడాలు, చూరు అంచులు ఇవన్నీ నేటి నవనాగరికుని అనుభవం లోకి రాని వస్తుసామాగ్రి.

ఇస్మాయిల్ గారి కవిత్వాన్ని ఇష్టంగా, కంఠదఘ్నంగా చదూకొన్న ఈ కవి ఇస్మాయిల్ గారు పనిచేసిన పిఠాపురం మహరాజువారి కాలేజీలో ఉద్యోగించటం యాదృచ్ఛికమే అయినా ఇక్కడ కూడా ముఖ్యంగా లఘు కవితల్లో ఇస్మాయిల్ గారు తొంగిచూడడం – మొదటి సంపుటి కనుక ఆహ్వానించదగ్గదే! దశాబ్దం విరామంతర్వాత కవిగా ముందుకొస్తున్న బాబాకు నా కవిత్వాలింగన.

శిఖామణి
28 సెప్టెంబరు 2009

ఆర్ద్ర కవిత్వపు వెన్నెల వాన

కవిత్వ రచనా మమకారం దాచేస్తే దాగేది కాదు. రాయకుండా ఉండలేనితనం కుదిపి మరీ బయటకు తీసుకొస్తుంది. ఒక మెరుపు మెరిసినట్లు తళుక్కున కవిత్వపాదమేదో స్ఫురిస్తుంది. మననం చేసుకుంటూ అనవసరమైన దాన్ని పరిహరిస్తూ దొరికిన కాగితం మీదకు ఒంపుకోవల్సిందే. ప్రాకృతిక పారవశ్యాన్ని ఆత్మ సంవేదనలో ముంచి కవిత్వీకరించే పనైతే మరీను. హృదయ భారం తొలగి తేలికవ్వడం అంటే ఆరోగ్యహేతువైన ఔషధం దొరికినట్లే కదా! జీవనగమనంలో ప్రాధాన్యతా క్రమాల్ని ఎంచుకోవడంలోని తడబాటు భావనా ప్రపంచం కుంచించుకు పోయేటట్లు చేస్తుంది. అయినా ఏ మూల నుండో ఒక ఉత్ప్రేరకం తట్టి లేపుతుంటుంది. ఒకానొక అనివార్యత పరిమళం గుప్పుమనేటట్లు చేస్తుంది. కాలమో వృత్తో అనుబంధాలో బాధ్యతలో ఒత్తిళ్ళో మానసిక సంఘర్షణలో స్వార్థాతీత కల్లోలాలో ప్రవృత్తుల్ని ఎంతమాత్రం దహించలేవని బొల్లోజు బాబా ను పరికిస్తే అర్థమౌతుంది. లోలోపలి చెమ్మను అనుభవించి పలవరించి కొత్త మొలకై చిగురించి తాజాగా తనను తాను మొలిపించుకునే ప్రయత్నమే బొల్లోజు బాబా చేసారు. పద్దెనిమిదేళ్ళ క్రితం ఆంధ్రజ్యోతి ఈ వారం కవితగా ప్రత్యక్షమైనపుడు కవితాలోకం బాబా గురించి ఆరా తీసారు. మరల ఇపుడు దోసిల నిండా కవిత్వ గుభాలింపుల్ని మోసుకుంటూ అక్షర కాంతుల్ని వెదజల్లుతూ ఆకుపచ్చని తడిగీతాలుగా పలకరిస్తున్నాడు. విరామం మాయమవడం కాదు. అందమైన కొనసాగింపుకు నిశ్శబ్దప్రయాణం అన్నమాట ఈయన విషయంలో అది నిజమైంది. తాను పరవశిస్తూ కవిత్వాభిమానుల గుండెల్ని మీటే పనిమీద బొల్లోజు బాబా ఉన్నాడని ఈ కావ్యం నిరూపిస్తున్నది.

వీలున్న ప్రతి సందర్భంలోనూ శిఖామణి పలు సభా వేదికలపై బొల్లోజు బాబా పేరు ప్రస్తావించకుండా ఉండలేదు. స్థానిక కవులు వెలువరించిన కవితాసంపుటుల్లో సైతం బొల్లోజు బాబా గురించి రాసి కవిని బయటకు తెచ్చే ప్రయత్నం చేసారు. అయినా కదలిక లేదు. అలాంటి బాబా ఆ మధ్య చక్కగా కవితల్ని డి.టి.పి. చేసుకుని వచ్చి ఆనందాశ్చర్యాలకు గురి చేసారు. గత కొంతకాలంగా ఇంటర్నెట్ లో సాహితీయానం.బ్లాగ్‌స్పాట్.కాం అనే బ్లాగు ద్వారా కవిత్వ ప్రేమికుల్ని అలరిస్తూ తన అస్తిత్వాన్ని బలంగా గాఢంగా నిండార సాంద్ర కవిత్వంగా నింపుకుంటూ ఇపుడిలా కావ్యమౌతున్నందుకు ఆనందం కలుగుతున్నది.

కవిత్వం హృదయ సంబంధి అన్న ఇస్మాయిల్ మాటలు నిజమే కదా అనిపిస్తుంది బొల్లోజు బాబా కవితలు చదువుతుంటే. వైయుక్తిక అనుభూతిని సార్వజనీనంగా చిత్రించే కవితానిర్మాణం కరువై ఒక స్తబ్దత వాతావరణం ప్రస్తుతం నెలకొంది. తక్షణ స్పందనలతో

కాసింత తాత్వికతను మేళవించడం లేదా గుప్పెడు నినాదాలై చిట్లిపోవడం లేదా ఆగ్రహావేశాల్ని హఠాత్తుగా కొని తెచ్చుకోవడమే కవిత్వంగా వదులుతున్నారనిపిస్తున్నది

ఎటువంటి సంధియుగంలోనైనా కవి నిస్తేజంగా ఉండలేడు. ప్రాపంచిక విషయాల పట్ల దూరాన్ని పాటించలేడు. సమూహంలో ఏకాకితనపు జాడల్ని భరించలేడు. అంతర్లోకంలో వీచే గాలులకు మౌన ప్రేక్షకునిగా మిగిలిపోలేడు. అనుభవాలు ప్రశ్నల ఇసుకను కళ్లల్లో చల్లి పోతూనే ఉంటాయి. భావనా సంద్రంలో ఈదులాడినపుడు ఊహల్నీ ఆలోచనల్నీ నిర్బంధించే అడ్డుగోడలేవీ? భావుకుడైన వాడు మానసికంగా చేసే ప్రయాణం కవిత్వమే అవుతుంది. ఒక సంఘటన ఒక మెరుపు ఒక ఆవేశం ఒక ఉద్వేగం ప్రేరణగా కవిత రూపు దిద్దుకుంటుంది. పదచిత్రం ద్వారా దృశ్యం సాకారమవుతుంది. అందుకే కవిత్వమే సాంత్వన చేకూరుస్తుందనే ఎరుక వల్ల బొల్లోజు బాబా కవిత్వాన్ని ఇంటిపెద్దగా సంభావించాడు. అలాగే మనిషిని చేసే శక్తి కవిత్వానికే ఉందని ఊరట చెందుతున్నాడు.

రాలిన పూలను తురుముకున్న కాలిబాట సుగంధాలను గానం చేస్తుంది. ఇక తన్మయత్వంతో తలలూపే పని బాటకిరువైపులా ఉన్న చెట్లదే. చందమామ – నిద్రలో శిశువు పెదాలపై పరుచుకునే నవ్వులా ఉంటాడు. గులకరాళ్ళతో మాట్లాడే సెలయేరు వడివడిగా ప్రవహిస్తుంది. వెన్నెల్లోని మల్లెఛాయ వెలుగులో తిరుగాడే మిణుగురులు పగలు వెలిగే వీధి దీపాల్లా వెలవెల బోతాయి. వెన్నెల నావనెక్కి రాత్రి ఒంటరిగా వేకువ తీరానికి సాగిపోతుంది. ఇలా మనం 'వెన్నెల నావనెక్కి' కవితలో శుభ్ర స్వచ్ఛ కవిత్వ రసాల్లో తేలి ఆడేటట్లు చేస్తారు బొల్లోజు బాబా.

వేళ్ళను మట్టి కింద కప్పెట్టిన స్వార్థం, పక్షి పిల్ల సౌందర్యాన్ని తనలో దాచుకున్న గుడ్డు జాణతనం, అద్భుత శిల్పాన్ని ధరించిన రాళ్ల మొండితనం, వీటిని చూస్తూ మది నిండా నింపుకున్నప్పటికీ చిరునవ్వు చాక్లెట్ ఇవ్వనందుకు అందంగా నెపాన్ని ప్రేయసి మీద పెడుతున్నాడు. ఇవ్వకపోయినా గుండె కన్నీళ్ళను కలల కర్చీఫ్ తో తుడుచుకుని హాయి అనుభవిస్తున్నాడు కవి గడుసుతనంగా.

ఎవరో మహానుభావుడు కాసిన్ని అక్షరాల్ని కాలానికి అర్పిస్తాడు. ఊహల ఛాయలతో పిడికెడు ఆలోచనల్ని పుటలపై చల్లుతాడు. ఎవరో (ఆయన కూడా మహానుభావుడే) ఆ పుస్తకాన్ని తన హృదయ కవాటాల్ని తెరుచుకొని అవలోకిస్తాడు. అంతే ఒక సంగీతమేఘం తేనె పాటల్ని వర్షిస్తుంది. అక్కడితో అయిపోలేదు. ఆ రాగ స్పర్శకు మనోయవనికపై ఓ అపరిచిత అరణ్యం మొలకెత్తుతుంది. బొల్లోజు బాబా ఒక రసావిష్కరణ జరిగిపోవడంతో సరిపెట్టుకోడు. పుస్తకంలోకి నడవటాన్ని పరిచిత పాత్రలోకి మనల్ని మనం ఒంపుకునేట్టుగా మలుస్తాడు.

నోస్టాల్జియా తాలూకు జ్ఞాపకాలు కవులకెప్పుడూ ముడిసరుకే. ఇంకో పక్కనుంచి మనవి అనుకున్న అనుభవాల్ని ఏదో రకంగా వెల్లడించి జ్ఞాపకాల్ని శాశ్వత పరచుకోవడానికి కవులు తాపత్రయపడతారు. అందుకు బాబా మినహాయింపు కాదు. అంతర్ముఖీనంగా నిక్షిప్తమైన భావనా శకలాలు 'ఓ నా ప్రియ గృహమా' అంటూ ఎలుగెత్తి చెప్పేలా దృశ్యమానం అయ్యాయి. కాంక్షాతీరాల వెతుకులాటలో పోగొట్టుకున్న గుప్పెడు మట్టిలో నిన్ను నేను కోల్పోయాను అంటూ తనదంటూ అస్తిత్వం ఇంకా అక్కడే చిక్కుకున్నాదని మధనపడతాడు.

వికృత మీడియా సంస్కృతి లో సర్వవ్యాపిత దు ఖానికి మరో కోణం ఉండకూడదనే నిరసననీ, నగరం విసర్జించిన నాగరికతను ఏరిపారేసే పారిశుద్ధ్య కార్మికులనీ, చిల్లుల ఓజోను పొర కప్పుకుని పుండవుతున్న పర్యావరణాన్ని, తనకే స్వంతమైన అచ్చమైన ప్రేమనీ, మానవ సంబంధాల వైరుధ్యంతో చిట్లిపోయిన ఆస్పత్రిలో ఓ చావునీ, రత్యానంతర దేహాల్లో మిగిలిన రోదనా ప్రవాహాన్నీ, రెక్కల టపటపల గమకాన్ని పలికించే పిచ్చుకల అదృశ్యాన్నీ ..... ఒకటేమిటి బొల్లోజు బాబా అనుభవ సాంద్రతలోని అణువణువు కవిత్వమై పరిపూర్ణంగా వికసించే మెట్టు ఎక్కడానికి సిద్ధంగా ఉంది. మానవత్వపు సారాంశంలో స్పందించే గుణం పుష్కలంగా వున్న బాబా మరింత గాఢత సాధించే దాఖలాలు ఇందులో చాలా ఉన్నాయి.

కవి, చరిత్రకారుడైన తండ్రి బొల్లోజు బసవలింగం (సువర్ణశ్రీ) వారసత్వాన్ని అంది పుచ్చుకున్న బాబా గొప్ప నమ్మకాన్ని వాగ్దానాన్నీ ఈ తొలి కవితాసంపుటి ద్వారా ఇస్తున్నందుకు మనసారా అభినందిస్తున్నాను. ఒక గమ్యం దిశగా బాబా పయనం పురోగమించగలదని ఆశిస్తున్నాను.

దాట్ల దేవదానం రాజు

యానాం 4-9-09

ఆకుపచ్చని తడిగీతం

మేఘాలూ నేలా
రాత్రి చుంబించుకొన్నట్లున్నాయి.
తెల్లవార్లూ వాన కురుస్తూనే ఉంది.

నల్లని మంచుగడ్డ కరిగిపోయింది.
నిశ్చల తరువుల్లోకి ప్రాత్ణ కాలం
తడితడిగా ప్రవేశించింది.
వందగుమ్మాలతో వెదురుపొద
స్వాగతం పలికింది.

సూర్యకిరణాల కిలకిలారావానికి
లిట్మస్ పేపర్‌లా ఆకాశం రంగు మారింది.

తీగమొక్కలు జారిపోయిన పట్టును
మళ్లా వెతుక్కొంటున్నాయి.
తడినేలపై పడి పరావర్తనం చెందిన
లేత కిరణాలు, ఆకుల క్రింద దాక్కొన్న
చీకటిని తరిమేస్తున్నాయి.

చెట్లధూళి వానగుంటలలో చేరి
ఆకుల అందాలను చూస్తూ విస్తుపోతూంది.

మబ్బు అంచుల జరీ మెరుపులతో
పోటీపడే ఈకలకోసమై
ఓ పక్షి శ్రద్ధగా ప్రీనింగ్ చేసుకొంటూంది.

తలంటుకొన్న యవ్వనిలా శోభిస్తున్న

పొగడచెట్టు గాలికిరణాలలో
పత్రాలను ఆరబెట్టుకొంటూంది.

ఉదయపు గొంతులోంచి
ఆకుపచ్చని తడిగీతం
రెక్కలుకట్టి ఎగురుతూంది.
మేఘాలవతల వరకూ
సౌందర్యం పరుచుకొంది.

తటాకం అంతవరకూ భద్రంగా
దాచుకొన్న తామరదుంపకు
కొత్తచిగుళ్ళు లేస్తున్నాయి
నేల ఆలపించే ప్రాచీనగీతాన్ని చిత్రించటానికై.

******

తడిసిన సీతాకోకచిలుక
కవిత్వంపై వాలి రెక్కలల్లార్చింది.

వెన్నెల నావనెక్కి

హేమంతోత్తరీయాన్ని కప్పుకున్న వనం
ఆకుల కొనల వేలాడే
మంచు బిందువుల భారాన్ని
మోయలేక అలసిపోతోంది.

రాలిన పూలను తురుముకొన్న కాలిబాట
సుగంధాలను గానం చేస్తోంటే
ఇరువైపులా ఉన్న తరువులు
తన్మయత్వంతో తలలూపుతున్నాయ్.

రాత్రి వలలో చిక్కుకున్న పక్షులు
వేకువ జ్ఞాపకాలను స్వప్నిస్తున్నాయి.

నిదురించే లోకం కోసమై
ఆకాశం చుక్కల పహారా పూయించింది.

నిద్రలో శిశువు పెదాలపై
పరచుకొనే నవ్వులా చందమామ
నిర్మలంగా, స్వచ్ఛంగా, ప్రకాశంగా వెలిగిపోతోంది.
చందమామ చుట్టూ ఊదారంగు వరద గుడి
కాంతి రహస్యాలను నాట్యం చేయిస్తోంది.

కనబడకుండా వినిపించే కీచురాళ్ళ కవిత్వానికి
నిశ్శబ్దం మధ్య మధ్యలో ఆహా, ఓహో అంటోంది.

మల్లె ఛాయ వెలుగులో తిరుగాడే మిణుగురులు
పగలు వెలిగే వీధి దీపాల్లా వెలవెలబోతున్నాయి.

సెలయేటి నీరు గులక రాళ్ళతో గలగలా మాట్లాడుతూ
త్రోవ వెంబడి వడివడిగా ప్రవహిస్తూంది.

సముద్రాల కబుర్లనీ, మేఘాల ఊసుల్ని
వానచినుకుల ముచ్చట్లనీ, కల్మషం లేకుండా
చెప్పుకుపోతూన్న అలల పలుకుల్ని
చెవులు రిక్కించి సంభ్రమంతో వింటోంది.
సుమపాత్రికలోని మకరందం.

గవ్వ గుండెలో గిరికీలు కొట్టినప్పటి వడిని
ఇంకా కోల్పోని గాలి వయ్యారంగా
వనమంతా కలియ తిరుగుతూంది.

వెన్నెల నావనెక్కి
రాత్రి ఒంటరిగా సాగిపోతోంది
వేకువ తీరానికై.

సాక్షి ఆదివారం అనుబంధం 3, నవంబరు 2008

సెలవుల్లో కాలేజీ

సెలవుల్లో కాలేజీ
పక్షులెగిరి పోయిన వేడాంతంగళ్ లా ఉంది.

ఇసుక తుఫానులో తడిసిన
ఖర్జూరపు చెట్టులా
కాలేజీ గదుల కళ్ళపై ధూళి పొర
పరుచుకొంది.

సరస్వతీదేవికి నిద్రా భంగం కాకూడదని కామోసు
ఇస్మాయిల్+ నడచిన చెట్టుపై చిలుకలసందడి
విరామం తీసుకుంది.

ఉపన్యాసాల పావురాళ్ళను
ఎగరేసే తరగతి గదులు
నిర్జించిన పక్షిగూళ్ళై
నిశ్శబ్ధాన్ని ధరించాయి.

తమపై వ్రాసిన ప్రేమరాతలను
చదువుకొంటున్న చెక్కబల్లలు
వసంతంలో భ్రమరాలతో తమ సరాగాల్ని
తలపోసుకొంటున్నాయి.

సెలవుల్లో కాలేజీ మొత్తం
విత్తనాలకై ఎండబెట్టిన బీరకాయలా
పొడిపొడిగా ఉంది.

కోతకోసిన వరిచేను దుబ్బుల
జీవరాహిత్యం గ్రవుండులోని
పాదముద్రలలోకి ప్రవహించింది.

విద్యార్థులేని కాలేజీ
తలతెగిన వృక్షంలా, వృక్షాల్ని నరికిన వనంలా
వనాల్ని మింగిన శిశిరంలా ఉంది.
అచ్చు
పగలుచూస్తే రాత్రి కవితలోకొచ్చేలా!

+ప్రముఖ కవి ఇస్మాయిల్ గారు ఈ కాలేజీలో పనిచేసారు.

మట్టి కనుల నా పల్లె

అపరిచిత ప్రపంచంలో బతకడం అంటే
వసంతాన్ని పారేసుకొన్న తుమ్మెద
ఎడారి కన్నులపై వాలటమే!

ఏ కరచాలనాల ప్రారంభం
ఏ ఆత్మ స్నేహాల వాకిళ్ళు తెరుస్తుందో లేక
పరుచుకోబోయే ఏ విషజాలం అవుతుందో
తెలియని స్థితి.

అపరిచిత ప్రపంచంలో బతకటం అంటే
జీవితాన్ని అవమానం స్థాయిలో లాగించేయటమే.
ప్రసవించే స్త్రీ, ఆ వేదనలో ఎంత ఒంటరో
అంతే ఏకాకితనం ముసురుకుంటుంది.
మహా సంద్రంలో ఒంటరి నావికుని
మనో రోదనను ఏ ప్రవచనాలు
శాంతింపచేయలేవు.

అపరిచిత ప్రపంచంలో బతకటం అంటే
మబ్బుల మధ్య గుంపునుకోల్పోయిన
కొంగపిల్ల తుమ్మ చెట్టుకు గాయమై
వేలాడడమే!

ప్రజా సమూహపు సానరాయిపై
గంధపు మాటల చెక్కని అరగదీసి అరగదీసి
నా గుండెకు పరిచయాల లేపనాన్ని పూద్దామంటే
గుండె కనపడదే!

ఒక వేళ
నెరళ్లు తీసిన నా పల్లె మట్టి నయనాల్లో
ఉండి పోయిందా?

ఆంధ్రభూమి సాహితి – 3 నవంబరు 2008

నువ్వు నువ్వే - నేను నేనే

నేనో పాతిక సంవత్సరాలపాటు
వెతికి వెతికి నిన్ను చేరుకుంటాను.
నువ్వో ఇరవై వసంతాలలో నాకై
చూసి చూసి నన్ను ఆహ్వానిస్తావు.

అంతవరకూ మనం జీవించినకాలమంతా
నిలువునా కుప్పకూలుతుంది.
సహజీవనమనే కొత్త వేషం కడతాం.

శరీరాలు ఒకదానినొకటి
ఎంత వెలిగించుకొని కరిగించుకొన్నా
ఎవరి పరిమళాలు వారివే!

ఎన్ని సాంత్వనలూ, ధైర్యాలూ,
ఓదార్పులూ ఇచ్చి పుచ్చుకొన్నా
ఎడారులూ, ఎడారులకొనల వేలాడే మృగతృష్ణలూ,
నీవి నీవే! నావి నావే!

ఇరువురి ఆశల్ని, ఆశయాల్ని
ఎంత ఒకే తెరపై చిత్రించినా
ఎవరి వర్ణాలు వారివే!

తమ బరువుని తామే
మోసుకుతిరిగే మేఘాల్లా
ఎవరి శ్వాస భారాన్ని వాళ్ళే మోసుకోవాలి.

సముద్రం తరపున నీళ్ళు వకాల్తా తీస్కొని
ఎట్టైతే ఆటుపోట్లని సృష్టించలేదో

అలాగే
ఒకరిదప్పిక, ఆకలి, నొప్పులను
మరొకరు పూరింపలేరు.

ఎన్ని రోజులు కలిపిమండించినా
ఎన్ని రోజాల్ని కలిసి పండించినా
నువ్వు నువ్వే, నేను నేనే.
నేనే నువ్వు అనుకోవటం
నువ్వే నేను అనుకోవటమంత మాయ.

అయినా సరే
లోకం దృష్టిలో మనిద్దరిదీ
ఎప్పటికీ అనోన్యదాంపత్యమే.

ప్రాడిగల్ సన్స్

కాలేజీ చదువులకని
ఇల్లు విడిచిన పిల్లలు
ఇంకా తిరిగిరాలేదు.

వృద్ధాశ్రమంలో అంతా బాగానే ఉంటుంది.
వేళకు తిండి, వైద్యం, కాలక్షేపం
కానీ
మెలకువ నిద్రపొడవునా వ్యాపిస్తూంటుంది.

చలిచేతుల్ని
అనుభవాలచుట్టూ వేసి
వెచ్చ చేసుకోవాల్సిందే.
జ్ఞాపకాల్ని వింటూ కొవ్వొత్తి
రాత్రిలోకి వలికిపోతుంది.
కాలంనిండా ఘనీభవించిన చీకటి.

ఇసుక గడియారంలోని
ఒంటరి ఎడారి ధార
భారంగా జారుతూంటుంది.

గాలితన బరువుని
చెట్లపై ఈడ్చుకుంటూ సాగుతూంటుంది.

పాద ముద్రలను
కెరటం నోట కరచుకు పోయింది.
మౌనం పంజరంలా
దేహంపై దిగింది.

కాలేజీ చదువులకని
ఇల్లు విడిచిన పిల్లలు వచ్చారు.

ఆవకాయ్.కాం అక్టోబరు 24 2008

నీ జ్ఞాపకాలు.......

విరగ కాచిన వెన్నెల్లో
మరొక్క పొగడపువ్వు కూడా
పట్టేట్టు లేదు.

రాత్రయితే చాలు
ఋతువు తప్పని
వలస పక్షుల్లా
నీ జ్ఞాపకాలు
హృదయంపై వాలతాయి.

హృదయతరువుపై
మరొక్క వసంతంకూడా
పట్టేట్టు లేదు.

చుంబనంలో
మోహావేశంతో
మూసుకొన్న
కన్నియ నయనాల్లా
హృదయం తీయగా
వణుకుతుంది.

పొగడపూల పరిమళంలో
వెన్నెల జలకాలాడుతుంది.

ఒకానొక రెడ్ లైట్ ఏరియా

ఆ నాలుగురోడ్ల కూడలి
పరాకాష్టకు చేరుకొన్న ఒకానొక
వికృతక్రీడ యొక్క భీభత్సావృత కూపం.

జీవితం లైంగికంగా వ్యాప్తిచెందే
అంటురోగమయినచోట
కన్నెలు మల్లెలవుతాయి
మల్లెలు కత్తులవుతాయి.
ఇక్కడ స్త్రీ చర్మం గజాలెక్కనా
గంటల్లెక్కనా వ్యాపారం చేయబడుతుంది.
ఇక్కడ అసూర్యంపశ్యల మాంసం
దేహాల్లెక్కన వడ్డీకి తిప్పబడుతుంది.

వర్ణ, వర్గ, కుల, మతాలనబడే
సభ్య సమాజపు శిలాతెరలు ఇక్కడ
దేహాలమధ్య మంచుపొరలు.
కిలికించితాలు, చెక్కిళ్ళ సిగ్గుదొంతరలు,
సుఖమనిపించే విరహాలు, పరిష్వంగపు పులకింతలు,
అన్నీ ఇక్కడి జీవన పరాజితుల
గుండెల్లో కలల శిలాజాలు.

ముత్యం భస్మమయినట్లు
స్వప్న యవ్వనం కాలిపోగానే, వాస్తవం
అనకొండలా మృత్యుకౌగిలించుకుంటుంది.

పింప్‌లు పిండుకోగా ఈ స్తనాల్లో
మిగిలింది రక్త గడ్డలొక్కటే.
నిత్యం వందల డైనోసార్ పందుల

రత్యనంతరం ఈ దేహాల్లో మిగిలేది
రోదనా ప్రవాహమొక్కటే.
ఈ కసుగాయల చెక్కిళ్ళు చిదిమితే
కారేది పాలు కాదు, ఎయిడ్స్ మాత్రమే.
ఈ ఎడారి కొమ్మలు పుష్పించేదిక
వేదనల బూడిద మాత్రమే.

ప్రపంచ ప్రాచీన వృత్తి ఇక్కడి
ప్రణయోనులకు జీవనాధారమై
అదే మృత్యుదాతయై విరాజిల్లుతూంది.

(ఒకానొక రెడ్ లైట్ ఏరియాను చూసి)

సార్ గారండీ......... సార్ గారండీ......

శరీరం మీంచి బాల్యం అదృశ్యమౌతుంది.
దేహంపై యవ్వనం నూనూగుగా మొలకెత్తుతుంది.
దానిగొంతుక వింతైన జీరతో
'సార్ గారండీ, సార్ గారండీ' అంటుంది.

ఆ మాధుర్యానికి ఒక జీవితాన్ని అర్పించుకోవచ్చు.
ఆ అభిమానానికి ఒక హృదయాన్ని అంకితమీయవచ్చు.

వాడు నిర్మించుకొనే వ్యక్తిత్వ హర్మ్యానికి
మేలిమి ఇటుకలను ఎంచి వాడి కందిస్తాను.
వాని ఆలోచనల చురకత్తులు
పదును పెట్టుకోవటానికై
నా మెదడును సానరాయిని చేస్తాను.

పరస్పర వైరుధ్యాల అరణ్యంలో
వాడు దారితప్పి కునారిల్లినపుడు
నా అనుభవాల్ని దిక్సూచిగా చేసి బహూకరిస్తాను.

రసాయినోద్రేకాల ప్రళయకాలంలో
అయితే కుంభవృష్టి లేతే చంద్రగాడ్పులు
తప్పు మధ్యస్థమెరుగని వాడి మనసుకు
ఉదయ లేకిరణాల్ని, వేసవి సాయంకాలాల్ని
మంచుసోనల్ని, వెన్నెల రాత్రుల్ని
పరిచయం చేస్తాను.
ఒక తరం తన నడతను ప్రసవించుకొనే వేళ
నేను మంత్రసాని నౌతాను.
✼✼✼✼✼✼

ఈ దేహం కలిసిపోయే లోపు
ఎప్పుడో, ఎక్కడో వాడు కన్పించి
'బాగున్నారా మాష్టారూ' అంటాడు.
అంతకు మించింకేం కావాలీ జీవితానికి.

ఈమాట వెబ్ పత్రిక నవంబరు 2008

సిక్స్ పేక్ హృదయం

ఆల్చిప్ప కన్నుతో
మామిడి చెక్కు ఒలిచినట్లుగా
జ్ఞాపకాల ఒక్కోపొరనీ
ఒలుచుకుంటూ పోతే
చివరకు ఒక స్ఫటిక సదృశ
కన్నీటి బిందువు మిగిలింది.

నీ అనంతశయనపు
చిత్తరువుని చూస్తూ
నే రాల్చుకొన్నదే!
దీని తస్సాదియ్యా! అదింకా ఉందా?

చీకటిని రెండుచేతులతో
బలంగా తోసుకుంటూ
ఎంతదూరం వచ్చేసానూ!

వెలుతురు శబ్ధాల్ని కళ్ళతో
భారంగా పీల్చుకుంటూ
ఎంత కాలాన్ని ఊదేసానూ.

నీడల్ని మాత్రమే ప్రతిధ్వనించే
కాల లోయల్లోకి ఎన్ని రోజువారీ
వెర్రి కేకల్ని గుమ్మరించానూ!
ఎంతైనా
ఇది సిక్స్ పేక్ హృదయం కదా!

ఒక జ్ఞాపకం

ఏకాంత సాయింకాలపు పలుచని వెలుతురులో
హృదయంలో విరిసిన సన్నజాజుల గానంలా
ఓ జ్ఞాపకం హాయిగా సలుపుతుంది.

దాచిన రహస్యాలను విప్పిన నూత్న యవ్వన వనాల
పరిమళాలు విరజిమ్మే శీతాకాల రాత్రులలో
నీ సాంగత్యపు కొలిమిలో నన్ను నేను
వెచ్చచేసుకొని, కరిగించుకొని మరిగించుకొనే క్షణాన
వర్షించిన సౌందర్యానందం నిన్నూ నన్నూ
ఆకాశపుటంచులవరకూ విసిరికొట్టిన
జ్ఞాపకం హాయిగా సలుపుతుంది.

రొచ్చులు, రోతలూ, రేషన్లు, నెలసరి వాయిదాలూ,
ఇంకా కబళించని రోజులలో
వెన్నెల పిట్టలు వాలిన పొగడ చెట్టు క్రింద
రాలిపడే పొగడపూల వానలో తడుస్తూ
పెదవులతో దేహ వీణియలను మీటుకుంటూ
ఆ గానలోకంలో విచ్చలవిడిగా విహరించి
కనిపెట్టిన రహస్యాలను దాచుకొంటూ
దోచుకొంటూ, పంచుకొంటూ పరువులిడిన దూరాల
జ్ఞాపకం హాయిగా సలుపుతుంది.

పోటీలు, పోలికలూ, పథకాలు, పన్నాగాల వలల్లో
ఇంకా చిక్కుకోని ఆ అకలుషిత దినాల్లో
పట్టుకుచ్చులతో స్పృశించే నారింజ కాంతుల రాత్రిలో
వాంఛ, అంగీకారం పెనవేసుకొన్న క్షణాన
నీ కురుల మల్లియలను కాల్చేలా నా శ్వాస జ్వలించే వేళ
విచ్చుకొన్న పెదవులు, సగం మూసిన కనులతో

నీ సౌందర్యం మెత్తగా నా హృదయంపై పరుచుకొన్నప్పుడు
ఒక అదృశ్యహస్తం నిన్నూ నన్నూ ఎత్తుకపోయి
కాలరహిత, ఆలోచనారహిత, చేతనారహిత, స్థితిలో కప్పెట్టిన
జ్ఞాపకం హాయిగా సలుపుతుంది.

******

స్కూలు ఫీజ్ కట్టటానికి రేపేలోంది ఆఖరురోజు
సాయింత్రం చంటిదాన్ని హాస్పటల్ కి తీసుకెళ్ళాలి
జ్ఞాపకం హాయిగా సలుపుతుంది.
వాస్తవం ములు గర్రై పొడుస్తుంది.

ఆవకాయ్.కాం ఫిబ్రవరి 24 2009

జీవితం

కళ్ళు తెరచి చూసే సరికి
నేనో సమూహంలో నడుస్తూ ఉన్నాను.
ఇరుకైన బాటగుండా ప్రయాణం బాగానే సాగుతూంది.
కనుచూపు మేరలో బాట పొడవునా జనమే.
నా వెనుక సమూహం కొద్దికొద్దిగా పెరుగుతూ పోతోంది.
ముందూ వెనుకా నాలానే చాలామంది
కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.
అలాగని పెద్ద కష్టంగా ఏమీ లేదు.
నలుగురి మధ్యలో నడక అట్టే
అలసట అనిపించటం లేదు.
ఇంతలో ఒక సందేహం కలిగింది.
నా ముందాయన్ని అడిగాను
'ఈ బాట ఎక్కడికి పోతుంది' అని
నా వైపు అనుమానంగా చూస్తూ
'మరో పెద్ద బాటలో కలుస్తుంది' అన్నాడు తాపీగా.
'అదెక్కడికి పోతుంది?'
'తెలీదు' అన్నాడతను అసహనంగా.

అదిరి పడ్డాను.
గమ్యం తెలియని ప్రయాణం
అర్ధరహిత మనిపించింది.
ఎక్కడకు వెళ్తున్నామో కూడా తెలియనితనం
ఫక్తు అవివేకమనిపించింది.
సహజాతంగా కదలిపోతున్న సమూహం
మూర్తీభవించిన మూఢత్వంలా అనిపించింది.
గమ్యం తెలియని గమనం చేయాలనిపించలేదు.
'ఈ సమూహం నుండి బయటపడేదెలా?' అనడిగా.
మరో బాటన ప్రయాణం చేస్తున్నవాళ్ళను చూపుతూ

'ఇక్కడినుండి వెళ్ళిపోవాలనుకొనే వాళ్ళ గుంపు అది' అన్నాడు.
నేనా సమూహంలో కలిసాను.
ఇరుకైన బాటగుండా ప్రయాణం బాగానే సాగుతుంది.
కనుచూపు మేరలో బాట పొడవునా జనమే.
నా వెనుక సమూహం కొద్దికొద్దిగా పెరుగుతూ పోతోంది.

(Life is nothing but skipping from one routine to another అంటూ ఓ రాత్రంతా వాదించిన నా బాల్య మిత్రుడిచ్చిన స్ఫూర్తితో)

మా అమ్మాయి

నా భార్య స్వెట్టర్ అల్లుతోంది
రాబోయే బిడ్డకోసం.

ఇంట్లోకి వసంతం
పూవుల్నీ, సీతాకోకచిలుకల్నీ
సుగంధాల్నీ వెంటేసుకొచ్చింది.

ఆకాశం రాల్చిన పారిజాత సుమంలా
మా నట్టింట పాపాయి చందమామై వెలగసాగింది.

ఎదపై నడయాడిన మెత్తని పాదాలు
నెమలీక స్పర్శలను, గజ్జెల కవిత్వాన్ని
హృదయంపై వదిలిపోతాయి.
ముద్దు ముద్దు మాటలు
హృదయాన్ని చుంబించే వెన్నెల చినుకుల్లా
హాయి కాంతులు విరజిమ్మాయి.

చిన్నారి దేహం పుష్పించిననాటినుండీ
పూడికతీయని బావిలా
మా గుండె బరువెక్కుతూనే ఉంది.

ఏనుగాటలు, ఉప్పు మూటలు ఆడిన బాల్యం
హఠాత్తుగా అదృశ్యమై
నిలువెత్తు యవ్వనం ప్రత్యక్షమౌతుంది.
అది వాళ్ళమ్మనడిగి
స్వెట్టర్ ఎలా అల్లాలో నేర్చుకొంటూంది.

ఇల్లు నిర్మించుకోమ్మని పంపించివేసే వేడుకలో
అవసరాతీతంగా హర్షం వర్షిస్తుంది.

కలల రెక్కలు తొడుక్కొన్న పిల్లలకు
గూడు వీడ్కోలు పలుకుతుంది.

జననమప్పుడు తల్లి గర్భసంచి లోపొరను
గుంజుకుపోయిన బొడ్డుతాడులా
హృదయంలోకి చొచ్చుకుపోయిన
వేళ్ళని పెరుక్కొని పోతుందా పసుపుతాడు.

ఏకాంతంలోకి జారిన వర్తమానం
పల్లేరుకాయలా గుచ్చుకొంటూ ఉంటుంది.
అత్తరు అద్దిన శాలువా పెట్టె
తెరచినపుడల్లా జ్ఞాపకాల పరిమళాలు
కువకువలాడుతూ ఎగురుతూంటాయి.
స్వప్నదారులలో గజ్జెల సవ్వడి
ఎంత ప్రయత్నించినా నిద్రపోనివ్వదు.
++++
ఇంతలో ఒక శుభవార్త
మా అమ్మాయి స్వెట్టర్ అల్లుతోందట.

అన్నీ ఒకేలా ఉంటాయి

ప్రతీదీ ఎక్కడో చూసినట్లే ఉంటుంది.
ఎప్పుడో అనుభవించినట్లే ఉంటుంది.

అన్నీ ఒకేలా ఉంటాయి.
ఉదయాలు, మరణాలు
విజయాలు, వేదనలు
ఎత్తుగడలు, దొరికిపోవటాలు
కలలూ, కన్నీళ్ళూ, బంధాలు, ప్రేమలూ,
అన్నీ ఒకేలా ఉంటాయి.

ప్రతీదీ ఎప్పుడో ఒకప్పుడు
స్వప్నించినట్లే ఉంటుంది.

అవును, కాదు
కావొచ్చు, అప్పుడప్పుడూ,
లాంటి మాటల మధ్య జీవితం
గానుగెద్దులా తిరుగుతుందన్న విషయం
ఎపుడో ధ్యానించినట్లే ఉంటుంది.

పంజరపక్షి పదే పదే వినిపించే గానంలా
జీవితం కనే కలలు
ఎప్పుడూ ఒకేలా ధ్వనిస్తాయి.

ఏం చదివినా
అవే అక్షరాలు, అవే అర్థాలు
పునరావృతమైనట్లే అగుపిస్తాయి.

ఆఖరుకు
కాలం దిబ్బపై మొలచిన
పిచ్చి మొక్కలు కూడా
క్లోన్డ్ సంతతిలా అనిపిస్తాయి.

కవితా! మాసపత్రిక నవంబరు 2009 సంచిక

సౌందర్యం

సెలయేటి ఎగువన ఎవరో
నీటిలో వెన్నెల బిందువుల్ని
కలిపారు.

సెలయేరు పొడవునా వెన్నెలే!

నీరు తాగాలని వంగితే
దోసిట్లో చందమామ.

కవితా! మాసపత్రిక డిసెంబరు 2008 సంచిక

పక్కింటబ్బాయి ఆత్మహత్యాయత్నం

మా పక్కింటబ్బాయి
నిన్న రాత్రి ఆత్మహత్యాయత్నం చేసాట్ట.
'పరామర్శించటానికై' వెళ్ళా
ఏరా అబ్బాయ్ ఏం జరిగిందీ అంటే
మధుకలశం విషపాత్రికైందన్నాడు.
సైకత సౌధాలను గాలిమమ్మ తన్నుకుపోయిందన్నాడు.
కనిపించని గోడలకు గుద్దుకొని ఆలోచనలు
ముక్క ముక్కలై రాలిపోయాయన్నాడు.
అలా వాడు ఎవేవో అంటూనే ఉన్నాడు.
నేనేం మాట్లాడలేదు.
వాడి భుజంపై చేయివేసి
'పదరా అబ్బాయ్ అలా లోకం చూసొద్దాం'
అంటూ బయటకు తీసుకొచ్చాను.

******

తల టైరుక్రింద కొబ్బరికాయై 'ఠాప్' మని పగలగా
దేహం ప్రశాంతంగా పవళిస్తూఉంది.   పక్కనే
ఓ మనసు అప్పటికే సహగమనం చేసేసింది.
మృతుని కూతురి లేత యవ్వనాన్ని అద్దెకు తిప్పటానికై
కొన్ని కళ్ళు పథకాలు రచిస్తున్నాయి.

దగ్ధభోగీ లోంచి దింపిన, పచ్చి కట్టెలా పూర్తిగా కాలని
దేహాలు ప్రశాంతంగా పవళిస్తూ ఉన్నాయి. పక్కనే
ఓ తల్లి తన కొడుకు దేహం కోసం వెతుకులాట.
కాలిన కొడుకు దేహాన్ని అప్పటికే లక్ష సార్లు చూసినా
పోల్చుకోలేక పోవటం ఓ జీవితకాల విషాదం.

ఇంతకాలం ఆ వృద్ధదంపతులకు చేతికర్రై పరిమళించిన
కొడుకును కాన్సర్ కౌగిలించుకోగా
దేహం ప్రశాంతంగా పవళిస్తూనే ఉంది.   పక్కనే
వృద్ధ దేహాల్లోకి మెల్లగా నల్లని ఒంటరితనం ఎగబాకుతూంది.

సరిహద్దుల్లో వేయి ఫిరంగులు పేల్చిన
యోధుణ్ణి ఒక్క బుల్లెట్ ముద్దాడింది.
దేహం ప్రశాంతంగా పవళిస్తూనే ఉంది.   పక్కనే
ఒక కుటుంబం రెక్కతెగిన పిట్టలా
గిరికీలు కొడుతూ నేలకూలింది.
శోకంతో ఒక జాతిమొత్తం
ఒత్తికింది మైనంలా కరిగింది.

పాశవిక రేప్ అనంతరం పైశాచికంగా చంపబడ్డ విద్యార్ధిని
దేహం ప్రశాంతంగా పవళిస్తూనే ఉంది.   పక్కనే
ఆకాశమంత ఆక్రోశాన్ని, సముద్రమంత బాధనీ
జ్వలింపచేసుకొన్న హృదయచితి ఇంకా కాలుతూనే ఉంది.
నక్షత్రాలన్ని అశ్రుబిందువుల్ని రాల్చుకొన్న నేత్రాలు నెరళ్ళు తీసి
నెరనెరలో దిగులు మొలకలు లేస్తూనే ఉన్నాయి.

******

పార్థివ దేహాలెప్పుడూ
ప్రశాంతంగా పవళిస్తూనే ఉంటాయిరా అబ్బాయ్
నడిచే దేహాలు మాత్రరా ఆ అకస్మిక వియోగ
విషాదంలో ప్రయాణిస్తూనే ఉండాలి.

హఠాన్మరణం వెనుకే ఇంత విషాదం ఉన్నప్పుడు
బలవన్మరణం వెనుక ఇంకెంత ఉంటుందో తెలుసా నీకు?
నీ బాధల్నీ, దైన్యాన్ని, పగిలిన హృదయాన్ని
మరొకరిలోకి బట్వాడా చేస్తున్నావన్న విషయం నీకు తెలియదు.
నీ ఆక్రోశాన్ని, ఆవేదనను, భాధ్యతలనీ, జ్ఞాపకాలని
నీవు చేసిన శూన్యాన్ని
నీ వాళ్ళు జీవితాంతం మోసుకు తిరగాల్సిఉంటుంది.

******

మా పక్కింటబ్బాయి పశ్చాత్తాపం
వాని కళ్ళను నీళ్ళ మడుగు చేసింది.

బి.సి. అంటే ఎవరు నాన్నా

బి.సి. అంటే ఎవరు నాన్నా?
అని నా కూతురడిగినపుడు ఏమని చెప్పను?

అద్దకం పనిలో రంగుల్లోని సీసం
బొట్లు బొట్లుగా ఎముకల్లో చేరి
నిర్వీర్యమయినవాడని చెప్పనా లేక

బంగారాన్ని కొట్టి కొట్టి భుజం బంతిగిన్ని కీలు
అరిగిపోగా చేయి ఎత్తలేని స్థితిలో
పస్తులుంటున్న వాడని చెప్పనా?

ఆస్బెస్టాస్ రేణువులు ఊపిరితిత్తులను
తూట్లు పొడవగా దగ్గుతూ రొప్పుతూ
వాటినే తోలు తిత్తులుగా చేసి
కొలిమిని మండిస్తున్న వాడని చెప్పనా?

లోహపాత్రల ఇంద్రజాలంలో
తన జీవనాధారం మాయమవగా
మట్టిగరుస్తున్న మృత్తిక కళాకారుడని చెప్పనా? లేక

నరం తెగిన జీవితపు
రక్తాన్ని పీల్చే స్పాంజి పరుపు దాడిలో
దూదిలా కాలుతూన్న దూదేకులస్థుడనా!

సాయింత్రం తిరిగొస్తేనే బతికున్నట్టుగా
లెక్కింపబడే సముద్ర జాలరి దినదిన గండ జీవితానికి
పొడిగింపుగా మిగిలిన వారసుడని చెప్పనా?

ప్రమాదవశాత్తూ పట్టుతప్పి గాల్లో వేళ్ళాడుతూ
ప్రాణలొదిలిన గీతకార్మికుడని చెప్పనా?
సమాజానికే స్తన్యమిస్తూన్న యాదవుడననా లేక
దేహాలకో ఆకారాన్ని, అంతస్థునీ ఇచ్చే రజకుడననా?

ద్రోణాచార్యుడు ఒక వేలే అడిగాడు కానీ
పారిశ్రామిక విప్లవాచార్యుడు కోరిన
వేన వేళ్ళ దేహాల సంతతి అని చెప్పనా?

ఏమని చెప్పాలి నా కూతురికి
బి.సి. అంటే ఎవరని చెప్పాలి?
నేనెవరు అంటే ఏమని ఆవిష్కరించాలి?

శ్మశానంలా తీసుకోవటమే కానీ ఇవ్వటం తెలీని
ఈ సమాజానికి తరతరాలుగా అందిస్తూనే ఉన్న
ఈ జీవిని ఎలా నిర్వచించాలి?

ఒకే ఒక ఆశ చాలు........

వనంలో కార్చిచ్చు కదిలింది.
అగ్నికీలలు వేన వేల నాలుకలతో
ఊగిపోతున్నాయి.
చెట్ల ఆకులు, పూవులూ
పసివాడని మొగ్గలూ
మసివాడి పోయాయి.
పక్షులు ప్రశాంతతీరాలకై
ఎగిరిపోయాయి.
వేడిని తాళలేక
పులుగూ, పుట్రా పరుగులెట్టాయ్.

అరణ్యం అగ్ని దుప్పటి
కప్పుకున్నట్లుంది.
పచ్చని దృశ్య విధ్వంసం పూర్తయింది.
******
మనసుకు ఒక
అపజయం గుచ్చుకుంది.

వేన వేల నిరాశానీడలు
కదలాడుతున్నాయి.
స్వప్నాలు, సౌరభాలూ
మసివాడిపోయాయి.
సుఖ సంతోషాలు
విలాస విలాసాలకై ఎగిరిపోయాయ్.
నిస్పృహ బూడిద
హృదంతరంలో పరచుకొంది.

వెచ్చని దృశ్యం భళ్ళున బద్దలయింది.
******
ఆ మరునాడు
వనంలో మిగిలిన
ఒకే ఒక విత్తనం పగిలింది
పున్న సృష్టి జరపడానికై.

ఆ మరునాడు
మదిలో జనించిన
ఒకే ఒక ఆశ రగిలింది
పునరుజ్జీవనం ఇవ్వటానికై.

యూజర్ నేమ్: మనిషి - పాస్ వర్డ్: మానవత్వం

ఓ యూజర్ నేమూ, పాస్ వర్డూ ఇచ్చి
దేముడు నన్నీ లోకంలోకి దించాడు.
పాస్‌వర్డెక్కడ మరచిపోతానోనని
హృదయంపై పచ్చబొట్టుగా వేయించుకొన్నాను కూడా.

బాల్యం వరకూ హృదయం నాతోనే ఉంది.
ఆ తరువాతే కనిపించకుండా పోయింది.
ఎక్కడైనా పారేసుకొన్నానో లేక
ఎవరైనా ఎత్తుకుపోయారో నాకు గుర్తులేదు.
అక్కడినుండే కష్టాలు మొదలయ్యాయి.

పచ్చని తీరాలకై నే వలసపోయేప్పుడు
అప్పటిదాకా నన్ను రెప్పలా కాపాడిన
నాలుగు వృద్ధ నయనాల జల భాషను
డీకోడ్ చెయ్యలేక పోయాను– పాస్ వర్డ్ లేక.

కెరీర్ కడ్డం పడుతుందని
చిదిపించేసిన రెండునెలల పిండం
ఏదో చెప్ప ప్రయత్నించింది.
రాంగ్ పాస్ వర్డ్ ఆడియో ఫైల్యూర్.

'తాతయ్య పోయినపుడు నువ్వూ, పెదనాన్నా
ఎందుకు దెబ్బలాడుకున్నారు' అని
ఆర్థిక మర్మాలు తెలియని నా కూతురడిగినపుడు
పాస్ వర్డ్ మర్చిపోవటం వల్లేనని
చెప్పలేకపోయాను.

అంతెందుకు
శ్రీశ్రీ వర్ణించిన బిచ్చగత్తె ప్రతీరోజూ
నా ఒక్కరి ముందే చేయి చాపుతాది.
పాస్‌వర్డ్ లేదని పర్సు తెరచుకోదు.

అంతా తెలుస్తూనే ఉంది
కానీ ఏమీ చెయ్యలేనితనం.

జీవితం ఫోల్డర్ లోని శాంతి అనే ఫైలు
ఎంత ప్రయత్నించినా తెరుచుకోవటం లేదు.

దేవుడా!
దయచేసి నా పాస్ వర్డ్
రిట్రీవ్ చేసి పెట్టవూ?

పుస్తకంలోకి నడవటం అంటే......

ఎప్పుడో, ఎక్కడో, ఎవరో
ఒకడు
దోసెడు అక్షరాల్ని
కాలానికి అర్ఘ్యమిస్తాడు.
పిడికెడు ఆలోచనల్ని ఒడిసిపట్టుకొని
పుస్తకపుటలపై చల్లుతాడు.

ఎప్పుడో, ఎక్కడో, ఎవరో
ఒకడు
ఆ పుస్తకాన్ని తెరుస్తాడు.

ఒక జీవనది వాని గుండెల్లోకి
ప్రవహించటం మొదలౌతుంది.

ఒక సంగీతమేఘం
తేనె పాటల్ని వర్షిస్తూంటుంది.
ఆ రాగ స్పర్శకు వాని మనో యవనికపై
ఓ అపరిచిత అరణ్యం మొలకెత్తుతుంది.
వేన వేల స్వప్నాల పిట్టలు
రివ్వుమంటూ ఎగిరి వచ్చి
మనో వనాన వాల్తాయి.
వసంతపు మొగ్గలు
పువ్వులుగా బద్దలవుతాయి.
పరిమళపు భ్రమరాలు ఝుమ్మంటో
వాడిని చుట్టుముడతాయి.

దివా సంధ్యలు, గెలుపోటములు
సుఖదుఃఖాలు, రాగ ద్వేషాలు
అనుభూతి తరువులపై వాలిన
జంట పిచ్చుకలౌతాయి.

కెలడియోస్కోపులోని
రంగు రంగు గాజు ముక్కలల్లే
అవే అక్షరాలు అసంఖ్యాక చిత్రాల్ని
ఆవిష్కరిస్తూంటాయి.
ఒక నన్నయ, ఒక వేమన, ఒక గురజాడ
లిప్తపాటు మెరిసి మాయమవుతారు.

నవరసాలూ వాటి దేహాల్ని లాక్కొచ్చి
కనుల వాకిట నిలిపి
రసావిష్కరణ జరిపిస్తాయి.

శత సహస్ర శిరచ్ఛేద
ఖడ్గ పరిహాసం తళుక్కుమంటుంది.

తరాల్ని కలిపే రుధిరామృతం
కాలరేఖపై లీలగా జారుతుంది.

******

ఏదైనా ఓ పుస్తకంలోకి నడవటమంటే
పరిచిత పాత్రలలోకి
మనల్ని మనం ఒంపుకోవటమే కదా!

పెయింటరు

ఒకప్పుడు
గోడలు, బేనర్లు, సైన్ బోర్డులు
కటౌట్లపై వాడి సంతకం
ఆకాశం అంచున వేలాడే సూర్య బింబంలా
వెలిగిపోతూండేది.

నీలిమందు నీళ్ళల్లో ముంచిన పురికొస సాయంతో
వాడు గీసిన సరళ రేఖల మధ్య అక్షరాలు
గూటిలోని గువ్వల్లా ఒదిగిపోయేవి.

కుంచెలోని ఉడుత వెంట్రుకల మధ్య వర్ణాలు
సుశిక్షిత సైనిక కవాతులా కదిలేవి.

బేసిక్ కలర్స్ నుంచి డిరైవ్డ్ రంగుల్ని
సృష్టించటం వాడికి మాత్రమే తెలిసిన ఓ రసవిద్య.

అతడు గీసిన చిత్రాల ముందు
ఎవరెవరో పారేసుకొన్న
ఓ పది పన్నెండు కళ్ళూ, రెండు మూడు హృదయాలు
ప్రతీరోజూ తుడుపులో దొరుకుతూండేవి.
కొత్తవారికి వాడిరాతలు
నిశ్శబ్దంగా, నిర్దుష్టంగా దారిచూపేవి.

వాడి చెక్క పెట్టి నిండా రంగురంగుల డబ్బాలే!
ఇంద్రధనస్సుని నిలువునా చీరి
ఒక్కో ముక్కనీ ఒక్కో డబ్బాలో వేసుకొన్నాడా అనిపించేది.
పెట్టెలో వివిధ సైజుల్లో బ్రష్ లుండేవి.
సన్నని గీతనుండి, ఆకాశమంత పెద్ద రేఖ వరకూ

గీయటానికై.
వాని బట్టలపై, వంటిపై, హృదయంపై
చిలికిన రంగుల మరకలు
వాడికో గొప్ప దివ్యత్వాన్నిస్తున్నట్లు
మురిసిపోయేవి.

కానీ ఇప్పుడు
వినైల్ ప్రింట్లు, ఫ్లెక్స్ బేనర్లు
ఫొటోషాపులు, కోరల్‌డ్రాలు
అన్ని వైపుల్నుంచీ కమ్ముకొనే
శీతవేళలా వాడిని మింగేసాయ్.
వాడి ఉపాధి స్వప్నంలా జారిపోయింది.

వాని జీవితంలోకి
థిన్నర్ కలుపని చిక్కని నల్లరంగు ఎగజిమ్మింది.
ఎప్పుడో ఎక్కడో వాడు
రోడ్డుపై క్రీస్తులానో, సాయిబాబాలానో
కళాత్మకంగా మన దారి కడ్డంపడతాడు.
ఇంకేం చేయాలో తెలియక!

(పెయింటర్ మిత్రుడు కీ.శే. పట్నాల రమణ ప్రసాద్‌కు)

వెబ్‌పత్రిక తెలుగుజ్యోతి సెప్టెంబరు అక్టోబరు 2008 సంచిక

ఓ నా ప్రియ గృహమా!

(నే పుట్టి పెరిగిన ఇంటికి వెళ్ళినపుడు)

ఓ నా ప్రియ గృహమా!
నీ జుట్టులోకి వేళ్ళూన్చి నిమిరి
నాలుగేళ్ళవుతుంది.

నిన్నెంత ఇష్టపడుతున్నానో
నీ వియోగంలోనే క్లారిటీ వచ్చింది.
నీలోకి నడవటం అంటే
నా ఆత్మలోకం లో సంచరించటమే.

'రేపు మీ రిజల్ట్స్ వస్తాయట' తెలిసిందా అంటూ
నాన్నింకా బాధ్యతల్ని
గుర్తుచేస్తున్నట్లే ఉంది.
'వంటయిపోయింది వడ్డించేయమంటావా' అంటూ
అమ్మింకా కడుపు తడుముతున్నట్లే ఉంది.

కట్టె కాలగా మిగిలిన బూడిద రూపంలా గతం.
గోడల నిండా జ్ఞాపకాలు,
గదులనిండా అనుభవాలు.
నిశ్శబ్దంలోకి పురాస్మృతులు ప్రవహించాయి.
ఉద్విగ్నంతో గాలి వణికింది.

ఒక తరం వెళ్ళిపోయింది.
క్యూ కొంచెం ముందుకు జరిగింది.
ఒక శకం ముగిసింది.
కాలం ఆకుల స్వప్నాలు రాల్చుకుంది.

హృదయానికి వేలాడే జ్ఞాపకాలు
మనసుని చీల్చుకొని వచ్చే పాత గురుతులు
చెట్టు పీల్చుకొన్న సూర్యరశ్మెక్కడికి పోగలదు?

ఇక్కడే కదా
నిస్సహాయతకు, ఉత్సుకతకూ మధ్యెక్కడో
నా శైశవం పుష్పించింది.
ఇక్కడే కదా
భుజానికి తగిలించిన స్కూలు బేగ్‌కి
భుజానికెత్తుకున్న బాధ్యతకూ మధ్యెక్కడో
నా బాల్యం ఒలికిన అత్తరయ్యింది.
ఇక్కడే కదా
రసాయిన కల్లోల కడలికీ
నిశ్చల తటాకానికీ మధ్యెక్కడో
నా యవ్వనం శలవుతీసుకుంది.

కాంక్షా తీరాల వెతుకులాటలో
నే పోగొట్టుకొన్న గుప్పెడు మట్టిలో
నిన్ను నేను కోల్పోయాను.
కానీ
నీ సాంగత్య జాలంలో నా అస్థిత్వ శకలాలు
ఇంకా చిక్కుకొనే ఉన్నాయ్.

కొంచెం ఇటు తిరిగి ఏడవండి.

(కుటుంబ సభ్యుదు చనిపోగా ఆ షాక్‌లో దు:ఖంతో ఏడుస్తున్న ఒకరిని 'కొంచెం ఇటు తిరిగి ఏడవండి ప్లీజ్ ' అన్నాట్ట ఓ టీవీ చానెల్ రిపోర్టర్ – ఆంధ్రజ్యోతి దినపత్రిక 16/5/2008)

గుండె నెత్తిన పడిన పిడుగు రేపిన
బూడిదను కళ్ళు వర్షిస్తున్నాయి.
శోకతటాకానికి గండిపడి కన్నీటి మట్టం
ప్రమాద స్థాయిలను దాటిపోయింది.

విధి వెలిగించిన దుఃఖ జ్వాల
సర్వం దహించగా
రోదన వాసన గుప్పుమంటుంది.
ఏడుపు బాష్పవాయువై గదంతా పరచుకొంది.

ఇంతలో
'కొంచెం ఇటు తిరిగి ఏడవండి ప్లీజ్ ' అన్న నీ మాట
మానవత్వపు చన్మొనపై కాల్చిన మేకులా దిగింది.
జీవితపు కనుపాపపై మందుపాతరలా పేలింది.
కెమేరా కన్ను విస్తుపోయి చూస్తూండి పోయింది.

నాకు తెలియకడుగుతాను తమ్ముడూ
సెన్సేషన్‌ని, సెక్సుని, భక్తిని, భయాల్నీ లాగే
ఏడుపుని కూడా ప్రేక్షకులకు
అందంగా అందించాలనుకొన్నావా?

శోకం ఒక జ్వాలా ప్రవాహం
శోకం ఒక నిప్పుల ఉప్పెన
శోకం ఒక కుంభవృష్టి
పట్టి ప్యాకింగు చేయగలవా?

శంఖుస్థాపనలు, బహుమతి ప్రదానాలు,
నంగి ముంగి కబుర్ల ఇంటర్వ్యూలు,
కల్లబొల్లి మాటల ఉపన్యాసాలు తీసి తీసి
ఏడుపుని కూడా
మంచి యాంగిల్లో తియ్యాలనిపించిందా?

దుఃఖానికి ఏంగిల్ ఉండదు తమ్ముడూ
అదో మహావలయం
సర్వవ్యాపితం, సర్వశక్తి మయం.

నిర్మాల్యం

రాత్రి వేళలో నగరాల్ని శుభ్రంచేసే వారిపై)
ఒక పగలు ముదుసలై కాల గర్భంలో కలసిపోయాకా
వాళ్ళు రోడ్లపై గంగానదీ ప్రవాహమౌతారు.
మనమేమో
ఆ రోజు అనలేకపోయిన మాటలను
చెయ్యలేకపోయిన పనులను కలలు కలలుగా
నెమరువేసుకొంటూంటాం.
దేహం నిద్రాదేవి పొత్తిళ్ళలో పాపాయవుతుంది.
వాళ్ళు మాత్రం
నగరం విసర్జించిన నాగరికతను
ఏరిపారేస్తూంటారు.

నిషిద్ధ కారీబ్యాగుల్ని, వ్యర్ధజీవాల్ని, జీవ వ్యర్థాల్ని
పుటుక ధన్యమైందనుకొంటున్న సిగరెట్ పీకల్ని
గుట్కా సాషేల్ని, కిళ్ళీ పెంటికల్ని
కన్యాత్వాన్ని కోల్పోయిన కండోముల్నీ
మత్తు వదిలించుకొన్న మద్యం బాటిళ్ళని
చరిత్రలో కలసిపోయిన వార్తల శకలాల్ని
ప్లాస్టిక్ పువ్వుల్ని, నవ్వుల్ని, లవ్వుల్ని ఒకటేమిటి
నగరం విసర్జించిన నాగరికతను
వాళ్ళు ఏరిపారేస్తూంటారు.

దేవదేవుని ప్రసాదాన్ని అందరికీ తినిపించిన
పాలిథీను అడ్డాకుల్ని, భక్తిమైకు నిశ్శబ్ధతని
పిల్లవాణ్ణి స్కూలుకు వెళ్ళేలా చేసిన చాక్లెట్ల రేపర్లని
పెన్ను ముక్కల్ని, జ్ఞానభారానికి అలసిన కన్నీటి చుక్కల్ని
ఇంజక్షను సిరంజీల్ని, బాధల బేండేజీల్ని
అబార్షన్డ్ శిశువునీ, రక్తాన్ని, చీమునీ, దుఃఖాన్ని, దోపిడీని
ప్లాస్టిక్ విస్తరాకుపై మిగిలిన మెతుకుల్ని
వాహనాల గొంత్రుకు ఉక్కిరిబిక్కిరై
పండుటాకుతో కలిసి రాలిపోయిన పచ్చనాకునీ
ఒకటేమిటి
నగరం విసర్జించిన నాగరికతను
వాళ్ళు చీపుళ్ళతో, తట్టలతో ఏరిపారేస్తారు.

అపుడు నగరం స్నానం చేసినంత ఫ్రెష్‌గా తయారై
మరో రేపు (రేప్ ?) కి సిద్దమవుతుంది.

ఉదయగీతం

దినం యవ్వనంతో ఉన్నవేళ
పెదవులు హృదయ రహస్యాల్ని
దాచలేవు.
జాజుల వాసనకు తనువు
సాంద్రరూపమౌతుంది.
ప్రణయతేజం దేహాల్ని
ప్రకాశింపచేస్తూంటే
జ్వలిస్తూ, దహిస్తూ
తపిస్తూ, తరిస్తూ
వలపుల కొలిమిలో
జంటగా ద్రవించటం
సృష్టి రహస్య చామరం.

అచ్చంగా నాదే!

వనమంతా విచ్చుకున్న వసంతం
తేనెలో ముంచితీసినట్లుండే కోకిల గానం
యవ్వన నిగారింపుతో మిడిసిపడే సుమాలు
పుప్పొడి పూసుకొని మత్తుగా తిరిగే తుమ్మెదలు
ఇవన్నీ నావి మాత్రమే కావు
నాకు మాత్రమే సొంతం కావు.

ఉదయాన్నే తలుపుతట్టే వెచ్చని లేతకిరణాలు
మట్టి వాసనను గుప్పుమనిపించే సాయంకాలపు వాన
ఆకాశం అప్పుడప్పుడూ పుష్పించే వరదగుడులు
రాత్రికి తెరలేచింతరువాత చల్లగా వీచే వెన్నెల గాలి
ఇవన్నీ నావి మాత్రమే కావు
నాకు మాత్రమే సొంతం కావు.

నా గుండెలో సుళ్ళు తిరిగే
కలలు, కన్నీళ్లు, ఆశలు, ఆవేశాలు
నా చుట్టూ మొలచిన
బాధ్యతలు, బరువులు, బంధాలు, భయాలు
పూర్తిగా నావి మాత్రమే కావు.
వాటిలో దేవుడికి కూడా వాటాఉంది.

అయితే
నీకై దాచిపెట్టిన నా ప్రేమ మాత్రం
అచ్చంగా నాదే!
నీ పట్ల నేను చూపే సంకల్పం మాత్రం
స్వచ్ఛంగా నాదే!

మృత మన్ను

ఎన్నో భావాల్ని పలికించిన ఈ నేత్రాలు అభావమైన దృశ్యం
గాలిని పదాలుగా, నవ్వులుగా, ఆశలుగా, ప్రేమలుగా
మార్చిన ఈ స్వరతంత్రులు నిర్జీవమైన వేళ.......
ఇక ఈ చెవులు తీతువుపిట్ట సుదూరగానం వినలేవు.
వాన జల్లుల శబ్దాలను స్పర్శించలేవు.
ఈ వీధి గాయకుని అస్థిపంజరమిక
మట్టిపొరల క్రిందే పడి ఉంటుంది.
తన నీడల్లోకే నా నేస్తం కనుమరుగయ్యాడు.

ప్రజలందరూ వెలుగు ప్రపంచంలోకి ప్రవహిస్తుండగా
ఈ ఖాళీ రాత్రిలోంచి నీ జ్ఞాపకాలు ఉదయిస్తాయి.
ఆ నీడల మధ్య తచ్చాడుతూ నేను.......
హృదయంపై భోరున ఒకటే కుంభ వృష్టి.

వయసు పెరగడమంటే మనం ప్రేమించే వాళ్ళను
ఒక్కొక్కళ్ళనూ కోల్పోవటం కాదూ........
'బాధపడుతూ కూర్చుంటే జీవితం ఆగిపోదట
సాగిపోతూనే ఉంటుందట' ఎవరో అంటున్నారు.

బాధంటే లేకపోవటమే. లేకపోవటమే బాధ.
శూన్యంలో జ్వలించే అంతులేని నిట్టూర్పే బాధంటే,
జ్ఞాపకాలు అస్పష్టం కానంతవరకూ
బాధ ఓ సర్ప పరిష్వంగమే!
భావానికీ రూపానికీ మధ్య పరుచుకొనేదే వేదన
కలకూ వాస్తవానికీ దూరం చెరిగే వరకూ
వేదన ఓ దృతరాష్ట్ర కౌగిలే!

నాకు తెలుసు ప్రతి క్రియా నిర్దేశితమేనని
నాకు తెలుసు ఈ బాట ముగింపేమిటో
నాకు తెలుసు నేనూ క్షతగాత్రుల బృందంలో ఒకరినని
కాలం సముద్రంలా అన్నింటినీ తనలో కలిపేసుకోగలదని
అయినా జీవితమంటే సాయంకాలపు వ్యాహ్యాళి కాదుగా!

(మిత్రుని మరణంపై)

అతడు - ఆమె

అతడామెను
నడిచే చందమామ అని
పరుచుకొన్న వెన్నెలనీ
నిలచిపోయిన వసంతమనీ
వర్ణించాడు.

ఆమె నవ్వుని
పూల పరిమళంతో
సెలయేటి స్వచ్ఛత తో
రత్న కాంతుల సవ్వడితో
పోల్చాడు.

ఆమె కళ్ళను
బటర్‌ఫ్లై విప్పారిన రెక్కల ద్వయమనీ
ఆత్మలోక ద్వారాలనీ
రెండు పున్నమిలనీ
మిగిలిన దేహమంతా
ఆ రెండు కళ్లకూ పొడిగింపు అనీ
అన్నాడు.

ఆమె చూపుల్లో
ప్రేమలోక సంగీతముందనీ
కాంతులీను కరుణా ఝురులున్నాయనీ
అమరత్వానికి ఆహ్వానాలున్నాయనీ
అన్నాడు.

ఆమె మాటలు
నెరళ్ళుతీసిన నేల అడుగున

ఉండే విత్తును మొలకెత్తించే ఆర్ద్రతనీ
పరాజితుడిని కూడా అజేయుని
చేయగలిగే మంత్రమోహన శక్తులనీ
తేనె జలపాతాలు కుంచించుకుపోయి ఆమె
పెదవులపై తారాడే శబ్దతరంగాలయ్యాయనీ
ఎన్నో అన్నాడు
అతాడామె గురించి చాలా చెప్పాడు.

కాని ఆమె మాత్రం
ఒక చిరునవ్వు శాపమిచ్చి సాగిపోయింది.
తెరచాటు మనిషి కదా!

ఆస్పత్రిలో ఒక చావు

కట్లు తెంచుకొని ఓ హంస ఎగిరిపోయింది.
ఎళ్లిపోయావా అమ్మా
బతికినన్నాళ్ళూ మా కోసమే బతికి......
నిన్నటి దాక ఆమెను పనిమనిషిలాగ వాడుకొన్న
ఓ కొడుకు భోరు భోరున నటిస్తున్నాడు.

మిగతా రోగుల మొహాలపై
భయం యాసిడ్లా విస్తరించింది.
చావు వాసన వైరాగ్యమై, వేదాంతమై, కర్మ సిద్ధాంతమై
వార్డంతా మంచులా పరుచుకొంది.

ఓ ముసలాయన కళ్లు మూసుకొని
తనులేని ప్రపంచం ఎలా ఉంటుందో
కలల తెరపై చిత్రించుకొంటున్నాడు.

నాడాలు కొట్టబడుతున్న ఎద్దులా
నిస్సహాయంగా పడున్న పక్షవాత రోగి కనుగుడ్లు
బొట్లు బొట్లై ద్రవించినయ్...... అసూయతో.

'ఏయ్ అటువెళ్లకు' అంది ఓ పురటాలు
డాక్టర్ని చెయ్యాలనుకొంటున్న తన పెద్ద కొడుకుతో

'అందరూ పోతున్నారు కానీ వీడింకా పోడు' అని
ఓ రోగి బంధువు గుండె తన ద్రాక్ష గుత్తుల స్వప్నాలు
నిజమాయ్యేదెపుడోనని మూలుక్కుంది.

ఇద్దరికీ ఇంకా బేరం కుదిరినట్టు లేదు.
మృతురాలి బంధువు జేబు బరువుగానూ
వార్డుబాయ్ జేబు ఖాళీగాను ఉన్నాయి.

వాసన పసిగట్టిన ఓ శవాల రిక్షావాడు
తలుపుమూసిన వంటింట్లోకి ఎలా వెళ్లాలో తెలీని పిల్లిలా
ఎవర్ని కదపాలో తెలీక కిటికీ వద్ద తచ్చాడుతున్నాడు.

దూరంగా ఓ బైరాగి, తోలు తిత్తి ఇది తూటులు తొమ్మిది......
అంటూ తత్వం గొణుగుతూ మధ్యలో దగ్గురాగా
దగ్గరుకు మింగుతున్నాడు.

ఆసుపత్రి పక్కనే ఉన్న గబ్బిలం గదుల లాడ్జికి
ఎదురుగుండా ఉన్న మందుల షాపుకి
గోడకానుకొని ఉన్న రౌండ్ ది క్లాక్ హొటల్ కీ
ఉప్పుచేపలా వడలిన దేహంతో ఖాళీ సీసాలమ్మే ముదుసలికి
ఈ రోజుతో ఓ బేరం తగ్గిపోయింది.

దూరంగా చెట్టుపై వాలిన హంస ఓ సారి నవ్వుకొని
ఎగురుకొంటూ మబ్బుల్లో కలసిపోయింది.

తిరిగి భవిష్యత్తులోకే.......

నెత్తిన దిగే మేకుల్లాంటి బూతుమిళితపు ఆజ్ఞల్లో
నేల చూపుల కళ్ళు స్రవించే నెత్తుటి బూడిదలో
సముద్రపొద్దున గవ్వలేరుకోవాల్సిన
బాల్యమంతా క్షతగాత్రుని రోదనయినపుడు......

చందనపు పూతక్రింద చంద్రుని వెన్నెలతో
పోటీ వచ్చే మేని ఛాయై శోభిల్లవలసిన
యవ్వనాన్నంతా గోరింటాకు చేసి
విటుల కందరాలకోరలకు అద్దే పరిస్థితుల్లోనో లేక
కండరాల్ని సముద్రం చేసే ప్రయత్నంలోనో
రొచ్చుగుంటయిన దేహంతో
అంటించబడ్డ క్రొవ్వొత్తిలా
యవ్వనం రాత్రికి రాత్రి హతమైనప్పుడు........
కాలం ఊయలీకరించాల్సిన జీవితం
బాధల వృక్షానికి శిలువ వేయబడి
గాయాల్ని శ్వాసిస్తుంటే........

మీరాశించే పరిణతి మాకెక్కడ సాధ్యం?
మీరు శాసించే నాగరికత మాకెక్కడ లభ్యం.

అందుకే పచ్చబొట్ల వలువల్ని ధరించి
తిరిగి భవిష్యత్తులోకే మా పయనం.

8-11-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

ఎంతహాయి......

వేళ్ల అందాలని మట్టి క్రింద
కప్పెట్టేసిన చెట్టుదెంత స్వార్థం.

పక్షిపిల్ల సౌందర్యాన్ని
జిగురు జిగురుగా తనలో దాచేసుకొన్న
గుడ్డుదెంత జాణతనం.

అద్భుత శిల్పాలను గర్భంలో ధరిస్తూ
బండగా కనిపించే ఈ రాళ్ళెంత మొండివి.

ఈ రాత్రెంత మోసకత్తె కాకపోతే
వేకువని సూచనగానైనా తెలుపుతుందా.

అంతెందుకు నువు మాత్రం
మదినిండా నన్ను నింపుకొని
ఒక్క చిరునవ్వు చాక్లెట్టైనా ఇచ్చావా?
******
కలల కర్చీఫ్ తో గుండె కన్నీళ్లు
తుడుచుకోవటమెంత హాయి.

నిరీక్షణ

ప్రియా
అమలిన చింతనో లేక
అలౌకికానందమో తెలీదు కానీ
నీ వియోగంతో ఆత్మరహితమైన
ఈదేహాన్ని
నిరీక్షణలు నిరీక్షణలుగా
శిల్పీకరించుకోవటంలో
ఎంతానందముందనుకున్నావ్!

కొమ్మను తాకగానే పాటను
స్రవించిన కోయిలలా
చెమ్మను తాకగానే దళాల్ని
ప్రసవించిన విత్తనంలా.....
అత్యంత ప్రకృతి సహజంగా
నా ఈ నిరీక్షణా శిల్పాల మధ్య
తుమ్మెదల్లా
నీ జ్ఞాపకాలు తిరుగాడుతూంటాయి.

ఆకాశం తెరచుకొంది

చీకటి అలముకున్న త్రోవలో
హృదయనేత్రం వెలుగురేఖకై
తడుముకుంటోంది.

దూరం నుంచి వినిపించే
గాన మాధుర్యంతో
గాలిపరిమళిస్తోంది.
పరిమళోన్మత్తుడనై నేను
మూర్ఛనలు పోయాను.

ఆకాశం తెరచుకొంది.
ఒక్క విద్యుల్లత,
నూలుపోగులాంటి
ఒక్క మెరుపు మెరిసింది.
ఓవర్ ఎక్స్‌పోజ్ చేయబడ్డ ఫొటోలా
దృశ్యం తళుక్కుమంది.

అవ్యక్త స్వప్నాలను
స్థిరీకరించే వెలుగు
లిప్తపాటు జిగేల్ మంది.

అది నీ దరహాసమా ప్రభూ?

******

నే ధరించిన
దుస్తులు మాసిపోయాయి.
అబద్దాలు, దొంగనవ్వులు, మోసాలు
కపటప్రేమలు, ఈశ్వర ధిక్కారం
అనే మురికి చేరింది.

దుస్తుల్ని చిలక్కొయ్యకు తగిలించి
నీ ప్రేమ లీలామృతధారలకై
వెతుకులాట మొదలెట్టాను.
అన్ని ప్రశ్నలకూ సమాధానం
నీవని తెలుసుకున్నాను.
నే పుష్పింపచేసుకొన్న
నా అజ్ఞానం నాకు గోచరమయింది.
నీ ఒళ్ళోకి నన్నిచ్చేసుకోవటానికై చేసే
నిరీక్షణలో నే కూరుకుపోయాను ప్రభూ!

ఇంతలో
నీ అడుగుల మెత్తని చప్పుడు.
గాలి పరిమళించటం తెలుస్తోంది.
ప్రభూ
నీ సంజ్ఞతో కాబోలు
హృదయంపై వాలిన పిట్టలు
రివ్వున ఎగిరిపోయాయి.
ఇక హృదయవనంలో ఏ సవ్వడీ లేదు,
తీవ్ర తేజస్సుతో ప్రకాశించే నిశ్శబ్దం తప్ప.
ఇంతవరకూ లతల్లా పెనవేసుకొన్న
బంధాలు అంధకారంలో లీనమయ్యాయ్.

ఆకాశం తెరచుకుంది.
అమృత బిందువులుగా
నీ కరుణ వర్షించింది.
నా చుట్టూ వెలుగు,
ఆత్మను వెలిగించే వెలుగు
అంతశ్శాంతిని పంచే వెలుగు
భువంతా పరుచుకుంది.

అపుడు నాలోని ప్రతీమొగ్గా
వసంతమై ప్రవహించింది.
నాలోని ప్రతి శబ్దమూ
రాగాల రెక్కలను తొడుక్కుంది.
నాలోని ప్రతీ వర్ణమూ
రాగ రంజితమయింది.

ప్రభూ
నీ దయా పరిమళ స్పర్శ
నన్ను పారవశ్యానికి
శాశ్వత బంధీని చేసేసింది.
ఇక ఈ విపంచిక
నిన్నే గానం చేస్తో
వెలుగుని కప్పుకొన్న
పగలులా సంచరిస్తోంది.

******

అందరూ కన్నీళ్ళతో నాదేహాన్ని
ఓదారుస్తున్నారు – పిచ్చివాళ్లు
ఇది అభినందించాల్సిన సందర్భమని
ఎప్పటికి తెలుసుకుంటారు?

(........సారి చలం గీతాంజలి చదివిన మత్తులో)

టేబుల్‌పై చేతివాచీ

టేబుల్‌పై చేతివాచీ
నెలవు తప్పిన కలువలా ఉంది.

ఇది విచ్చలవిడిగా తిరిగిన దూరాల్లోంచి కానీ
అపురూపంగా చూసుకొన్న నడకల్లోంచి కానీ
ఒక్క అడుగుకూడా తిరిగి రాదు కదా!

దాని డయల్ నూతిలో
అనుభవాలు, జ్ఞాపకాలు, కాలపు తునకలు.
ఎంతజీవితాన్ని ముక్కలు ముక్కలుగా
కత్తిరించి ఉంటాయో కదా దీని ముళ్ళు.

టేబుల్‌పై చేతివాచీ
కాలంలా ముసలిదైపోయింది.

ఎంతకాలాన్ని
నిరీక్షణలు, నిస్పృహలు, అసహనాలుగా
పోతలు పోసి ఉంటుందో కదా ఈ వాచీ.

ఎన్ని టిక్కట్టు ముక్కల్ని చింపిందో,
ఎన్ని సిగరెట్ పీకల్ని రాల్చుకుందో కదా!
ఎన్ని నిలుపుకోలేని
వాగ్దానాల్ని పరిహసించి ఉంటుందో కదా.

టేబుల్‌పై చేతివాచీ
అపుడూ, ఇపుడూ అదే మోనాలిసా నవ్వుతో.

కాలాన్ని బంధించాననుకొన్నాడు మనిషి కానీ
దీని డయల్ ఊబిలో పీకలోతు కూరుకుపోయాడు.

టేబుల్‌పై చేతివాచీ
ఒకనాటి పెళ్ళికానుక.

ఒక వనాన్ని పొదుం చేయగల
ఒడ్రంగి పిట్ట ముక్కంత బలంగా
ఒక జీవితాన్ని పొడుచుకుంటూ
పోయిందీ ముల్లు గడ్ర.

టేబుల్‌పై చేతివాచీ
ఇల్లు ఖాళీ చేసేపుడు డ్రాయర్ సొరుగులో దొరికింది.
నాన్న పోయిన మూడో రోజున అది ఆగిపోయి ఉంది.
యుద్ధానంతరం విస్మరింపబడే సమరయోధునిలా.

ఈమాట వెబ్ పత్రిక జనవరి 2009

రెండు దేశాలు

బజారులన్నీ జనాలతో బలిసినయ్.
డబ్బు, డబ్బు, డబ్బు
కుంభవృష్టిగా కురుస్తూంది.
కొనుగోలు శక్తి మధ్యాహ్నపుటెండై
ప్రకాశిస్తోంది.

భాషతో నిమిత్తం లేకుండా
సర్వాంగాలతో సంభాషించే ఆటకత్తెలా
మూలాలకు దూరమైన ధనం
వింతైన నృత్యం చేస్తూంది.

ప్రపంచ కుబేరుల జాబితాలో మనవాళ్లు
ఏటా పెరుగుతున్న కోటీశ్వరుల సంఖ్య
లక్షల ఎల్కేజీ చదువులకై బారులుతీరిన జనం
అక్షయ తృతీయనాడు స్వర్ణ విస్ఫోటనం
రాడోవాచీలు, రేబాన్ అద్దాలు, పెద్దతెర టీవీలు,
కోట్లు పలికే విల్లాలు, రవ్వల దుద్దులూ, డిజైనర్ దుస్తులూ
డిజిటల్ దినాలు, పబ్బులూ, డిస్కోతెక్‌లూ, ఏరోడ్రోములు, హెలికాప్టర్లూ
చంద్రయానాలు, ఇంద్రభోగాలు, చలువరాతి హర్మ్యాలు.

నా దేశపు దరిద్రమంతా ఎక్కడికి పోయింది?

చేట లోని రోజుల శిశువు భయం భయంగా చూస్తూంటూంది.
బోరుబావిలో పడిన గ్రీజు మరకల బాల్యానికి ఊపిరాడదు.
కూరగాయల్ని కొనలేనితనం దాకలో చారై మరుగుతా ఉంటాది.
సెంటు స్థలం కోసమై పోరాడే ప్రాణాన్ని తూటా తన్నుకుపోతుంది.
అమ్మకానికి శిశువులు, ఇక్కడ స్త్రీ ఓ గర్భాగారం.
రోడ్డుపక్క దేరాలనిండా నిర్వాసిత గిరిజనులు.
హైవేపక్కన మెరుపుల చీర చెయ్యూపుతూంటుంది.

‘బ్లడీ బెగ్గర్స్ బ్లడీ ఇండియా’ బి.ఎమ్.డబ్ల్యూ కారు అద్దం పైకి లేచింది.

ద్రావకం మింగిన కంసాలి, నూలుపోగుకు ఉరేసుకొన్న నేతకాడు.
పురుగుమందూ పత్తిరైతూ, లాడ్జీలో కుటుంబం సెన్సెక్స్ హత్య

నా దేశపు సౌభాగ్యమంతా ఎక్కడికి పోయింది?

ఇక్కడ రెండు దేశాలు కనపడుతున్నాయి
ఒకటి సంపన్న భారతం
మరోటి దరిద్ర భారతం.

సూర్య నమస్కారం

ఈ రోజు కూడా సూర్యుడు బహుసా
ఆకాశపుటటెండెన్స్ రిజిష్టరులో
రెండు సంతకాలూ చేసేసి వెళిపోయుంటాడు.
మోరెత్తి సూర్యుడిని చూసెన్నాళ్లయిందో!

టన్నులకొద్దీ వెలుగుని కుమ్మరిస్తూ
దినాన్ని స్ఫటికంలా మెరిపించి
అనంతాంధకారాన్ని కలుగులోకి తరిమేసే
సూర్యుడిని పలకరించి చానాళ్ళయింది.

నీడలు, గోడలు, నేలను తప్ప మరొకటెరుగని కనులు
ధవళకాంతి రహస్యాలను పరిమళించలేవు.

గదుల్లోంచి, గదుల్లోంచి, గదుల్లోంచి, గదుల్లోకి జారే
దైనందిక ఇనుప క్షణాలలో
మసకవెలుతురే అన్నిచోట్లా రాజ్యమేలుతుంది.
చలువకనులజోడు కిటికీ కర్టెనై
కిరణ విహంగాల రెక్కలు కత్తిరిస్తుంది.

పడమటి నల్లబల్ల తన రంగుల్ని చెరిపేసుకొన్నాకా
మసకవెలుతురు మరింత చిక్కబడుతుంది.
******
అయినా భ్రమకాకపోతే కానీ
ఈ నగర జీవనాంధకారారణ్యంలో
కాంతి తన కిరణ పాదాలతో సంచరించగలిగే
ఆరుబయళ్ళెక్కడున్నాయి
ఇళ్ళమధ్య పిచ్చిగా పరుగులెత్తే రోడ్లుతప్ప.

వెలుగు రేకలు ఈతలు కొట్టటానికై
విశాలమైదానాలెక్కడున్నాయి
తేనెగూళ్ళ లాంటి ఇరుకు హర్మ్యాలు తప్ప.

నగర మనిషికసలు మోరెత్తి సూర్యుడ్ని చూసే
తీరికేదీ? ధైర్యమేదీ?

ఏమంటావూ?

సోక్రటిస్ తాతా!
చావు, బతుకులలో ఏది ఉత్తమ మార్గమో?
అంటూ గొప్ప సందేహాన్ని
మా మొహాలపై చల్లి పోయావు.
ఆ ప్రశ్నకు జవాబింకా దొరకలేదు.

కాల మౌనగిలిటిన్ అతిసున్నితంగా
తనపని చేసుకుపోతోంది తప్ప
ఇప్పటిదాకా నోరు విప్పనే లేదు.
ఏ ఒక్క ఆత్మా తిరిగొచ్చి
'ఇదీ సంగతి' అని చెప్పిన పాపానా పోలేదు.

మృత్యు పాత్రిక ఒంపులలో జీవితం
సుబ్బరంగా ఇమిడిపోతూనే ఉంది.

కొత్త అనుభవాలను, ఆలోచనలనూ
యాచించే భిక్ష పాత్ర
రోజూ ఉదయిస్తూనే ఉంది.

స్వప్నాల హంసలు ఖాళీ గాలిలోకి
అలా అదృశ్యమౌతూనే ఉన్నాయి.

తాతా
కొంపతీసి అంతా మిథ్యే నంటావా?
అన్నీ ఇక్కడే నంటావా?

ఆవకాయ్.కాం వెబ్ పత్రిక ఏప్రిలు 13 2009

ఒక వేకువ

కోడి కూసింది
ఈకల మెరుపు
ఆకశానికి విస్తరించింది.

చుక్కల్నీ చంద్రుణ్ణీ
చంకనేసుకొని రాత్రి
చల్లగా జారుకుంది.

పారిజాతం పూల
ఎర్రెర్రని గొట్టాల్లోంచి
ఎట్టకేలకు ఉదయసంధ్య
విడుదలైంది.

నిద్రగన్నేరు చెట్టు
ఆకుల పిడికిళ్ళు తెరిచి
కిరణాల గింజల్ని
ఏరుకోవటం మొదలెట్టింది.

చిత్రానికి కవిత

ఒక సన్నని గీత
మనో కాన్వాసుపై విస్తరించి
ఆకైంది, కొమ్మైంది, చెట్టైంది
కొండమలుపు వద్ద నదీ నడుం వంపైంది.

ఒక వర్ణ బిందువు
మది తెరపై వలికి
తూలికైంది, పక్షైంది, పక్షి గూడైంది
తల్లి హృదయమై ఆకలి తీర్చుతుంది.
చిత్రకారుడిది కవిదీ కూడా!

సాగరతీర సాయింత్రం

ఈ సముద్రం ఒక దట్టమైన నీలి కలువై
తన అలల రేకల అంచులతో
అచల ఏకాంత తీర సైకత మౌనాన్ని ముద్దిడి
తన హృదయలోతుల్లో జనించిన గవ్వల పుప్పొడితో
అభిషేకం చేస్తోంది, ఒకానొక ఆదిమ లాలస గా.

మానవజాతి కర్మ జలాలన్నీ
ఈ సువిశాల కాల పాత్రికలో
కెరటాలు కెరటాలు గా మరుగుతున్నాయి.

నిర్జీవ గవ్వల శూన్యపు హోరులో
సరుగుడు చెట్ల గాలి ఊళలపై
నీలాంబర పారదర్శకత పై
నిర్లిప్త శిలల మౌన చర్మంపై
ఈ లోతైన క్షణాల కలంతో
ఈ సాగర తీర సాయింత్రం తన
మృత్యు గీతాన్ని లిఖించుకొంటోంది.

సూర్యుని కొల్లకొట్టి పిటపిటలాడుతూ
ప్రకాశించిన పగలు పగుళ్ళు తీసింది.
ఆ పగుళ్ళలోంచి రాత్రి చీకట్ల మౌనం ఊరుతుంది.
చలితడి ప్రవహిస్తూంది.
వెలుగు వర్ణాలు కారిపోతున్నాయి.

వార్ధక్యంతో వంగిపోయిన
ఈ సాయింత్రానికవతల సుదూరంగా
వెన్నెల సంగీతంతోనూ, నిశ్శబ్ద అలల పరిమళంతోనూ
నా విభుని జ్ఞాపకమొకటి స్వప్న దారులలో
మిల మిలా మెరుస్తూ జ్వలిస్తూంది.

అంతరించిపోతున్న పిచ్చుకలపై........

నువ్విక్కడికి రావటంలేదంటే
ఎక్కడో ఉండే ఉంటావులే
అనుకున్నానింత కాలమూ.
అక్కడా లేవట కదా! మరెక్కడికి పోయావూ?

రెక్కల టపటపల గమకాల్ని పలికిస్తూ
మెరుపు వేగంతో అటూ ఇటూ ఎగురుతో
మా పచ్చని హృదయాలపై వాలే దానివి.

ఇంటిచూరుకు వేలాడదీసిన
వరికంకుల కుంచె ఓ నక్షత్రమై
నీకు ప్రేమగా స్వాగతం పలికేది.

నీ అవిశ్రాంత మైథున సంగీతానికి
ఊరు మొత్తం ముసిముసి నవ్వులతో
సిగ్గుపడుతూ మురిసిపోయేది.

చూరు అంచునో లేక మిద్దె కంతల్లోనో
నీవు నిర్మించుకొన్న స్వర్గం వైపు
ఎవరైనా తొంగిచూస్తే వాని తలపై గింగిర్లు కొడుతూ
అరుస్తూ నీవు చేసే హడావిడికి
గాలి కూడా బిత్తరపోయేది.

మట్టిలో పొర్లాడుతూ చేసిన ఇసుక స్నానాలు
చాతీపై నల్ల మచ్చతో నీ లైంగిక ద్విరూపకతా
పెరట్లో సస్య రక్షణ గావించిన నీ ఉక్కు ముక్కు
గాయపడ్డ నీ దేహాన్ని సంరక్షించిన మా బాల్యాలు
నా కిటికీ పై వాలి పాటలు పాడి తుర్రుమన్న
ఆ క్షణాలన్నీ, తమ గాలి పెదాలతో

ఈ పుస్తక పుటల్ని రెపరెప లాడిస్తున్నాయి.

పెంకుటిళ్లు నిద్ర పగుళ్ళలోంచి
కారిపోయిన స్వప్నాలైన వేళ
అవని మొహంపై రసాయినదాడి నేపథ్యంలో
సెల్ ఫోన్ రేడియేషన్ కనిపించని మృత్యు వలై
నిన్ను కబళించివేసిందా?

నువ్వు వస్తావని, గుడిలో శఠగోపమంత
అందంగా పేనిన వరికంకుల కుంచె
ఇంటి స్లాబ్ ఇనుప కొక్కానికి
కాశీ ఆవు ఐదో కాలులా వేలాడుతూ
మమ్ములను వెక్కిరిస్తూంది.
తరువాత 'మీ వంతు' అంటూ
భయపెడుతూంది.

అనుమానపక్షి

లేగదూడ
కట్రాట గుంజుకు పోయింది.
దాచేసుకొన్న పాలను
చేపుతుంది ఆవు.
దూడ మెడలో గంట
దొంగలిద్దరినీ పట్టించేసింది.

మట్టు పైని అణుగుకోడి
ముక్కుతో గుడ్లను మరోసారి
లెక్కెట్టుకొని, దగ్గరకు లాక్కొంది
.
ఆవకాయ్.కాం వెబ్ పత్రిక డిశంబరు ౨2008

నీవు లేవు.........

పక్షుల్ని, పండుటాకుల్ని, నా ప్రశాంత క్షణాల్నీ
ఈ పిచ్చి తుఫాను గాలులు వేటాడుతున్నాయి.
పక్షులు దారితప్పాయి.
పండుటాకులు నేలరాలాయి.
నా ప్రశాంత క్షణాల ఏకాంతం లోంచి
నువ్వూ అదృశ్యమయ్యావు.

చీకటితో పిటపిటలాడే తుఫాను రాత్రీ
నేనూ మిగిలాం ఇక.

ఆవకాయ్.కాం వెబ్ పత్రిక జనవరి 25 2009

కాలం

భవిష్యత్తంటూ ఏమీ ఉండదు.
అనంతమైన అవకాశాలన్నీ
వర్తమానంలోకి కుప్పకూలుతాయి.

వర్తమానమూ ఒక భ్రమే, ఎందుకంటే
దాన్ని చేరగానే గతంగా మారిపోతుంది కనుక.

గతం మాత్రమే నిజంగా నిజం.
జ్ఞాపకాల మచ్చలు, జీవితాన్ని నిర్దేశించే అనుభవాలు
కళ్లవెనుక కదలాడే నులివెచ్చని దృశ్యాలు
కళ్ళు మూసే దాకా వెంటాడుతూంటాయి.

స్వేచ్ఛ

చీకటి గదిలో కూర్చొని
సీసాలో బంధించిన
మిణుగురులను చూస్తూ
మురిసిపోతుంది మా అమ్మాయి.

ఆరుబయటకు వచ్చి
సీసా మూత తీసాను.
ఆకాశం సీసా నిండా మిణుగురులే!
చిన్నారి కళ్లలో వెన్నెల మెరుపు.

ఆవకాయ్.కాం వెబ్ పత్రిక డిశంబరు 19, 2008

సంవత్సరీకాలు

నీవిక లేవన్న వాస్తవానికి
చెట్టుతొర్రలో పక్షి పిల్ల ఆర్తనాదంలా
హృదయం కీచుమంది.

మెతుకు వృధా, బతుకు వృధా అంటూ
తీతువు పిట్ట అరుచుకొంటూ సాగింది.

ఆ లోహ క్షణాల రంపపు కోతకు
నిలువెత్తు జీవన వృక్షమూ
కన్నీరు చిమ్ముకుంటూ నేలకొరిగింది.

కాలం ఎంత చిత్రమైనది.
నీవు లేవన్న వాస్తవం
ఎంత నిశ్శబ్దంగా అదృశ్యమైంది.

కలలూ, కన్నీళ్లు
ధరలు, దరిద్రాల వంటి
దినసరి వెచ్చాల్ని ఖర్చు చేసుకొంటూ
ఎంత దూరం నడిచేసాను!

ఆవకాయ్.కాం వెబ్ పత్రిక నవంబరు 25, 2008

నైట్ షిఫ్ట్ కేబిన్ మాస్టర్

పట్టాలపై రైలు బండి
మిణుగురుల దండలా మెరుస్తోంది.

నిదురించే ప్రయాణీకులు
గమ్యాల్ని స్వప్నిస్తున్నారు.

అతను మాత్రం
నిద్రను నిలువునా పాతరేసి
ఎరుపు ఆకుపచ్చ కాంతుల చేతులతో
ప్రతి రైలునూ నిలుపుతూ, పంపుతూ ఉంటాడు.

అతనూపిన పచ్చ జండాకి
వేయి స్వప్నాల్ని కడుపులో మోస్తున్న
ఇనుప అనకొండా భారంగా కదుల్తుంది.

ప్రయాణీకులు నిదురలో గమ్యాల్ని
పలవరిస్తూ ఉంటారు.

నూట నాలుగు జ్వరంతో ఉన్న వాని కూతురుపై
కలిగిన ఆలోచనల్ని ఎక్స్‌ప్రెస్ రైలు
తన చక్రాల పాదాలతో తొక్కేస్తుంది.
ఇంటివద్ద సగం ఖాళీ గా ఉండే మంచపు తలపుల్ని
గూడ్సు బండి ఎక్కించుకు తీస్కుపోతుంది.
నిదురలో అతని మెడచుట్టూ చేతులు వేసి
దగ్గరకు లాక్కొనే జీవనానురాగాలకు
తనెప్పుడూ ఓ జీవిత కాలం లేటే.

ప్రయాణీకులు గమ్యాలలో
నిద్రించినట్లు స్వప్నిస్తూంటారు.

ఒక్కో రాత్రి అరవై, డబ్భై రైళ్లను పంపించి
తెల్లారేసరికల్లా తనో రైలు చక్రంగా మారిపోతాడు.

అదే పట్టాపై, అదే చక్రం అనంత దూరాలు సాగినట్లుగా
ఎరుపు, ఆకుపచ్చ కాంతుల మధ్య వాని జీవితం
జీవరాహిత్య గూడ్సు బండిలా సాగుతూంటుంది.

పట్టాకు, చక్రానికి మధ్య నలిగిన రూపాయి బిళ్లలా
షిఫ్టుకీ, షిఫ్టుకీ మధ్య వాని జీవగడియారం చితికి
ఎపుడో వచ్చే వృద్ధాప్యాన్ని ఇపుడే బోనస్ గా అందిస్తుంది.

ఒక్క పొరపాటు
వేయి శవాలను పీల్చుకొనే మూడడుగుల నేలనే సత్యం
వాని నరాలలో పాదరస ప్రవాహాల్ని పరుగులెట్టిస్తుంది.

తప్పుకొన్న పట్టాల మధ్య పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి
తనో నిలువెత్తు ఎర్రజెండాయై
పరిగెత్తే రైలుకు ఎదురెళ్తూ వేసిన వెర్రికేకలు
అసహనపు ప్రయాణీకుల తిట్లలో కరిగిపోతాయి.

మెలుకువ గాజు పెంకులపై
అతను చేసిన తపస్సు ఫలితంగా
నిదురించే ప్రయాణీకులు
తమ తమ గమ్యాలలోకి మేల్కంటారు.

సాఫల్యం

ఏం బుద్ధి పుడుతుందో
కొద్దికొద్దిగా నన్ను శ్వాసించటం
మొదలుపెడతావు.
నెమ్మదినెమ్మది గా నన్ను
ప్రేమించానని తెలుసుకొంటావు.
ఆ క్షణమొక పుష్పమై
నీమది కిటికీలోంచి తొంగిచూసి
నాకై వెతుకుతుంది.

నీ జీవితంతో నా స్వప్నాలు ఫలించాయి.

మార్పు

చాలాకాలం తరువాత కలిసాం
నా హృదయంలో ముద్రించుకొన్న
ఆ 'నువ్వుని' నీలో ఎంత
శోధించినా కనిపించలేదు.

మనం కలుసుకోకుండా ఉంటే
ఎంత బాగుణ్ణు.

పటాటోపం

నేలను, సూర్యుడినీ దోచుకొని
దాచుకొన్న సౌందర్యాన్నంతటినీ
కోల్పోయిన సుమం
మౌనంగా మరణించి
కాల లోయల్లోకి జారిపోయింది.

వికసించటంలోనే దాని చావుందని
తెలియక ఎంత పటాటోపాన్ని ప్రదర్శించిందీ!

దొమ్మరి పిల్ల

మృత్యు తీగపై మోళీ కట్టే బాలిక
అడుగులో అడుగేసుకొంటూ నడుస్తూంది.
ఆమె పట్టుకొన్న వెదురుగడకు
ఒక వైపు జీవిక, మరోవైపు బాల్యం
వేలాడుతున్నాయి.
చిన్న అపశృతి
రోడ్డుపై రక్తపు మరక.

దేముడు
పని ఇంకెప్పటికి నేర్చుకొంటాడూ?

సాంగత్యం

బయట
ఉరుములు మెరుపులతో
కుంభవృష్టిగా వాన.
అర్ధనిమీలిత నేత్రాలతో
ప్రశాంతంగా నిద్రిస్తున్న నీవు.
సన్నిధిలో ఎంతటి
భరోసా ఉంటుంది.

గిల్టీ

బండి చక్రం క్రింద
తొండ పడింది.
చూస్తూండగానే
దాన్ని గద్ద తన్నుకుపోయింది.
అయిదేళ్ల మా పాప కళ్లల్లో
కళ్లుపెట్టి చూడలేకున్నాను.

ఆవకాయ్.కాం వెబ్ పత్రిక జనవరి 3, 2008

అవని ఏమంది?

చిల్లులు పడిన ఓజోను దుప్పటిని కప్పుకుని
పీలికలైన పచ్చని చీరను చుట్టుకొని
నీళ్లలో తడిసి ఒరిసిపోయిన పాదాలతో
తీవ్రమైన జ్వరంతో వణుకుతున్న
అవని ఏమంది?

కుచించుకుపోతున్న అడవులు
వాహనాలు వెతచిమ్ముతున్న విషాలు
ఎడారులయ్యే పంటభూములు
తీరాలను ముంచెత్తే సాగరాలు
వ్రణాలు పడుతున్న పర్యావరణం....
బిడ్డా .... కళ్లుతెరు.... కళ్లుతెరు అంది.

అవని ఏమంది?
సూర్య పవన జలశక్తులను మచ్చిక చేసుకొని
శిలాజ ఇంధన హోమాన్ని నిలువరించమంది.
స్విచ్ ఆఫ్ చేసినా స్టాండ్ బై లో ఉంచినా
పరికరాలు పీల్చుకొనే లవలేశ శక్తినీ
అన్‌ప్లగ్ చేసి అరికట్టమంది.
ఫిలమెంటు బలుబుల వేడి వెలుగు స్థానంలో
ఫ్లోరెసెంట్ కాంతుల వెన్నెలను పూయించమంది.

స్విచ్ నైనా కుళాయినైనా 'అయితే ఏంటటా?' అనే నిర్లిప్తతనైనా
లేచి వెళ్లి కట్టేయటానికి బద్దకించవద్దన్నది.

అవని ఏమంది?
నియంత్రించలేని విషవలయంలోకి పోయి
మిమ్మల్ని మీరే తొలగించుకోవద్దంది.

ఒక్కక్షణం ఆపమంది
ఉక్కిరిబిక్కిరవుతున్న తాను

ఊపిరి తీసుకోవటానికి
ఒక్క క్షణం ఆర్పమంది
ఎక్కుతున్న తన కంఠం
గుక్క తిప్పు కోవటానికి

అవని ఏమంది?
ఒక్కక్షణం ఆపమంది
ఒక్కక్షణం ఆర్పమంది
ఒక్కక్షణం ఆపమంది
ఒక్కక్షణం ఆర్పమంది

గ్లోబల్ వార్మింగ్ పై అవగాహనా ప్రచారంలో భాగంగా నిర్వహించిన 'బత్తి బంద్' కార్యక్రమానికి మద్దతుగా

పాపికొండలు

ఆమెను తాకగానే,
ఓ నీటి బిందువులోంచి
నా ప్రవర వినిపించింది.
ఇక్కడి ప్రజల గుండెల్లో
గోదావరి ఉత్త నదే కాదు,
మరింకేదో!

******

పిల్లలకు చాక్లెట్లు
పంచిపెట్టే చర్చి ఫాదర్ లా
జాలర్లకు చేపలు
పంచుతోంది, నది.

******

నదికి అడ్డంగా పెద్ద కొండ
ప్రవాహం ఆగలేదు
మలుపు తీసుకొంది
జీవితం లానే!

******

డామ్ సంకెళ్లు
వేయించుకోబోతున్న
ఈ నదీ ప్రవాహాన్ని
చూస్తూంటే జాలేస్తుంది.
ఇకపై కూడికలు, తీసివేతల
ప్రకారం ప్రవహించాలి.

******

వానచినుకును
సాగరంలోకి
నన్ను కవిత్వంలోకి
చేరవేస్తోందీ, నది.

******

నీరు లేక బయటపడ్డ నదీగర్భం
రాచపుండు గుంతల్లోంచి
కనిపించే వెన్నెముకలా ఉంది.

******

ఒక్క క్షణం ఆగానో లేదో
నది, నన్ను దాటుకొని
నవ్వుకొంటూ వెళ్లి పోయింది

ముళ్ల గాయాలు

ఆకుల వలనుంచి
తప్పించుకొన్న కాంతి,
చేతికి చిక్కని నీడల పొదల్ని
నేలపై చిత్రిస్తూంది.
అనంత జీవనానుభూతుల మధ్య
దొరక్కుండా ఆడించే
ఒకటో రెండో స్వప్నాల్లా.

నువ్వైనా నేనైనా
గుప్పెడు స్వప్నాలమే! కదా?
లేకుంటే పిడికెడు జ్ఞాపకాలము.
తుమ్మచెట్టు గుండా వీచే గాలికి
చర్మం నిండా ముళ్లగాయాలే! పాపం.

ఒంటరితనాన్ని గుర్తుచేసే
రాత్రి మళ్లా వచ్చేసింది.
పగటి కన్నీటి చారికల్ని
నిదురవాన కడిగేసింది.

కనులు తెరచి సూర్యోదయాన్ని
నూత్న శిశువులా ఆహ్వానిద్దాం

కవిత్వం నా ఇంటిపెద్ద

ప్రశ్నల ఇసుకను
కళ్ళల్లో చల్లి పోతుంది ఒక్కో అనుభవం.
అపుడు కలిగే ఆలోచనలను
గ్లాసులు బంధించలేవు
గదులు నిర్బంధించలేవు
హృదయం కట్టి పడేయలేదు.
ఫలితంగా
లోపల్లోకంలో వీచే వెర్రి గాలులకు
చెట్లకొమ్మలు ఊగిపోతూంటాయి.

అపుడు కవిత్వం
పరామర్శించటానికి వస్తుంది.
అపుడు కవిత్వం
ధైర్యవచనాలు చెప్పి ఓదారుస్తుంది.
అపుడు కవిత్వం
నన్ను మళ్ళా మనిషిని చేస్తుంది.

అందుకే
కవిత్వం నా ఇంటిపెద్ద..

.

వంశ వృక్షం

ఒక వృక్షం
ఇష్టంతోనో, అయిష్టంగానో
కొమ్మలు రెమ్మలుగా విడిపోయి
నలుదిక్కులకూ చెదిరిపోవటం
ఎంతటి అనివార్యమిపుడు!

అవసరపడో, అనురాగంతోనో
ఆ కొమ్మలన్నీ తమ పువ్వుల, తుమ్మెదల
సమేతంగా గుమిగూడటం
ఎంతటి అబ్బురం!

తమలో ప్రవహిస్తున్న పత్రహరితపు
మూలాల్నీ, మార్గాల్నీ
తెలుసుకోవటం, తెలియచెప్పటం
ఎంతటి సంబరం!

అన్ని వర్ణాలూ
ధవళ కాంతిలోకి కుప్పకూలినట్లుగా
అన్ని శాఖలూ
వంశమనే అద్దంలో ఒదిగిపోవటం
ఎంతటి లీలా వినోదం!

నాస్టాల్జిక్ పొత్తిలిలో
కేరింతలు కొడుతున్న
వృక్ష శకలాలను సమయం
చెర్నకోలై అదిలించటం
ఎంతటి ఛిద్ర దృశ్య విషాదం!

పోలవరం నిర్వాసితుల కోసం.....

నాకు పెద్దగా లెక్కలు రావు
ఎన్ని వందల స్మశానాలో
ఎన్ని లక్షల శవాలో
ఎన్ని కోట్ల వెలుతురు గింజలో
నే చెప్పలేను.

రెండు కొండల మధ్య సూర్యుని చూపి
అది ఏ సంధ్యంటే ఎవరు మాత్రం
ఏం చెప్పగలరు!

లక్షల సంవత్సరాల
కన్నీళ్ళు నెత్తురులు
ఇంకించుకొన్న ఈ నేల
ఇకపై తన పరిమళాల తూనీగల్ని
ఎగరేయదంటే ఎందుకో
హృదయంలో ఇసుక నింపినట్టుంది.
ఇంకా తవ్వబడని ఓ నాగరికతను
జల సమాధి చేసేస్తుందీ నేల

ఏడుతరాల అన్వేషణలో ఎవరో
ఓ మానవుడు ఇక్కడకు వస్తే
ఇక ఈ నేల ఏమి చూపగలదూ
నిలువెత్తు అంధకార జలస్థంభాన్ని తప్ప.

ఈ మట్టినే నమ్ముకొన్న
చెట్టు ఇకపై పాదదు.
పిట్ట ఇకపై పూయదు.

మనిషి మాత్రం
ఇక్కడ తన్ను తాను నరుక్కొని
మరెక్కడో పాతుకొంటున్నాడు.
ఆ రక్తరహిత జననం కోసం
తట్టా బుట్టా సర్దుకొంటూ, ఈ నేలతో
తన అనుబంధాల్ని, అనుభవాల్ని
ఎలా తీసుకెళ్ళాలో తెలీక
అలా వానలో తడుస్తున్నాడు.

సుళ్ళుతిరిగే మౌనంపై
శూన్యంలోంచి కురిసే వాన
సూదులతో గుచ్చే ముళ్ళ వాన.

తడిచేవానికే తెలుస్తుంది
తడి పదునెలా ఉంటుందో.
(పోలవరం ప్రోజెక్టు నిర్మాణంతో కనుమరుగయ్యే వందల ఊళ్ళను, నిర్వాసితులయ్యే స్థానికులను తలచుకొంటూ)

ష్

బలాన్నంతా కూడదీసుకొని
దూరంగా విసిరేసిన ఓ స్వప్నం
మెల్లమెల్లగా కనుమరుగైంది
ఎగిరే పక్షికూతలా.

అక్కడ ఆ చీకటిచలిలో
అదిచేసే దుర్భల ఆర్తనాదం
లీలగా వినిపిస్తోంది.
లేదు అవును లేదు అవును అవును
అవును అదింకా నన్ను ప్రేమిస్తూనే ఉంది.

ఎపుడో ఒకప్పుడు
అది ఓ రెక్కల గుర్రమై
ఎగురుకుంటూ వచ్చి
నన్నెక్కించుకొని
ఆ కొండపై దింపుతాది.

అప్పటికి ఈ ప్రపంచం
ఇంకా లోయలోనే ఉంటుంది.

స్ట్రీట్ చీమలు

అంత తక్కువకైతే కిట్టదయ్యా
మరో రెండురూపాయిలిప్పించండి.
లేదు లేదు నీకు కిడితేనే ఇవ్వు
బలవంతం ఏముంది?
ఆ రాత్రి
కప్పు కంతల్లోంచి చుక్కల్ని చూస్తున్న
జాంకాయల వ్యాపారినడిగింది భార్య
'వచ్చేవారం పిల్లాడి పుట్టిన రోజు గుర్తుందా?'

ఊరిలోని పెద్దపులిని ఎవరో చంపేసార్ట
షట్టర్లు మూసుకొన్నాయి, తాళాలు పడ్డాయి
లాఠీలు పగిలాయి, తుపాకులు పేలాయి.
డబ్బు డబ్బును కాపాడుకొంటూంది.
రేపేమిటన్న ప్రశ్నకు మత్తుమందిచ్చి
నిద్రపుచ్చిన పాతబట్టల వ్యాపారి
'నాకాకలిగా లేదు నువ్వు తినేసి పడుకో' అన్నాడు భార్యతో

'బేరంలేదని నేటి వడ్డీ రేపు కడతానంటే ఎలా'
ఉన్నదంతా పీల్చుకుపోయింది
రోజుకు ఇరవై రూపాయిల వడ్డీ జలగ.
నిద్రకు ముందు ఆ తాళంచెవుల వ్యాపారి విన్న ఆఖరుమాటలు
'కొన్న మందులు రేపటితో అయిపోతాయి
డాక్టరు చీటి జేబులో పెడుతున్నాను
తెచ్చుకోవటం మర్చిపోవద్దు'

ఎండిన ఖర్జూరంలాంటి దేహంతో
అలంకరణ సామాన్లమ్మే ఆ ఒకనాటి ఆటకత్తె
ఎర్రటి ఎండకు తాళలేక చెట్టుకిందకు చేరింది.
'అమ్మా పుస్తకాలు తొందరగా కొనుక్కోమంటున్నారే

రేపు కొంటావా?' అనడిగిన కొడుకుకు
ఆ రాత్రామేం సమాధానం చెప్పింది?

'మామ్మా ఇవి తీసుకో' అని మిగిలిపోయిన
పళ్ళని వీధి బిచ్చగత్తెకిచ్చేసి ఇంటికి
బయలుదేరాడతను చుక్కల వెలుగులో
'నాన్నా స్కూలు వెళ్ళాలంటే భయంగా ఉంది
ఓ కుర్రాడు వెంటపడి వేధిస్తున్నాడు' బేలగా అంటోంది కూతురు.

'బండి ఇక్కడ ఎందుకు పెట్టావురా దొంగవెధవా'
తన్నిన తన్నుకు బండిమీద చైనా వస్తువులు
రోడ్డుపై చెల్లాచెదురూ ట్రాఫిక్ ఆగుతుందా?

******

కొన్నిరోజుల తరువాత
సూర్యుని వెనుకే ఉదయించిన
మీసాలింకా రాని స్వరమొకటి ఇలా అరుస్తోంది
'జత పది **జత పది** జతపది

ఫ్రాగ్మెంట్స్

ఇక ఇప్పుడు
సంభాషణ అంటే
సెల్‌ఫోను డిస్‌ప్లే లో
నంబరు చూసుకొని
టాక్ బటను నొక్కడమే!
నాగరికతా
నరకాన్ని ప్రేమిస్తాను
కొలిమిలోకి ఒంటరిగా సాగనీ!

******

రాత్రి నుంచి వానచినుకులు
మంత్రాల్ని జపిస్తూ
ఆకులతో వల్లె వేయిస్తూన్నాయి.
వానచినుకుల
చుంబనాలతో అలసిన
తడితడి పూలపెదవులపై
వేకువ వెండివెలుగై పరుచుకొంది.

******

అలంకరణ అద్దం
ఆమె అందాన్నంతా
తిరిగిచ్చేసింది.

******

పావుగంటగా ఆలోచనలేమీ లేవు
యవ్వనం ఫోల్డర్ తెరచా!
నీ పరిమళం చుట్టుముట్టింది.

******

‘బాబూ! ఒక స్ట్రిప్ ఐ పిల్స్ ఇవ్వు’
జీన్స్ లో ఆమె
బైక్ పై అతను
రసాయిన సమానత్వం

******

పాతికేళ్ళలో ప్రపంచం
ఎంత మారిపోయినా
మా ఊరి తాటి ముంజెలకు
ఇంకా అదే రుచి

******

సీసాలో ద్రవంలా
ఈ లోకపు అన్ని వంకరలనూ
ఇముడ్చుకొన్న నాడు
సంకెళ్ళు కూడా సుఖంగా ఉంటాయి

******

కొబ్బరాకుల వెనుక
నిశ్శబ్ద చంద్రోదయం
వెన్నెల చక్కిలిగిలికి
రాలిన కొబ్బరి పూత

******

కోరికకు సాఫల్యానికి
మధ్య అగాధం.
చితిలో ఇంకా నిప్పుంది
పోరాడాల్సిందే.

******

నగ్న తరువులకి
పత్రాల పుష్పాల దుస్తులు లేవు.
వసంతం వస్తోంది.

******

రోడ్డుపై
పేదేరుకొనే పిల్లగాని చెమట
కుండీలో
గులాబీల్ని పూయించింది.

******

వసంతం చివరి రోజున
జన్మించిన సీతాకోకచిలుక
చీమలకు చిక్కింది.
ఇంద్రధనుస్సు చచ్చిపోయింది.

******

దేవుని పటానికి
ప్లాస్టిక్ దండ.
ఎన్నటికీ వాడని
కోపం.

జీవన మాధుర్యం

చేయాల్సిన పనులలా
మిగిలిపోతూనే ఉంటాయి.

కెరటాలు ఒకదానివెనుక ఒకటి
పరుగులెడుతూనే ఉన్నాయి
నెలనెలా వెన్నెల కుబుసం
ఆకాశం నుండి రాలిపడుతూనే ఉంది.
వర్షాకాలంనుంచి తీసుకొన్న పగ్గాల్ని
వేసవికిచ్చేసి సాగిపోతుంది శీతాకాలం

చేయాల్సిన పనులలా
పేరుకుపోతూనే ఉంటాయి.

కొన్ని పనులు
మరుపులోయల్లోకి జారినట్టే జారి
ఫీనిక్స్ పక్షుల్లా పైకి లేస్తున్నాయ్.

రేపు, వచ్చే ఏడాది, ఎప్పటికైనా అంటూ
చేయాల్సిన పనులు
భవిష్యత్తు నిండా పాదులా
అల్లుకొని బిగుసుకొన్నాయి.
జీవితాన్ని అడ్డంగా నిలువుగా
అడ్డదిడ్డంగా పరుగులెట్టిస్తూన్నాయి.

రెండుకాళ్లపై నించొని
ఆకులనందుకో యత్నించే మేకపిల్లలా
హృదయం శ్రమిస్తూనే ఉంది.

అయినా సరే
చేయాల్సిన పనులలా
మిగిలిపోతూనే ఉన్నాయి.

ఆటో ప్రకాష్ 9945029294

(వైజాగ్ లో ఒక ఆటోడ్రైవర్ గర్భిణీ స్త్రీలను ఉచితంగా హాస్పటల్ కు తీసుకు వెళ్ళటం పట్ల చూసిన వార్తకు స్పందించి)

ప్రపంచం దృష్టెపుడూ
పసిపాపలపైనే
ప్రేమించటానికో లేక
వ్యాపారించటానికో.

అయితె ఇతని చూపు
పండు భారానికి వంగిన కొమ్మపై ఉంటుంది.
నిండుగర్భిణిని పాపాయిగా మార్చి
పొత్తిళ్ళలో పొదుగుకోగలడు.
మూలాలపై మమకారమే తప్ప
వ్యాపారముండదిక్కడ.

నెలలు నిండిన స్త్రీ ని చూస్తే
మగవాడికి భయమో జలదరింపో!
బహుసా స్త్రీ ముందు తన
అస్థిత్వమేమిటో గుర్తొస్తుందేమో.
ఇతనికి మాత్రం
తన శైశవపు పెదవులనుండి
శబ్దిస్తూ విడిపోయిన తన తల్లి
చన్మొన జ్ఞప్తికొస్తుందేమో.

కాన్పుకు సిద్ధమైన స్త్రీ నడుస్తూంటే
మృత్యువు, ప్రాణమూ
కలిసి తిరుగుతున్నట్లుంటుంది.

సృష్టిగాలులకు ప్రాణదీపం
రెపరెపలాడే ఆ రాత్రివేళ

మనిషికీ మనిషికీ మధ్య
నమ్మకపు పరిమళం ప్రవహిస్తుంది.
ఇతని మనిషితనం ముందు
మృత్యుదేవత తలదించుకొని
మౌనంగా నిష్క్రమిస్తుంది.

పుడమి లోతుల్లోంచి
మరో ఉదయం బయటపడింది.
దానిని తవ్వితీసిన తల్లి పొడికనులు
ఇతనిని తడిగా చూసిన చూపుల భాషలోనే కదా
ఈ లోకపు కీర్తనలన్నీ వ్రాయబడ్డాయి!

అంచులవరకూ నిండిన తృప్తితో
ఇతనూ వెనుతిరుగుతాడు
ఎప్పటిలానే!

చేయాల్సిందల్లా......

సూర్యుడు, నదీ
కొండల పంజరంలో
చిక్కుకొన్న గానుగెద్దులు....
ఒకటే దారి, ఒకటే గమ్యం
దేహాలతో వచ్చిన చిక్కే ఇది.
అదే హృదయాన్ని చూడు
ఎంత విశృంఖల విహారియో
అన్ని దారులూ తనవే
అన్ని గమ్యాలూ తనకే
హృదయం ఆలోచనలను
కాలంలోకి ప్రవహింపచేస్తూంటుంది.
స్వప్నాలను బలంగా వెలుగులోకి తోసే రాత్రిలా.

చేయాల్సిందల్లా
హృదయాన్ని నిత్యం కొలిమిలో
జ్వలింపచేసుకోవటమే.

లేదూ
తూనీగై మబ్బుల్ని ముద్దిడిన ఉదయంలా
రాలిపోనూవచ్చు లేక
పండులా ఫలించిన సాయింత్రమై
పగిలిపోనూ వచ్చు.

రాలిపోయె ఆకుల సవ్వడిని
నిశ్శబ్దం కూడా గుర్తించదు.

పులసా! పులసా!

ఇక్కడే గుడ్లు పెట్టాలనే
లక్షల సంవత్సరాల నీ ఇన్స్టింక్ట్ ని
ఇకనైనా మార్చుకోలేవా?
ఆనాటి మానవులం కాం మేమిపుడు.
మనిషిని మనిషే అంగట్లో
సరుకుగా మార్చే కాలమిది.

బజారు గట్టుపై నీవు
మృత్యు జలాలలో ఈదుతూన్నపుడు
నీ కనుల మెరుపుకి నా హ్యూమన్ రైట్సన్నీ
కాలి బూడిదయ్యాయి.

సాగరాల్ని ఓడించిన
నీ రెక్కలు మౌనం దాల్చినపుడు
నా జాతి ఔన్నత్యమంతా
హా హా కారాలు చేస్తూ ఆవిరయ్యింది.

'సెన పులసైతే రేటెక్కువ'
అన్న మాటవద్ద, సరిగ్గా అక్కడే
నా జాతి భవిష్యత్తు నాకు
స్పష్టంగా కనిపించింది.

'పుస్తెలు తాకట్టు పెట్టైనా పులసను తినాలి'
అంటూండే మా అనాగరీక తాత
ఇపుడైతే
'పుస్తెలమ్మైనా పులసను కాపాడండ్రా'
అనే వాడేమో!

(నదీ పరీవాహక ప్రాంతాలలోకి గుడ్లు పెట్టటానికై సముద్రం నుంచి, ఇక్కడి వలలకు చిక్కి దాదాపుగా అంతరించిపోయిన పులస చేపల గురించి)

ఎందుకు?

ఎవరు వింటారని ఈ అక్షరాలను
వెదురు రంధ్రాల గుండా
ప్రవహింపచేస్తున్నాను!

ఎవరు చూస్తారని
ఈ భావాలకు రెక్కలు తొడిగి
నీలాకాశంలోకి ఎగరేస్తున్నాను!

ఎవని మనోయవనికపై
మొలకెత్తుతాయని
ఈ కవితా బీజాలను రాల్చుకొంటున్నాను!

ఏమో తెలీదు బహుసా
గాలికి పిట్టకి చెట్టుకీ
కూడా తెలీదేమో!

బొల్లోజు బాబా

తల్లిదండ్రులు	బొల్లోజు బసవలింగం, అమ్మాజి
సహచరి	సూర్య పద్మ
పిల్లలు	అపరాజిత, బసవ శ్రీధర్
చదువు	M.Sc.,B.Ed.,M.Phil.,(Ph.D)
వృత్తి	జంతుశాస్త్ర అధ్యాపకుడు,
రచనలు	'యానాం విమోచనోద్యమం' (1954 లో యానాం లో ఫ్రెంచి పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం గురించి)
ఇ.పుస్తకాలు	విశ్వకవి రవీంద్రుని 'స్ట్రే బర్డ్స్' అనువాదం
	'ఎడారి అత్తరులు' ప్రముఖ సూఫీ కవుల కవిత్వానువాద సంకలనం
	పాబ్లో నెరుడా 'ఇరవై ప్రేమ కవితలు ఒక విషాద గీతం' కు స్వేచ్ఛానువాదం

పై ఇ.పుస్తకాలను అంతర్జాలంలో పి.డి.ఎఫ్. రూపంలో http://www.scribd.com/bollojubaba అనే సైటు లో చదువుకొనవచ్చును.

బ్లాగు: http://sahitheeyanam.blogspot.com/

ఫోను నం: 9849320443, 0884/2368189